వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

విద్యార్థులలో మాదకద్రవ్యాల వ్యసనం పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి
సార్వత్రిక విద్యావిధానం రూపొందించాలి 07
భరద్వాజ్‌కు ఒకరోజు పోలీస్ కస్టడీ

సంపుటి 09, సంచిక: 277 | ఆదివారం | 06-09-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## దేశంలోనే అతిపెద్ద ఎఐ డేటా సెంటర్

హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు టిసిఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటన

- రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం
- రూ.70వేల కోట్ల పెట్టుబడితో 250 ఎకరాల్లో అభివృద్ధి
- దేశానికే చారిత్రక ప్రాజెక్ట్ : సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోనే అతిపెద్ద 'ఏఐ డేటా'సెంటర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు టిసిఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్ ప్రకటించింది. దీనికి సంబంధించి ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. హైదరాబాద్‌లో 250 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఒక గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో అత్యాధునిక 'ఏఐడేటా' సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయ నున్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణలో హైపర్ వాల్ట్, భాగస్వామ్య సంస్థలు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లో ఇది ఒకటిగా నిలవనుంది. టిసిఎస్ ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం సమావేశమైంది.ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమా,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె.రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సిఈఒ బి. అజిత్ రెడ్డి, టిజిఐఐసీ ఎండి కె.శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తితో పాటు టిసిఎస్ సిఇఒ కె.కృతివాసన్, సిఒఒ ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి.రాజన్న, హైపర్ వాల్ట్ సిఇఒ, ఎండి దీపేష్ నందా పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమెరికా నుంచి ఒపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 'ఏఐ డేటా' సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు అంశంలో టిసిఎస్ అనుబంధ సంస్థ హైపర్ వాల్ట్, రాష్ట్ర ప్రభుత్వంతో మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నట్టు ప్రభుత్వ తరువాయి 8లో

## ప్రజల్లోకి రాకుండా

# ఫామ్‌హౌస్ రాజకీయాలా?

'నాకు చదువు లేదని బిఆర్‌ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు'
– సిఎం రేవంత్‌రెడ్డి



కెసిఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలి
వచ్చే ఎన్నికల్లో 90 సీట్లు గెలుస్తాం

- కెసిఆర్‌ది కుటుంబ పాలన.. కాంగ్రెస్‌ది సామాజిక న్యాయం
- గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవీ రద్దు చేయలేదు
- 30 నెలల్లో రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశాం
- రూ.2 లక్షల వరకు రుణమాఫీ కోసం, రూ.30వేల కోట్లు విడుదల చేశాం
- దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల, అసెంబ్లీ ఎక్కడైనా చర్చకు సిద్ధమే
- నకిరేకల్ ప్రజాపాలన – ప్రగతి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- రుణమాఫీ ఎవరెంత చేశారో తేల్చుకునేందుకు తండ్రీ కొడుకు, మామా అల్లుళ్లు అసెంబ్లీకి రావాలని ఘాటు వ్యాఖ్య



ప్రజాపక్షం/నల్లగొండ

తెలంగాణలో రాబోయే పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరిగితే 117 సీట్లు,పెరగకపోతే 90 సీట్లు గెలిచి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో ఇందిరమ్మ పాలన కొనసాగడం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి సభలో ఆయన బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆపార్టీ నాయకులపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వచ్చే పదేళ్లపాటు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఏం జరిగిందో,కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో ఏం చేసిందో ప్రజలు పోల్చి చూడాలని సీఎం సూచించారు.గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా తమ ప్రభుత్వం రద్దు చేయలేదన్నారు. ప్రజల రక్తం, చెమటతో నిర్మితమైన ప్రభుత్వ వ్యవస్థ నుంచి వేతనం తీసుకుంటూ అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లో ఉంటున్న కేసీఆర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా ఫామ్‌హౌస్ రాజకీయాలు తరువాయి 8లో





## కరీంనగరం ఎరుపుమయం

నేటి నుంచి ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలు

- ప్రధాన కూడళ్లలో ఎఐటియుసి తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీలతో నగరానికి అరుణశోభ
- మహాసభలకు ఘన ఏర్పాట్లు చేసిన ఆహ్వాన సంఘం

ప్రజాపక్షం/కరీంనగర్

ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు నేటి నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్ నగరంలో జరగనున్నాయి. పద్మనాయక కళ్యాణ మండపంలో జరగనున్న మహాసభలకు ఆహ్వాన సంఘం ఘనంగా ఏర్పాట్లు చేసింది. నగరంలోని ప్రధాన కూడళ్లను ఎఐటియుసి తోరణాలు, జెండాలతో అలంకరించారు. మహాసభలకు ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి హాజరకానున్నారు. మూడు రోజుల పాటు జరిగే మహాసభలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తున్న 33 జిల్లాల నుండి కార్మిక ప్రతినిధులు దాదాపుగా 800 మంది హాజరవుతున్నారని వారందరికీ ఆతిధ్యం ఇవ్వడానికి కరీంనగర్ లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆహ్వాన సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఎఐటియుసి రాష్ట్ర మహాసభల సందర్భంగా నేడు భారీ ర్యాలీ, బహిరంగ సభను నిర్వహించనున్నారు. అంబేద్కర్ స్టేడియం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ చౌక్ లోని సర్కస్ గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ.. అనంతరం సర్కస్ గ్రౌండ్ లో సాయంత్రం 4 గంటలకు భారీ బహిరంగ సభ జరుగనుంది.


**ఏర్పాట్లను పరిశీలించిన చాడ..**

ఎఐటియుసి మహాసభల ఏర్పాట్లను, నేడు సర్కస్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను మహాసభల చీఫ్ ప్యాట్రన్ తరువాయి 8లో


## లారీని ఢీకొట్టిన కారు

ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

- కేరళంలోని త్రిస్సూర్ జిల్లాలో ఘోర దుర్ఘటన
- లారీ డ్రైవర్ తప్పిదం వల్లే ప్రమాదమని పోలీసులు వెల్లడి



**త్రిస్సూర్ :** కేరళంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మధ్య కేరళంలోని త్రిస్సూర్ జిల్లాలో జాతీయ రహదారి 66పై అక్రమంగా నిలిపి ఉంచిన లారీని ఓ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఎనిమిది మంది ఇంజనీరింగ్ విద్యార్థులు మరణించారని పోలీసులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి 11:40 గంటల ప్రాంతంలో కైపమంగళంలోని పనంబిక్కున్ను వద్ద ఈ ప్రమాదం జరిగింది. గురువాయూర్ నుండి కొడుంగల్లూర్ వైపు వెళ్తున్న కారు, మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ కలిగిన లారీ వెనుక భాగాన్ని ఢీకొట్టిందని పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. రహదారి నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ మళ్లించిన ప్రాంతంలో, బారికేడ్లు ఏర్పాటు చేసిన ప్రదేశానికి సమీపంలో హైవే కుడి వైపున ఆ లారీని అక్రమంగా నిలిపి ఉంచారు. కారు వేగంగా వెళ్తోందని, ఢీకొట్టే ముందు డ్రైవర్ ట్రాఫిక్ మళ్లింపు బారికేడ్‌ను గమనించలేదని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆరుగురు తరువాయి 8లో



## ప్రపంచ పటంలో దిద్దుబాటు

- ఇక ప్రముఖంగా దర్శనమివ్వనున్న ఆఫ్రికా ఖండం
- 164 దేశాల మద్దతుతో ఐరాస తీర్మానం
- అనుకూలంగా ఓటు వేసిన భారత్
- వ్యతిరేకించిన ఏకైక దేశం అమెరికా

**న్యూయార్క్ :** ప్రపంచపటంలో ఇన్నాళ్ళుగా ఉన్న ఒక తప్పును ఐక్యరాజ్యసమితి సరిదిద్దింది.శతాబ్దాలనాటి సంప్రదాయబద్ధమైన ప్రపంచ పటంలో ఆఫ్రికా ఖండాన్ని చాలా చిన్న పరిమాణంలో చూపిస్తూ వచ్చారు.ఆ తప్పును సరిదిద్దుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం చేసింది. గ్రీన్‌లాండ్ ద్వీపం కంటే తక్కువ సైజులో ప్రపంచపటంలో ఆఫ్రికాఖండం కనిపిస్తూ వస్తోంది. వాస్తవానికి గ్రీన్‌లాండ్ కంటే పరిమాణంలో ఆఫ్రికా 14 రెట్లు పెద్దది.ప్రపంచపటంలో ఇకమీదట ఆఫ్రికాఖండం కొట్టొచ్చినట్టు దర్శనమివ్వనున్నది.ఆఫ్రికాలోని టోగో రిపబ్లిక్ ప్రతిపాదించిన తీర్మానానికి ఆఫ్రికన్ యూనియన్ (ఎయు) సభ్యదేశాల మద్దతు లభించింది. ఈ మేరకు ''కరక్ట్ ద మ్యాప్'' (ప్రపంచ పటాన్ని సరిదిద్దండి) అనే పేరుతో ఐక్యరాజ్యసమితిలో ప్రతిపాదించిన తీర్మానం బ్రిటన్, ఫ్రాన్స్ సహా 164 దేశాల మద్దతుతో ఆమోదం పొందింది. భారతదేశం అనుకూలంగా ఓటు వేయగా, ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఏకైక దేశం అమెరికా మాత్రమే.ఎలాంటి తప్పులూ లేకుండా మరింత ఖచ్చితత్వంతో ఈ ప్రపంచపటం ఉంటుందని భారతదేశ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ఎస్తోనియా, జార్జియా, లిథువేనియా, మోల్డోవా, సెర్బియా, ఉక్రేన్ సహా మొత్తం ఆరు దేశాలు ఈ ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. ఈ తీర్మానం ద్వారా సంప్రదాయబద్ధంగా ఉన్న మెర్కేటర్ పటాన్ని దశలవారీగా తరువాయి 12లో

## త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వం బర్తరఫ్

హామీల అమలులో పూర్తిగా విఫలం
అడ్డమైన జిఒలు తెచ్చి పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును బలిపెడుతున్నారు
కరీంనగర్ యువ సమరభేరి సభలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/కరీంనగర్

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో విద్యార్థి, యువతతో కలిసి శనివారం నిర్వహించిన యువ సమరభేరి సభకు కెటిఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువతను ఉద్దేశించి కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ తెచ్చిన కెసిఆర్ రాజీనామా చేయాలా, వెయ్యి రోజులైనా హామీలు అమలు చేయని రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని కెటిఆర్ ప్రశ్నించారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేసుడు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల భూములను నిషేధిత జాబితాలో చేర్చి చెలగాటమాడుతోందని, అందుకే కాంగ్రెస్ పార్టీని నిషేధిత జాబితాలో పెట్టే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ మూడేళ్లయినా ఒక్క జాబ్ కూడా తరువాయి 12లో

## భూ దోపిడీకే 22ఎ

అనుమతి ఉన్న స్థలాలనూ ఆ జాబితాలో చేర్చి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ దందాకు పాల్పడుతోంది
60 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు
ఇందిరా పార్క్ వద్ద బిజెపి 'మహాధర్నా'లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

గతంలో కెసిఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో దోచుకుంటే, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూభారతి పేరుతో అదే దోపిడీని కొనసాగిస్తోందని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణలో భూభారతి, 22ఎ నిషేధిత జాబితా పేరుతో ప్రభుత్వం రైతులు, మధ్యతరగతి ప్రజల భూములను అక్రమంగా లాక్కుంటుందని ఆరోపిస్తూ శనివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ వద్ద బిజెపి ఆధ్వర్యంలో 'మహాధర్నా' నిర్వహించారు. బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ మహాధర్నాలో కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, ఎంపిలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, పలువురు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. కిషన్ రెడ్డి తరువాయి 12లో




## మాతాశిశు కేంద్రంలో బాలుడి కిడ్నాప్

చాక్లెట్ కొనిస్తానని ఎత్తుకెళ్లిన మహిళ
నిజామాబాద్ పట్టణంలో ఘటన

ప్రజాపక్షం/నిజామాబాద్

జిల్లా కేంద్రంలో కొన్ని నెలల క్రితం నవజాత శిశువు మృతదేహం డ్రైనేజీలో లభించిన ఘటన మరిచిపోక ముందే ఓ బాలుడి కిడ్నాప్ సంఘటన కలకలం రేపింది. శనివారం నిజామాబాద్ తరువాయి 12లో




## ఇది కూడా ఒక రికార్డే!



ప్రపంచ రికార్డులు నెలకొల్పడానికి ఫలానా విభాగం లేదా రంగం అనేది లేదు. అందుకే, చికాగోలోని ఒక బార్ దాదాపు వేలాది మందితో ఒకే సారి స్థానిక మద్యం 'జెప్సన్స్ మలోర్ట్' షాట్లు తాగించి ప్రపంచ రికార్డు సృష్టించింది. ఈనెల ఒకటో తేదీన వెస్ట్ లూప్ ప్రాంతంలోని 'రీసెస్' బార్ నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 1,969 మంది ఒకే సమయంలో మలోర్ట్ షాట్ తీసుకున్నారు. ఈ సంఖ్యను గిన్నిస్ వరల్డ్ రికార్డుగా నమోదు చేసేందుకు కార్యక్రమాన్ని నిర్వహించారు. మలోర్ట్ సాధారణ మద్యం కాదు. స్వీడిష్ వలసదారు కార్ల్ జెప్సన్ చికాగోలో 1920లలో తయారు చేసిన ఈ పానీయంలో 'వార్మ్‌వుడ్' ప్రధాన రుచిని ఇస్తుంది. తీవ్రమైన చేదు రుచికి పేరుగాంచిన మలోర్ట్‌ను చాలామంది ఇష్టపడరు. అయినప్పటికీ చికాగో బార్ సంస్కృతిలో ఇది ఒక ప్రత్యేక గుర్తింపుగా మారింది. సోషల్ మీడియా ప్రచారం, బార్లలో సరదా సవాళ్లు, స్థానిక సంస్కృతితో అనుబంధం కారణంగా మలోర్ట్‌కు ప్రత్యేక అభిమాన వర్గం ఏర్పడింది. ఇప్పుడు 1,969 మంది ఒకేసారి షాట్లు తీసుకోవడం ఆ విచిత్రమైన చికాగో సంప్రదాయాన్ని ప్రపంచ రికార్డు స్థాయికి తీసుకెళ్లింది.

## ఖాళీ క్యాన్లతో లక్షల డాలర్లు !




చెత్త కింద ఖాళీ క్యాన్లు అమ్మితే పదో పరకో వస్తాయి. కానీ, అమెరికాలోని మిషిగాన్‌కు చెందిన 39 ఏళ్ల ఓ వ్యక్తి ఖాళీ క్యాన్లను తిరిగి ఇచ్చి సంపాదించిన కొద్దిపాటి డబ్బుతో లాటరీ టికెట్ కొనుగోలు చేశాడు. లాటరీ తగలడంతో ఏకంగా 5 లక్షల డాలర్లు (సుమారు రూ.4.2 కోట్లు) గెలుచుకున్నాడు. లివింగ్‌టన్ కౌంటీకి చెందిన ఈ వ్యక్తి ప్రతి ఆదివారం ఉదయం ఖాళీ క్యాన్లను రీసైక్లింగ్ కేంద్రానికి ఇచ్చి వచ్చిన డబ్బుతో లాటరీ టికెట్లు కొంటూ ఉంటాడని మిచిగాన్ లాటరీ అధికారులకు చెప్పాడు. భద్రతా కారణాల వల్ల పేరును వెల్లడించలేదు. సదరు వ్యక్తి సౌత్ లయన్‌లోని సివిఎస్ దుకాణంలో 'స్టాంపెడ్ పేఅవుట్' అనే 5 డాలర్ల స్క్రాచ్‌ఆఫ్ టికెట్ కొనుగోలు చేశాడు. టికెట్లను కారులో ఉంచి రోజంతా తన పనులు చూసుకున్నాడు. రాత్రి భోజనం తర్వాత టికెట్‌ను స్క్రాచ్ చేసి చూసినప్పుడు 5,00,000 డాలర్ల బహుమతి వచ్చినట్లు గుర్తించాడు. ఆనందంతో కేకలు వేస్తూ ఎగిరి గంతేశానని, ఉత్కంఠతో చేతులు వణకడంతో లాటరీ యాప్‌లో టికెట్‌ను వెంటనే స్కాన్ చేయలేకపోయానని చెప్పాడు. తనకు వచ్చిన మొత్తంతో ఇంటి రుణం తీర్చడంతో పాటు విహారయాత్రకు వెళ్లి, స్నేహితులకు విందు ఇవ్వాలని అతను నిర్ణయించుకున్నాడు. లాటరీని కూడా జూదం కింద చేరుస్తూ చాలా దేశాలు నిషేధం విధిస్తే, అమెరికాలో మాత్రం అడుగడుగునా లాటరీ కంపెనీలు ఉన్నాయి. అధికారికంగానే గ్యాంబ్లింగ్ జరుగుతుంది. కోట్లాది మందిలో ఒకరో, ఇద్దరో లాటరీ గెల్చుకుంటే, ఇది ఒక వ్యసనంలా మారి వేలాది మంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నది వాస్తవం.

## తేలియాడే ద్వీపం!



నీటి మధ్యలో ఉన్న భూమిని ద్వీపం అంటారని తెలుసు. అవి స్థిరంగా ఉంటాయి. అయితే కెనడాలోని బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్‌లోని విలిస్టన్ రిజర్వాయర్‌లో ఓ వింత దీవిని గుర్తించారు. ఇది నీటిపై తేలియాడుతూ భూగర్భ శాస్త్రవేత్తలను, స్థానికులను ఏకరీతిలో ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. సుమారు రెండు ఫుట్‌బాల్ మైదానాలంత విస్తీర్ణం ఉన్న ఈ చెట్లతో నిండిన భూభాగం తొలుత రిజర్వాయర్‌లో కనిపించి, ఆ తర్వాత అదృశ్యమైంది. చివరకు అది మొదట కనిపించిన ప్రదేశానికి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో మళ్లీ ప్రత్యక్షమైంది. ఉపగ్రహ చిత్రాలు, పడవ ప్రయాణికుల ఫొటోలు, వైమానిక పరిశీలనలతో బిసి హైడ్రో దాని ఉనికిని నిర్ధారించింది. నిజానికి ఇది వాస్తవమైన భౌగోళిక ద్వీపం కాదు. ఏళ్ల తరబడి రిజర్వాయర్ తీర ప్రాంతంలో పేరుకుపోయిన కొయ్య దుంగలు, సేంద్రియ వ్యర్థాలు, మట్టి, వృక్ష పదార్థాలపై మొక్కలు, చెట్లు పెరిగి ఒక దృఢమైన తేలియాడే పొర ఏర్పడినట్లు బిసిహైడ్రో భావిస్తోంది. ఇటీవల నీటి మట్టం అసాధారణంగా పెరగడంతో ఈ భారీ పొర ఒడ్డునుంచి విడిపోయి నీటిపైకి తేలింది. బలమైన గాలులు దాన్ని రిజర్వాయర్‌లో సుమారు 30 కిలోమీటర్లు తరలించాయి. ప్రస్తుతం అది ఒస్పికా ఆర్మ్ తీరంలో స్థిరపడింది. దాని నిర్మాణం అస్థిరంగా ఉండటంతో దానిపైకి ఎక్కడం లేదా పడవను దానికి ఆనించడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## 28 ఏళ్ల తర్వాత..



న్యూయార్క్‌లోని గ్రేట్ సకాండాగా సరస్సులో 28 ఏళ్ల క్రితం పోయిన ఓ హైస్కూల్ క్లాస్ రింగ్ అనూహ్యంగా తిరిగి దొరికింది. మెటల్ డిటెక్టర్లతో నిధులు, పాత వస్తువులు వెతికే మైఖేల్ సీగల్, డైలాన్ లాపోర్ట్ ఇటీవల సరస్సు తీరంలో అన్వేషిస్తుండగా రాయి కింద ఈ ఉంగరాన్ని గుర్తించారు. అది 1988లో రెడ్ క్రీక్ హైస్కూల్లో చదివిన విద్యార్థి క్లాస్ రింగ్ అని వారు తెలుసుకున్నారు. ఉంగరంపై ఉన్న వివరాలతో యజమానిని గుర్తించేందుకు లాపోర్ట్ మొదట ఫేస్‌బుక్‌లో ఫొటోలు పెట్టాడు. స్పందన రాకపోవడంతో రెడ్ క్రీక్ హైస్కూల్‌ను సంప్రదించాడు. పాఠశాల సిబ్బంది వెంటనే ఉంగరం తమ పూర్వ విద్యార్థిని కిమ్ రాస్‌బెన్నేదని గుర్తించారు. ఆమెను సంప్రదించగా, 28 ఏళ్ల క్రితం స్నేహితులతో కలిసి సరస్సులో గడుపుతున్న సమయంలో ఉంగరం పోయిందని చెప్పింది. అప్పటినుంచి దాన్ని తిరిగి పొందుతాననే ఆశ తనకు లేకపోయిందని ఆమె వ్యాఖ్యానించింది. ఉంగరాన్ని తిరిగి పంపేందుకు అయ్యే ఖర్చు తాను చెల్లిస్తానని ఆమె చెప్పినా, సీగల్, లాపోర్ట్ డబ్బు తీసుకోవడానికి నిరాకరించారు. పోగొట్టుకున్న వస్తువులను వాటి యజమానులకు తిరిగి అందించడమే తమకు ఆనందమని వారు తెలిపారు. ఈ ఘటన మెటల్ డిటెక్షన్ అభిరుచిలోని ఆసక్తికరమైనకోణంతో పాటు, వ్యక్తిగత జ్ఞాపకాలకు విలువ ఎంత ఉంటుందో చూపించింది.

## 'కాలం' సిద్ధాంతాలను సవాల్ చేస్తున్న ప్రయోగాలు



క్వాంటం భౌతిక శాస్త్రంలో నిర్వహించిన కొన్ని ప్రయోగాలు సాంప్రదాయ కాలం సిద్ధాంతాలను, నమ్మకాలను సవాలు చేస్తున్నాయి. ముఖ్యంగా డిలేడ్ ఛాయిస్, క్వాంటం ఎంటాంగ్లెమెంట్ ప్రయోగాలు ఈ చర్చకు కేంద్రంగా ఉన్నాయి. ఈ ఆలోచనను మొదట ప్రతిపాదించిన వారిలో జాన్ అర్చిబల్డ్ వీలర్ ఒకడు. ఆయన సూచించిన డిలేడ్ ఛాయిస్ ప్రయోగం ప్రకారం, ఒక ఫోటాన్ ఏ మార్గం తీసుకుందో నిర్ణయించేది కొలత చేసే విధానం. ఆ కొలత నిర్ణయం ఫోటాన్ వ్యవస్థలోకి ప్రవేశించిన తరువాత తీసుకున్నా కూడా ఫలితంపై ప్రభావం చూపినట్లు కనిపిస్తుంది. ఈ ప్రయోగాల్లో సాధారణంగా ఫోటాన్లు రెండు మార్గాలున్న వ్యవస్థ (ఉదాహరణకు డబుల్‌స్లిట్ అమరిక) గుండా ప్రయాణిస్తాయి. పరిశీలన పరికరాన్ని అమర్చితే అవి కణాల్లా ప్రవర్తిస్తాయి. ఎవరూ పరిశీలించకపోతే, తరంగాల్లా అంతరాయం నమూనా చూపిస్తాయి. డిలేడ్ ఛాయిస్ రూపంలో, కొలత విధానాన్ని చివరి క్షణంలో మార్చినా, ఫలితం ఆ నిర్ణయానికి అనుగుణంగా వస్తుంది. ఇది గతం మారింది అనే భావన కలిగిస్తుంది.

– బిఎస్ఎస్ మైత్రేయి

# ఎల్‌నినో ఉపద్రవ కాలంలో వివాదం కన్నా విజ్ఞత ముఖ్యం

ఉమ్మడి రాష్ట్రం రెండుగా విడిపోయినా నదీజలాల పంపిణీ వివాదం కొనసాగటానికి అనేక కారణాలున్నాయి. ట్రిబ్యునళ్ల, సుప్రీంకోర్టులో కేసులు కొలిక్కిరాకపోవటం ప్రధాన కారణ మనవచ్చు. ముఖ్యంగా కృష్ణానదీ జలాల పంపిణీ వాటాలపై ఎడతెగని వివాదం ఉంది. కృష్ణా–గోదావరి నదీ ప్రాజెక్టు, యాజమాన్యం, ముఖ్యంగా నీటి వినియోగం పర్యవేక్షణకు కేంద్ర జల సంఘం రెండు నదులకు వేర్వేరు మేనేజిమెంటు బోర్డులు ఏర్పాటు చేసింది. వర్షాలు సమృద్ధిగా ఉన్న సంవత్సరాల్లో అంతా సామరస్యంగా సాగుతున్నట్లే కనిపిస్తుంది. కొరత కాలంలోనే ఇబ్బందులన్నీ. రెండు రాష్ట్రాల్లోను ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టి రాజకీయ లబ్ధిపొందటానికి ఈ వర్షపాతం కొరత సంవత్సరాల్లోనే రైతులను ముందుపెట్టి పంటలు ఎండిపోతున్నాయి – నీళ్లు విడుదల చేయాలంటూ ఆందోళనలు చేబడుతుంటాయి. ఈ సంవత్సరం పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావం – వాతావరణ మార్పులకు తోడై ప్రపంచంలోని చాలా దేశాలను గడగడలాడిస్తున్నది.

యూరప్‌లోని జర్మనీ, ఫ్రాన్స్ వంటి శీతల దేశా లలో ఎండవేడిమి తీవ్రమై దాన్ని తట్టుకోలేక వేలమంది ప్రాణాలు కోల్పోయారు. మరికొన్ని దేశాల్లో కార్చిచ్చు ప్రాణాంతకమవుతున్నది. మన పక్కనే నేపాల్‌లో మంచు పర్వతాలు కరిగి మంచు సరస్సుల్లో పడి జలప్రళయంగా మారి బీభత్సం సృష్టించాయి. మన సువిశాల దేశంలో రుతుపవనాలు వర్షించే స్థితిలో ఎంతో వ్యత్యాసం చూస్తున్నాం. రానున్న రోజుల్లో వాయవ్య, ఈశాన్య, తూర్పు, తూర్పు మధ్య భారత్, ఆగ్నేయ భారత్‌లో సాధారణ, అంతకన్నా కొంత ఎక్కువ వర్షపాతం పడే అవకాశముంది. కాగా మిగతా భారత్–ముఖ్యంగా దక్షిణ భారత్‌లో వర్షపాతం సాధారణంకన్నా తక్కువ ఉంటుంది. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఫిబ్రవరి వరకు ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తల అంచనా. ఏప్రిల్–మే–జూన్ మాసాలు ఎలాగూ వేసవికాలం. కాబట్టి 2027 ఆగస్టు వరకు బెట్టవాతావరణం ఊహించవచ్చు. ఈ ఆగస్టు 31నాటికి దేశం మొత్తంమీద వర్షపాతం సాధారణం కన్నా 14శాతం తక్కువ పడింది. ఆగస్టులో మధ్యభారత్‌లో మిగులు వర్షం కురియగా వాయవ్యం, తూర్పు ఈశాన్యం, దక్షిణ భారత్‌లో లోటు నమోదైంది. గడచిన ఆగస్టు మాసంలో ఉష్ణోగ్రత 1901 తర్వాత అతివేడి రికార్డు అయింది. సాధారణంగా జూన్–సెప్టెంబర్ తొలకరి వర్షాల్లో ఐదవవంతు సెప్టెంబర్‌లో కురుస్తుంది. కాని ఈ సంవత్సరం ఈ మాసంలో వర్షపాతంలో కనీసం 9శాతం తగ్గుదల ఉంటుందని భారత వాతావరణ డిపార్టుమెంటు (ఐఎండి) అంచనా వేసింది. దీన్నిబట్టి వ్యవసాయం, తాగునీరు, పశుగ్రాసం, ఆహార పంటలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావాన్ని ఊహించుకోవచ్చు.

ఈ ప్రపంచ, భారతదేశ వాతావరణ జోస్యాల నేపథ్యంలో, తరుముకొస్తున్న ఎల్‌నినో దుష్ప్రభావాన్ని తట్టుకునేందుకు రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని — మానవ జాతి మనుగడకు అత్యంతావశ్యకమైన త్రాగునీటి అవసరాలకోసం భద్రపరుచుకోవాలి, పొదుపుగా వాడుకోవాలి. కృష్ణానదీ జలాల వాటాలు, వినియోగంపై కెఆర్‌ఎంబి త్రిసభ్య కమిటీ ఇప్పటికి రెండుసార్లు సమావేశమైనా ఒక నిర్ణయానికి రాలేకపోయింది. శుక్రవారం నాటి సమావేశంలో కూడా ఆంధ్ర, తెలంగాణా ముఖ్య ఇంజినీర్లు పాత వాదనలే వినిపించారు. దాంతో, కృష్ణా రివర్ మేనేజిమెంట్ బోర్డ్ 21వ పూర్తిస్థాయి సమావేశానికి సమస్యను నివేదిద్దామని సభ్యకార్యదర్శి సూచించారు. ఈలోపు శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లలో నిల్వ ఉన్న నీటిని త్రాగునీటి అవసరాలకే రెండు రాష్ట్రాలు వినియోగించుకోవాలని కోరారు. శ్రీశైలం ఎడమగట్టున విద్యుచ్ఛక్తి ఉత్పత్తిని నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని, పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలను బాగా తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు.

లభ్యతలోని నీటిని రెండు రాష్ట్రాల మధ్య 50:50 దామాషాలో పంపిణీ చేయాలని కోరిన తెలంగాణ అధికారులు 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఆగస్టు వరకు త్రాగునీటి అవసరాలకు 46 టిఎంసిలతోపాటు తమకు 200 టిఎంసిలు అవసరమని తెలియచేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటివిడుదలను ఆపాలని కోరారు. కాగా ఆంధ్రప్రదేశ్ అధికారులు 2026 సెప్టెంబర్ నుంచి 2027 ఆగస్టు వరకు ఫీడర్ నీటి చెరువులు నింపడానికి, కాల్వల ద్వారా త్రాగునీటి సరఫరా నిమిత్తం లెవల్ మెయింటైన్ చేయటానికీ తమకు 104 టిఎంసిలు అవసరమని నివేదిక సమర్పించారు. ఉమ్మడి రిజర్వాయర్లలో 2026 సెప్టెంబర్ 3న నిల్వ ఉన్న నీటి ప్రకారం, 66:34 దామాషాలో తమకు 97.41 టిఎంసిలు రావాలని చెప్పారు.

సభ్య కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014, షెడ్యూల్ XIIలోని 2,3 పేరాలను చదివి వినిపించి రెండు రాష్ట్రా లు వాటికి నిబద్ధులై ఉండాలన్నారు. ఆ పేరాలు ఇలా చెబుతున్నాయి: ''ఇరిగేషన్, విద్యుచ్ఛక్తికి నీటి వినియోగ డిమాండ్‌లో వివాదం ఉన్నప్పుడు ఇరిగేషన్ ప్రాధాన్యత వహిస్తుంది. ఇరిగేషన్ – త్రాగునీటి అవసరాల డిమాండ్‌లో వివాదం ఉన్నప్పుడు త్రాగునీరు ప్రాధాన్యం వహిస్తుంది''. ఇదే ఎల్‌నినో కాలంలో శిరసావహించాల్సిన మార్గదర్శక సూత్రం. ●

# కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఉద్యమిస్తున్న ఎఐటియుసి



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

ఏఐటియుసి రాష్ట్ర 4 వ మహాసభలకు కరీంనగర్ జిల్లా ఆతిథ్యమిస్తున్నది. నేటి నుండి కరీంనగర్‌లో మూడు రోజులు (సెప్టెంబర్ 6,7,8 తేదీలలో) మహాసభలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా 6 న కరీంనగర్ పట్టణంలో భారీ కార్మిక ప్రదర్శన జరుగనున్నది.

గత మహాసభ నుండి నేటి వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో కార్మిక వర్గం యెడల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై చేపట్టిన ఉద్యమ కార్యాచరణలను సమీక్షిస్తూ తక్షణ కర్తవ్యాలతో ముందుకు పోవాల్సిన కార్యాచరణకు రూపకల్పన జరుగుతుంది.




తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్‌కు ప్రత్యేక స్థానం ఉన్నది. తెలంగాణలోనే 3 వ పెద్ద నగరం కరీంనగర్, మున్సిపల్ కార్పొరేషన్ 2014 లో ఏర్పడింది. గోదావరి ఉపనది అయిన మానేరు నది ఒడ్డున ఉన్నది. తెలంగాణ ఉత్తర జిల్లాలకు ప్రధానంగా విద్య, ఆరోగ్య కేంద్రంగా పనిచేస్తున్నది. జిల్లా గుండా గోదావరి ఉపనదులైన మానేరు, మున్నేరు నదులు ప్రవహించటంతో వాటిపై చేపట్టిన నీటి ప్రాజెక్టులైన మిడ్ మానే రు, లోయర్ మానేరు, శ్రీరామ్ సాగర్ రెండవ దశ, శ్రీరాంసాగర్ వరద కాలువ ద్వారా ఉమ్మడి జిల్లాలో 20 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీరు అందుతూ, వరిసేద్యానికి ధాన్యాగారంగా పేరొందిన జిల్లా. ముఖ్యంగా వరి, ప్రతి, మొక్కజొన్న, చెరుకు పంటలకు ప్రసిద్ధి. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలైన రైస్ మిల్లులతోపాటు విత్తనశుద్ధి కేంద్రాలైన నూజివీడు సీడ్స్, కావేరి సీడ్స్, స్నేహ సీడ్స్, హరిత బయో కెమికల్స్ తోపాటు రామగుండంలో సిమెంటు, ఎరువులు, బొగ్గు గనుల క్షేత్రమైన గోదావరిఖని, సిటీ ఆఫ్ గ్రానైట్స్‌గా కంపెనీలకు ప్రసిద్ధి. చేనేతకు, పవర్ లూమ్స్‌కు సిరిసిల్ల ప్రసిద్ధి, బీడీ పరిశ్రమ జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల ప్రాంతాలలో విలేజ్ పరిశ్రమగా వెలుగొందుతుంది. ప్రసిద్ధ దేవాలయాలైన వేములవాడ, ధర్మపురి, కొండగట్టు యాత్రా స్థలాలు ఉన్నాయి. శాతవాహన విశ్వవిద్యాలయంతో పాటు, మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీలు నెలకొల్పబడి విద్యాభివృద్ధిలో ముందున్నది. వివిధ సంస్థలలో సంఘటిత, అసంఘటిత రంగాలలో లక్షలాది మంది కార్మికులు పనిచేయుచున్నారు.

గత మహాసభ నుండి నేటివరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో కార్మికవర్గం యెడల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై చేపట్టిన ఉద్యమ కార్యాచరణలను సమీక్షిస్తూ ప్రస్తుత కర్తవ్యాలతో ముందుకు పోవలసిన అవసరం ఉన్నది. మూడున్నర సంవత్సరాలలో నిర్వహించిన పోరాటాలు సాధించిన విజయాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక, పారిశ్రామిక విధానాలు, ప్రస్తుతం కార్మిక వర్గముందున్న తక్షణ కర్తవ్యాలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని ఈ మహాసభలో రూపొందించుకోవడం జరుగుతుంది.

భారతదేశంలో 1920లోనే ఏఐటియుసి స్థాపించుకొని బ్రిటిష్ పాలనలోనే 1926 లో ట్రేడ్ యూనియన్ చట్టం సాధించుకున్నప్పటికీ .. హైదరాబాద్ రాష్ట్రం నిజాం రాచరిక పాలనలో ఉండటంతో కార్మిక సంఘాల పైన, ఉద్యమాలపైన నిషేధం, రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఉండటంతో దేశంలో జరుగుతున్న కార్మికోద్యమాల వెలుగులో చాలా ఆలస్యంగా హైదరాబాద్ రాష్ట్రంలో ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు మొదలైనాయి.

**హైదరాబాద్‌లో కార్మిక సంఘాలు విస్తరణ**

1920లో సికింద్రాబాద్‌లో క్యాలెండర్స్ కంపెనీ వర్కర్స్ యూనియన్, 1937 లో సికింద్రాబాద్లో రైల్వే వర్క్ షాప్ వర్కర్స్ యూనియన్, ఔరంగాబాద్ లో బట్టల మిల్లు వర్కర్స్ యూనియన్ ఏర్పడినవి. 1941 లో వరంగల్లు ఆజం జాహీ బట్టల మిల్లు, హైదరాబాద్‌లో డిబిఆర్ మిల్లు, చార్మినార్ సిగరెట్స్, గాజు, పింగాణి పరిశ్రమలు రావడంతో సఘాలు ఏర్పాటు..1942లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మొదలగు కార్మిక సంఘాలు ఏర్పాటుకు ప్రధాన పాత్ర వహించిన దేవూరి శేషగిరిరావు, మఖ్దుం మొహియుద్దిన్, డాక్టర్ రాజ్ బహదూర్ గౌర్, టిబి విఠల్రావు, కే ఎల్ మహేంద్ర, సర్వదేవభట్ల రామనాథం మొదలగువారు కార్మిక సంఘాలు ఏర్పాటుకు కృషి చేశారు. హైదరాబాద్ రాష్ట్రంలోని కార్మిక సంఘాలన్నీ ఏకమై 'ఆల్ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్' 1941లో ఏర్పాటు చేసుకున్నాయి. 1946 ఆగస్టులో ఏ హెచ్‌టియుసి ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ( ఏఐటియుసి)లో విలీనమైంది. ఆ తర్వాత క్రమక్రమంగా హైదరాబాద్ రాష్ట్రంలో కార్మిక సంఘాలు ఏర్పడినవి.

**నేడు కార్మిక వర్గం పై ఉన్న కర్తవ్యం :**

కేంద్రంలో మూడవసారి అధికారంలోనికి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం అచ్చే దిన్( మంచి రోజులు ) రాబోతున్నాయి అంటూ ప్రధాని నరేంద్ర మోడీ, ' సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' అనే నినాదాన్ని తమ ప్రచార పటాటో పానికి వాడుకున్నారే తప్ప, ఏనాడూ పాటించలేదు.

న్యూ ఇండియా, ఆత్మనిర్భర భారత్, కర్తవ్య కాల్, అమృత కాల్, శ్రేష్ఠ భారత్, వికసిత భారత్ వంటి రకరకాల ఆకర్షణీయమైన పేర్లతో నినాదాలతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నం తప్ప వాటి స్ఫూర్తిని చిత్తశుద్ధితో అందిపుచ్చుకున్నదీ లేదు.

**ఎఐటియుసి ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన మహాసభల వివరాలు**

| వ.స. | ప్రదేశం | తేదీ | అధ్యక్షులు | ప్రధాన కార్యదర్శి |
|---|---|---|---|---|
| 1. | కొత్తగూడెం | 16–18 నవంబర్ | 1956 మఖ్దూంమోహిద్దీన్ | కె.ఎల్.నర్సింహ్మారావు |
| 2. | గుంటూరు | 8–10 మే 1959 | మఖ్దూం మోహిద్దీన్ | కె.ఎల్.నర్సింహ్మారావు |
| 3. | హైదరాబాద్ | 9–10 జూన్ 1963 | కె.ఎల్.నర్సింహ్మారావు | ఎన్.సత్యనారాయణ రెడ్డి |
| 4. | విశాఖపట్నం | 14–17 ఏప్రిల్ 1966 | కె.ఎల్.నర్సింహ్మారావు | ఎన్.సత్యనారాయణ రెడ్డి |
| 5. | హైదరాబాద్ | 12–14 మే 1973 | రాజ్‌బహదూర్‌గౌర్ | యం.వి.ఎన్.కపర్ధి |
| 6. | గోదావరిఖని | 4–7 అక్టోబర్ 1978 | రాజ్‌బహదూర్‌గౌర్ | యం.వి.ఎన్.కపర్ధి |
| 7. | హైదరాబాద్ | 13–15 జూన్ 1982 | యం.వి.భద్రం | కె.ఎల్.మహేంద్ర |
| 8. | రాజమండ్రి | 17–19 మే 1985 | వై.విజయ్‌కుమార్ | కె.ఎల్.మహేంద్ర |
| 9. | తిరుపతి | 16–18 జూలై 1989 | వై.విజయ్‌కుమార్ | పొట్లూరి నాగేశ్వరరావు |
| 10. | విశాఖపట్నం | 25–27 ఫిబ్రవరి 1994 | వై.విజయ్‌కుమార్ | పొట్లూరి నాగేశ్వరరావు |
| 11. | గుంటూరు | 28ఫిబ్రవరి, 12 మార్చి 1999 | వి.వి.రామారావు | పొట్లూరి నాగేశ్వరరావు |
| 12. | రాజమండ్రి | 18–20 నవంబర్ 2004 | వి.వి.రామారావు | పి.జె.చంద్రశేఖరరావు |
| 13. | ఒంగోలు | 16–18 నవంబర్ 2008 | వి.వి.రామారావు | పి.జె.చంద్రశేఖరరావు |
| 14. | హైదరాబాద్ | 15–17 నవంబర్ 2011 | పి.జె.చంద్రశేఖరరావు | జి.ఓబులేసు |

2014 జూన్ 28న హైదరాబాద్‌లో జరిగిన ఎ.పి.కౌన్సిల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినందున తెలంగాణ స్టేట్ కౌన్సిల్‌కు నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరిగింది.

| | ప్రదేశం | తేదీ | అధ్యక్షులు | ప్రధాన కార్యదర్శి |
|---|---|---|---|---|
| **నిర్మాణ సభ:** | హైదరాబాద్ | జులై 28, 2014 | టి.నరసింహన్ | ఉజ్జిని రత్నాకర్‌రావు |
| **తెలంగాణ రాష్ట్ర మహాసభలు** | | | | |
| 1వ | మంచిర్యాల | 4–5 అక్టోబర్ 2015 | టి.నరసింహన్ | ఉజ్జిని రత్నాకర్‌రావు |
| 2వ | రాజేంద్రనగర్ | 24–26 మార్చి 2019 | ఎస్.బాల్‌రాజ్ | వి.యస్.బోస్ |
| 3వ | యాదగిరిగుట్ట | 27–29 నవంబర్ 2022 | యం.డి.యూసుఫ్ | ఎస్.బాల్‌రాజ్ |
| 4వ | కరీంనగర్ | 6–8 సెప్టెంబర్ 2026 | | |

భారతదేశ కార్మిక వర్గం సుదీర్ఘకాలం పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను సమూలంగా మార్చుటకు నిర్ణయించి కోవిడ్ టైంలో పార్లమెంటులో చర్చలు జరపకుండా నాలుగుకోడ్‌లను ఏకపక్షంగా ఆమోదించుకోవడం జరిగింది. ప్రస్తుతమున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు కోడ్‌లుగా విభజించి నీరుగార్చటం జరిగింది. ఇందులో మరీ ముఖ్యంగా కార్మిక యూనియన్ల రిజిస్ట్రేషన్లు, పారిశ్రామిక వివాదాలు పరిష్కారం కఠినతరం చేయటమేగాక, 8 గంటల పని విధానాన్ని యజమాన్యానికి అనుకూలంగా రూపొందించుకొనుటకు వీలు కల్పించడం జరిగింది. వీటికి వ్యతిరేకంగా గత ఐదు సంవత్సరాలుగా ఎన్డీఏ బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కేంద్ర కార్మిక సంఘాలు(సి టి యు) దేశవ్యాప్తంగా సమ్మెలు, నిరసనలు ఆందోళనలు చేపట్టడం జరిగింది.

దేశ ప్రజల ఆస్తులతో నిర్మించుకున్న విమాన, రవాణా, రైల్వే,నౌక, ఆయిల్, బొగ్గు, బ్యాంక్స్, ఇన్సూరెన్స్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను మానిటైజేషన్ పైప్ లైన్ ద్వారా ప్రయివేటు సంస్థలకు అప్పజెప్పటం జరుగుతున్నది. ఈ సంస్థలు దేశ స్వయం సమృద్ధి కొరకు నిర్మించుకున్నవి. ప్రజల ఆస్తులు. ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్తున్నారు. బ్యాంకులను కుదించటం, ఇన్సూరెన్స్ సంస్థలను ప్రైవేటీకరించడం ఏయిర్ ఇండియాను టాటాలకు అమ్మటం, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రైతుల పట్టువిడవని ఆందోళనతో ఉపసంహరించుకున్నప్పటికీ పంటలకు కనీస మద్దతు ధరకు లీగల్ గ్యారంటీ ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాలయాపన చేయటం దేశానికి పెద్ద ప్రమా దం. బిజెపి నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం వల్ల దేశానికి ఏం ఒరిగింది? గత పదేళ్ల పాలనలో అంటే.. అధిక ధరలు, అన్నదాతల ఆక్రందనలు, అన్యాయపు చట్టాలు, అసమానతలు పెరగడం, ఆకలి కేకలు, అవినీతి కోరలు, ఆర్థిక వైఫల్యాలు, అరాచక పాలన, అబద్ధాల హోరు, అప్పుల జోరు, అధికార కేంద్రీకరణ, అస్తవ్యస్థ నిర్ణయాలు, అప్రజాస్వామిక పోకడలు, అభద్రతాభావం – అందుకే కాదు అమృతకాలం కాదు ఆపత్కాలం! రైతుల ఆదాయాలు క్రమంగా తగ్గుతూ ఉన్నాయి. యువతకు ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్నది. కార్మిక హక్కుల పై దాడులు పెరుగుతున్నాయి. ఈ విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని 2023 నవంబర్ 26న, 2024లోను, 2025 మే 29 న, తిరిగి 2026 ఫిబ్రవరి 12న కార్మికులు, రైతులు దేశవ్యాప్త చరిత్రాత్మక సార్వత్రిక సమ్మెతో నిరసనలు తెలపటం జరిగింది.

**రాష్ట్రంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు పరచాలి**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధన తదుపరి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆశలమేరకు, ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన అందించకపోవటం పట్ల అసంతృప్తితో ఓటర్లు 2023లో డిసెంబర్ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని గద్దె దించి.. ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్ కు అధికారం అప్పగించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల తొమ్మిది మాసాలు అవుతున్నప్పటికీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు, ఉద్యోగ కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీలను అమలుపరచటంలో గత ప్రభుత్వ సాచివేత విధానాలనే అవలంబిస్తున్నది.

గత ప్రభుత్వం ఉద్యోగ – కార్మిక సంఘాలపై నిరంకుశమైన విధానాలు చేపట్టింది. చివరికి కార్మిక యూనియన్లపై నిర్బంధాలను కొనసాగించింది. యూనియన్లను గుర్తించకుండా, ప్రజాస్వామ్య పద్ధతులలో ఎన్నికలు నిర్వహించకుండా ఒక నియంత విధానం అమలు చేసింది. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే యూనియన్‌లను నిషేధించింది. సింగరేణిలో ఎన్నికలను నిర్వహించకుండా వాయిదా వేసింది. అంగన్వాడి వర్కర్లకు పని భారంమోపి సంఘా ల నాయకులపై నిర్బంధాలను పెట్టింది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను అమలుచేయకుండా వాయిదా వేస్తూ వచ్చింది. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగ కార్మికులకు సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. అందులో ముఖ్యమైనవి ఉద్యోగాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. కనీస జీవనవే తన విధానాన్ని రూ.26 వేలు అమలుచేయాలి. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి రెగ్యులర్ ఉద్యోగ విధానాన్ని చేపట్టాలి. షెడ్యూల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్‌లో – పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేపట్టాలి. ఓల్డ్ పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి. భవన నిర్మాణకార్మిక సంక్షేమ బోర్డుద్వారా అందించే సదుపాయాలు పెంచాలి, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆదుకొనుటకు నెలకు రూ. 2వేలు, గిగ్‌వర్కర్ల సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలి. మూడో వేతన సవరణ, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, స్కీం వర్కర్స్‌కు ఉద్యోగ గుర్తింపు మొదలగు వాగ్దానాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఏఐటియుసి డిమాండ్ చేస్తున్నది.

## భౌతిక శాస్త్రాన్ని మార్చేసిన ముగ్గురు ప్రముఖులు



ఇక్కడ కనిపిస్తున్న నలుపుతెలుపు ఫొటోలో ముగ్గురు శాస్త్రవేత్తలు నిలబడి ఉన్నారు. పాల్ డిరాక్, వెర్నర్ హీసెన్‌బెర్గ్, ఎర్విన్ ష్రోడింగర్‌లలో ఒక సారూప్యత ఉంది. వారి ఆలోచనలు సాంప్రదాయ భౌతిక శాస్త్రాన్ని పూర్తిగా మార్చేయడమే ఆ సారూప్యత. వారు కేవలం కొత్త సిద్ధాంతాలు ప్రతిపాదించలేదు, వాస్తవాన్ని అర్థం చేసుకునే విధానాన్నే మార్చివేశారు. పాల్ డిరాక్ రూపొందించిన సమీకరణం ఎలక్ట్రాన్ ప్రవర్తనను వివరిస్తూ, ముందుగా ఎవరూ చూడని ప్రతిపదార్థం (యాంటీమేటర్) ఉనికిని ఊహించింది. ఆ సమీకరణం ద్వారా పాజిట్రాన్ అనే కణం ఉండాలని ముందుగానే వివరించడం జరిగింది. తరువాత ప్రయోగాల్లో అది నిజమని నిర్ధారించబడింది. ఇది గణిత సౌందర్యం వాస్తవాన్ని ఎలా ముందుగా సూచించగలదో చూపించింది. హీసెన్‌బెర్గ్ ప్రతిపాదించిన అనిశ్చితి సూత్రం (అన్‌సర్టైయినిటీ ప్రిన్సిపల్) ప్రకారం, ఒక కణం ఉన్న స్థానం, దాని గతి (మొమెంటమ్) రెండింటినీ ఒకేసారి పూర్తిగా ఖచ్చితంగా తెలుసుకోవడం అసాధ్యం. ఇది కొలతల లోపం వల్ల ఉద్భవించిన సమస్యకాదు. దాని ప్రకృతి స్వభావం. అంటే సూక్ష్మ స్థాయిలో విశ్వం ఖచ్చితత్వం కంటే సంభావ్యతలపై ఆధారపడుతుంది. ఎర్విన్ ష్రోడింగర్ రూపొందించిన తరంగ సమీకరణం కణాలను చిన్న ఘన బిందువులుగా కాకుండా సంభావ్యత తరంగాలుగా వర్ణించిం ది. కణం ఒక నిర్దిష్ట స్థితిలో ఉండక, అనేక సంభావ్య స్థితుల కలయికగా ఉంటుంది. కొలిచినప్పుడు మాత్రమే అది ఒక విలువకు పరిమితం అవుతుంది.



# ఎన్నికల పరీక్షకు టీచర్ల వద్దకు వస్తా

● ఎన్ని మార్కులు వేస్తారో వేయండి ● రెండేళ్లు సమయమిస్తే సమస్యలు పరిష్కరిస్తా ● ఉద్యోగ అవకాశాల మెరుగుకు నైపుణ్యాభివృద్ధిపై విద్యార్థులు దృష్టి పెట్టాలి ● పాలిటెక్నిక్‌లో ఎలాంటి మార్పులు చేయట్లే ● ప్రతిపక్షాల అవాస్తవ ప్రచారం నమ్మొద్దు ● ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/వికారాబాద్ : విద్యార్థులు తమ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి, పారిశ్రామికవేత్తలుగా రాణించడానికి నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్న సిఎం, ఉపాధ్యాయులు 2 ఏళ్ల తనకు సమయం ఇస్తే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 2028 డిసెంబర్‌లో తాను ఎదుర్కోబోయే ఎన్నికల పరీక్షలో మార్కులు వేసే స్వేచ్ఛ ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా, రాష్ట్ర విద్యార్థులు దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలబడే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని తన అసెంబ్లీ నియోజకవర్గమైన కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో సోషల్ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో కలిసి రేవంత్‌రెడ్డి సందర్శించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారే అధికంగా ఉంటారని తెలిపారు. అలాంటి విద్యార్థులకు అత్యుత్తమ, నాణ్యమైన విద్యను అందించి రాష్ట్రానికి, దేశానికి దిశానిర్దేశం చేసే స్థాయికి తీసుకుళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల కంటే ఎక్కువ సమయాన్ని ఉపాధ్యాయుల వద్ద గడుపుతారని, అందువల్ల వారి భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. 12వ తరగతి తర్వాత సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు సంపాదించిన విద్యార్థులు ప్రపంచాన్ని ఏలగలరు అని అన్నారు. ఐటి నిపుణులకు ఉపాధి, జీవనోపాధి అవకాశాలు లభిస్తాయని అంటున్నారని, కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) రాకతో లక్షలాది మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు అమెరికా నుంచి తిరిగి వస్తున్నారని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఎటిసిలు), పాలిటెక్నిక్ కళాశాలలు, ప్రభుత్వ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలలో చదివిన, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలున్న విద్యార్థులకు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు లేని ఉద్యోగ భద్రత ఉందని సిఎం అన్నారు. 'ఇకపై అమెరికా వద్దు. ఇప్పుడు మీరు సింగపూర్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియాలపై దృష్టి పెట్టవచ్చు. అక్కడ కనీసం రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల జీతంతో శాశ్వత ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయి' అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన బాలికా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, వారు 12వ తరగతి తర్వాత నర్సింగ్ చదివితే, పలు దేశాలు వారికి వరుసలో నిలబడి ఉద్యోగాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ అనే అంతరిక్ష సాంకేతిక సంస్థను ఉదహరించారు. ఈ సంస్థ 2026లో భారతదేశపు మొట్టమొదటి స్పేస్‌టెక్ యూనికార్న్‌గా అవతరించి, ఆర్బిటల్ క్లాస్ విక్రమ్1 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించింది. స్కైరూట్ ఇప్పుడు ఎలాన్ మస్క్‌కు సవాలు విసురుతోందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, నైపుణ్యాలు, ఆవిష్కరణలకు అండగా నిలుస్తుందని సిఎం నొక్కి చెప్పారు.

**టీచర్ల సమస్యలు పరిష్కరిస్తాం**

ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రధాన మార్పులను అర్థం చేసుకుని, రెండేళ్లపాటు వాటిపై దృష్టి సారించి, తెలంగాణను దేశంలోని ఇతరులకు ఆదర్శంగా నిలపాలని ఆయన వారిని కోరారు. 'ఉపాధ్యాయులు వీధుల్లోకి రావాల్సిన అవసరం లేదు. ఉపాధ్యాయుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో నేను ముందుకు వెళ్తున్నాను' అని ఆయన అన్నారు. వేతన సవరణతో సహా ఉపాధ్యాయులు లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని పేర్కొన్న ఆయన, 2028 డిసెంబర్‌లో తాను ఎదుర్కోబోయే ఎన్నికల పరీక్షలో తనకు మార్కులు వేసే స్వేచ్ఛ ఉపాధ్యాయులకు ఉంటుందని అన్నారు.

**ప్రయోజనాలు చెల్లించకుండా పదవీ విరమణ వయసు పెంపు**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కె.చంద్రశేఖర్ రావు నేతృత్వంలోని ప్రభుత్వం రూ.8.50 లక్షల కోట్ల రుణ భారాన్ని మోపి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని ఆయన అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించకుండానే పదవీ విరమణ వయస్సును 60 ఏళ్లకు పెంచిందని ఆయన పేర్కొన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతుంటే, బిఆర్‌ఎస్ నాయకుడు మాత్రం తన ఫామ్‌హౌస్‌లో నిద్రపోతున్నారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్లలోనే పదవీ విరమణ ప్రయోజనాల కోసం రూ. 6,000 కోట్లు చెల్లించిందని ఆయన తెలిపారు. నర్సరీ నుండి 12వ తరగతి వరకు ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రైవేట్ రంగానికి దీటుగా బలోపేతం చేయాలని ఆయన నొక్కి చెప్పారు.

**పాలీటెక్నిక్‌పై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం**

పాలీటెక్నిక్ కళాశాలల గురించి ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 శాతం సీట్లు భర్తీ అయ్యాయని ఆయన తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలను కూడా సిఎం వివరించారు. ఇందు లో విశ్వవిద్యాలయాలకు సమర్థులైన వారిని వైస్‌ఛాన్సలర్లుగా నియమించడం, 55 రోజుల్లోనే డిఎస్‌సి (జిల్లా ఎంపిక కమిటీ) విధానం ద్వారా 10,006 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, 25,950 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం, వివాదాలు లేకుండా 34,706 మంది ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టామన్నారు.అలాగే విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తోందని ఆయన తెలిపారు.

**అర్హులైన ఓటర్లను తొలగించొద్దు**

అర్హులైన ప్రతి ఓటరు ఓటరు లిస్టులో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం బిఎల్‌ఓల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ బిఎల్‌ఓలు నోటీసు ఇచ్చిన ప్రతి ఓటరుపై ప్రత్యేక శ్రద్ద వహించి బిఎల్‌ఓలు ప్రతిగ్రామంలో అర్హులను తొలగించకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో, కొడంగల్‌లో బిఆర్‌ఎస్‌ను కనుమరుగు చేయడమే కార్యకర్తలు లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ క్రిటికల్ కేర్ 100 పడకల ఆసుపత్రిని రూ.27కోట్ల నిధులతో నిర్మించిన ఆసుపత్రిని ప్రారంభించారు. నూతన అతిథి గృహన్ని రూ.5కోట్ల అంచనా నిధులతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. రూ.8కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల నూతన భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య అరోగ్యశాఖ దామోదర్ రాజనర్సింహా, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బిఎల్‌ఓలు, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# సజావుగా అసెంబ్లీ సమావేశాలు జరగనివ్వండి

● ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ● 7 నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్: శాసనసభ, శాసనమండలి సమావేశాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, శాఖలకు సంబంధించిన చర్చ సమయంలో అధికారులు అందుబాటులో ఉండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచించారు. 'ఈ నెల 7వ తేదీ (సోమవారం) నుంచి వర్షకాల శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై పోలీసు, వివిధ శాఖాధికారులతో శాసన పరిషత్ సమావేశ మందిరంలో శనివారం 'సన్నాహక సమావేశం' జరిగింది. ఈ సమావేశంలో గుత్తా సుఖేందర్ రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, కౌన్సిల్ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, శాసన పరిషత్ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహా చార్యులు, శాసన సభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సాధారణ పరిపాలన ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, డిజిపి సివి ఆనంద్, హోం శాఖ కార్యదర్శి శిఖా గోయల్, డిజి (శాంతిభద్రతలు) మహేష్ భగవత్, అదనపు డిజి (ఇంటలిజెన్స్) విజయ్ కుమార్, హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, అసెంబ్లీ, కౌన్సిల్ చీఫ్ మార్షల్స్ కర్ణాకర్, సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ సభలో సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, సభ్యులకు ముందుస్తుగానే తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో మెటీరియల్‌ను అందజేస్తే వారు చదువుకుని సమావేశాలకు హాజరవుతారని సూచించారు. సభ లోపల, బయట కూడా ప్రశాంత వాతావరణం ఉంటేనే సమావేశాలు సజావుగా జరుగుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు దేశ వ్యాప్తంగా సమర్థవంతమైన పోలీసు శాఖగా పేరుందని, ఈసారి కూడా సమావేశాలను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన రక్షణ,బందోబస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులను సూచించారు.

గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో ధర్నాలు, రాస్తారోకోలు జరగకుండా, ప్రశాంతంగా సమావేశాలు జరిగేలా చూడాలని సూచించారు. సభలు సజావుగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, గతంలో జరిగిన తరహాలో కాకుండా ఇంకా వేగంగా అధికారులు పని చేయాలన్నారు. ఆయా శాఖలు నోడల్ అధికారులను నియమించి, సమావేశాలు సక్రమంగా నిర్వహించాలని, ఈసారి సమావేశాలు హాట్‌హాట్‌గా జరిగే అవకాశం ఉన్నదని, పోలీసు శాఖ చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటెలిజెన్స్ అధికారులు త్వరగా అసెంబ్లీ అధికారులకు సమాచారాన్ని అందించాలన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సభ్యుల ప్రశ్నలకు ఒకరోజు ముందే సమాధానాలు అందజేయాలన్నారు. ఉభయ సభల సమావేశాల సమయంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తూ, సభకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు. ప్రతి శాఖ తరపున ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు ఉభయ సభల సమావేశాలు నిదర్శనమని, అందుకే ప్రభుత్వ యంత్రాంగం తరుపున పటిష్టమైన చర్యలు తీసుకుని, సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

# జీఓ నెంబర్ 97ను తక్షణమే రద్దు



● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జీఓ నెంబర్ 97ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని రుద్రంపూర్ పాలిటెక్నిక్ కళాశాలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అనుసంధానం చేయాలనే నిర్ణయాన్ని నిరసిస్తూ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సాంకేతిక విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, వ్యవస్థను బలహీనపరిచేలా నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను స్కిల్ యూనియర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు శాపంగా మారే శక్తి పాలసీని రద్దు చేసి, సాంకేతిక రంగంలో మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. శక్తి పాలసీని రద్దు చేసి సాంకేతిక రంగంలో మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. విద్యార్థుల న్యాయమైన సమస్యలపై అసెంబ్లీలోనూ గళమెత్తుతామని, జీఓ ఉపసంహారణ వరకు పోరాటాలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సలిగంటి శ్రీనివాస్, ఎస్‌కే.ఫహీమ్ దాదా, వర్క అజిత్, తోట రాజు, ఖయ్యూమ్, రవికిరణ్, సలిగంటి నవీన్, వాడి కనకరాజు, ముత్యాల వినయ్, జావీద్, కాశి, కొయ్యడ రవి, సృజన్, సంజయ్ పాల్గొన్నారు.

# రాజ్యాంగ లక్ష్యాల పరిరక్షణలో న్యాయవాదులు క్రియాశీలక పాత్ర పోషించాలి



● ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : అశేష త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్యం, రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను పరిరక్షించడంలో న్యాయవాదులు మరింత క్రియాశీలంగా వ్యవహరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ పిలుపునిచ్చారు. సామాజిక స్పృహతో చట్టాలను అవగాహన చేసుకుని సామాన్యులకు న్యాయం అందేలా న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. బెక్కం భగత్‌సేన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఐఎఎల్ సభ్యత నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన పలువురు యువ న్యాయవాదులకు ఐఎఎల్ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం ఐఎఎల్ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. సామాజిక స్పృహతో చట్టాలను అవగాహన చేసుకుంటేనే సామాన్యులకు న్యాయం జరుగుతుందని, అందుకు న్యాయవాదులు కృషి చేయాలని ప్రభాకర్ కోరారు. రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.విప్లవ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవ రావు మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి తమ మద్దతు ఉంటుందని అన్నారు. ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కెవిఎల్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు.ఈ సందర్భంగా బెక్కం భగత్‌సేన్ న్యాయవాదుల వృత్తి నైపుణ్యత–ఎఐ సాంకేతిక వినియోగంఅంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.రామ్మూర్తి, బెక్కం జనార్ధన్, వీరబాబు, సంజయ్‌కుమార్, భాస్కర్ నాగేశ్వరరావు, లక్ష్మయ్య, దత్తాత్రేయ, ఆకాంక్ష రెడ్డి, రిషిత పాల్గొన్నారు.

## ఖరీఫ్ సీజన్‌లో 65 లక్షల మెట్రిక్ టన్నుల

# ధాన్యం కొనుగోలు




● ఈ ఏడాది 7 రకాల సన్నాలకే బోనస్ వర్తింపు : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రూ.18,250 కోట్ల అంచనా విలువైన కొనుగోళ్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని, రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోనిమర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా8,283 కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 1 నాటికే సిద్ధం చేసి, 15వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. ఇందులో 3,180 ఐకెపి, 4,372పిఎసిఎస్, 731 ఇతర కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు అదనంగా ప్రభుత్వం గుర్తించిన బిపిటి–5204, ఆర్‌ఎన్‌ఆర్–15048, కెఎన్‌ఎం–1638, జై శ్రీరామ్, హెచ్‌ఎంటి–సోనా, డబ్ల్యూజిఎల్–44, కెఎన్‌ఎం–7715 ఈ 7 సన్న రకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. ధాన్యానికి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్‌ను అధ్యయనం చేసిన అనంతరమే ఈ రకాలను ఎంపిక చేశామని పేర్కొన్నారు. తెలంగాణ బియ్యానికి అంతర్జాతీయ ఎగుమతి మార్కెట్‌ను అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన ధర లభించేలా దీర్ఘకాలిక వ్యూహం రూపొందించాలని అధికారులకు సూచించారు.ప్రస్తుత వానాకాలంలో 57.70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు ఉత్తమ్ తెలిపారు. ఇందులో 45 లక్షల మెట్రిక్ టన్నుల సన్న, 20 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. నవంబర్, డిసెంబర్‌లో ధాన్యం రాక అధికంగా ఉండే అవకాశం ఉన్నందున గోదాములు, గన్నీ సంచులు, రవాణా వాహనాలు, హమాలీలు, తూకం, నాణ్యత పరీక్ష పరికరాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. రవాణా కాంట్రాక్టర్లకు తగినన్ని లారీలు ఉన్నాయా లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్నాయా ముందుగానే నిర్ధారించాలని సూచించారు. ఈ సీజన్‌కు 16.25 కోట్ల గన్నీ సంచులు అవసరం కాగా ప్రస్తుతం 3.50 కోట్లు అందుబాటులో ఉన్నాయని, మిగిలిన వాటిని వేగంగా సమకూర్చాలని ఆదేశించారు. ధాన్యం వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ తప్పనిసరి చేయడంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా సరిహద్దు తనిఖీలను పటిష్టం చేయాలని సూచించారు.రైతు ప్రయోజనాలే ధాన్యం కొనుగోలు యంత్రాంగానికి ప్రధాన లక్ష్యంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా తూకం, నాణ్యత పరీక్షలు నిర్వహించి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించడంతోపాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సంచాలకుడు శ్యామ్ ప్రసాద్, అదనపు సంచాలకుడు రోహిత్ సింగ్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించని కెసిఆర్ ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం అవసరమా?

● మహాధర్నాకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి రావాలి: మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజా సమస్యలపై ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించని మాజీ ముఖ్యమంత్రి, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ ఎమ్మెల్యే పదవిలో కొనసాగడం ఎందుకని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కెసిఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు బిఆర్‌ఎస్ పదేళ్ల పాలన వైఫల్యాలను ఎండగట్టేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహా ధర్నా సన్నాహక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా జీతం తీసుకుంటూ కెసిఆర్ అసెంబ్లీకి హాజరు కావడం లేదని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని విమర్శించారు. నేడు జరిగే మహా ధర్నాకు కాంగ్రెస్ ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని మంత్రులు తెలిపారు. సన్నాహక సమావేశంలో మంత్రి అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపిలు మధుయాష్కీ గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, డిసిసి అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్చార్జిలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

# కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియను తక్షణమేచేపట్టి, వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని పలువురు ప్రముఖులు మంత్రివర్గ ఉపసంఘాన్ని కోరారు. ఈ మేరకు జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఎస్ ఆకునూరి మురళి, ప్రొఫెసర్లు జి.హరగోపాల్, శాంత సిన్హా, డి.నరసింహ రెడ్డి, డా. వి.రుక్మిణీ రావు, శుక్రవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచే కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించాలని వారు కోరారు. ఇప్పటికే ఆలస్యం అయినందున కనీసం సెప్టెంబర్‌లోనైనా ప్రక్రియ మొదలు పెట్టి, గుర్తింపు పొందిన కౌలు రైతులకు వరి, పత్తి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు విక్రయించుకునే అవకాశం కల్పించాలని సూచించారు. కౌలు రైతుల గుర్తింపునకు తెలంగాణలో ఇప్పటికే భూమి లైసెన్స్ సాగుదారుల చట్టం– 2011 అమల్లో ఉందని, దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. అవసరమైన పరిపాలనా, విధానపరమైన మార్పులను వెంటనే చేపట్టి ఈ సీజన్ నుంచే చట్టాన్ని అమలు చేయాలని కోరారు. గుర్తింపు పొందిన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిధులు సరైన లబ్ధిదారులకు చేరేందుకు కూడా ఇది అవసరమని లేఖలో పేర్కొన్నారు. మంత్రివర్గ ఉపసంఘం వెంటనే సమావేశమై ప్రస్తుత పరిస్థితిని సమీక్షించి, ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన తక్షణ చర్యలపై మధ్యంతర నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : సికింద్రాబాద్ జోన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం | ఇఇ పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| టెండర్ నోటీసు నెం. 13/EE-II/ Cir-43/SBZ/GHMC/2026-27, తేదీ: 03.09.2026 | ఎలక్ట్రికల్ పనులు : 1 నెం. | రూ. 3.06 లక్షలు | 05.09.2026 మ.2.30 గం.ల నుండి 08.09.2026 మ.2.30 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - II, సర్కిల్-43, తార్నాక. సెల్ నెం. 9704405076 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి
DIPR R.O. No. : 9298-PP/CL/ADVT/2026-27, Date: 05-09-2026

**తెలంగాణ ప్రభుత్వం**
**పర్యవేక్షక అధికారి కార్యాలయం, నీటి పారుదల శాఖ, కామారెడ్డి జిల్లా**

1) టెండర్ నోటీస్ నంబర్: 18/SE/IC/KMR/2026-27, Dt:18-08-2026, రూ.129.85 లక్షలకు, 2) NIT.No.19/SE/IC/KMR/2026-27, Dt:18-08-2026, రూ.100.18 లక్షలకు, 3) NIT.No. 20/SE/IC/ KMR/2026-27, Dt: 18-08-2026, రూ.189.31 లక్షలకు, 4) NIT.No.14 (4th call) SE/IC/KMR/2025-26, Dt: 14-10-2025, రూ.45.45 లక్షలకు, 5) NIT.No.28 (7th call) SE/IC/KMR/2025-26, Dt: 06-03-2026, రూ.10.70 లక్షలకు, 6) NIT.No. 03(4th Call)/SE/IC/KMR/2026-27, Dt: 23-04-2026, రూ.34.31 లక్షలకు, 7) NIT.No.08(3rd Call)/ SE/IC/KMR/2026-27, Dt:06-05-2026, రూ.27.35 లక్షలకు, పనులు, లభ్యమగు తేదీ: 01-09-2026 ఉదయం 11.00 నుండి 15-09-2026 సాయంత్రం 05.00 గం. వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, కామారెడ్డి.
DIPR R.O. No. : 9309-PP/CL/ADVT/2026-27, Date: 05-09-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : గాజులరామారం సర్కిల్-57**

| NIT No & Date | పని పేరు | ప్రారంభ తేదీ & సమయం | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు |
|---|---|---|---|---|
| 22/DB/EE/ Gaju-laramaram Circle-57/ CMC/2026-27 | గాజులరామారం సర్కిల్ వద్ద, యానిమల్ కేర్ సెంటర్ సమీపంలోని ఖాళీ స్థలంలో పెంపుడు జంతువుల వినోద జోన్ అభివృద్ధి కొరకు సర్వే, పరిశోధన, రూపకల్పన మరియు సవివరమైన ప్రాజెక్ట్ నివేదిక తయారీకి కన్సల్టెన్సీ సేవలు. | 07.09.2026 మ.2.00 గం.లకు | 15.09.2026 మ.02.30 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9154299633, హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 9063836115 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, సిఎంసి
DIPR R.O. No. : 9324-PP/CL/ADVT/2026-27, Date: 05-09-2026

**తెలంగాణ ప్రభుత్వము, దేవాదాయ-ధర్మాదాయ శాఖ**
**శ్రీ మైసమ్మ దేవత, శివాలయ, రామాలయ దేవస్థానము**
**మైసిగండి గ్రా॥, కడ్తాల్ మం॥, రంగారెడ్డి జిల్లా.**

**బహిరంగ వేలము ప్రకటన**

తేది: 05-09-2026

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియచేయునది ఏమనగా, శ్రీ మైసమ్మ దేవత, శివాలయ, రామాలయ దేవస్థానము, మైసిగండి గ్రా॥, కడ్తాల్ మం॥, రంగారెడ్డి జిల్లా దేవస్థానము. నందు 2026-2027 సంవత్సరమునకు అనగా తేది : 01-10-2026 నుండి 30-09-2027 వరకు ఈ దిగువ కనపర్చిన లైసెన్స్ హక్కును బహిరంగ వేలము ద్వారా ఇచ్చుటకు తేది 15-09-2026, మంగళవారము ఉ.10-30 ని॥ల నుండి ఆలయ ఆవరణలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హాజరు అయిన వారి సమక్షములో బహిరంగ వేలము ప్రక్రియ నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు సదరు సమయమునకు హాజరై బహిరంగ వేలము ప్రక్రియలో పాల్గొనగలరని కోరుచున్నాము.

| క్ర.నం. | బహిరంగ వేలము వివరములు | కాలపరిమితి | డిపాజిట్ రూ. |
|---|---|---|---|
| 1. | తలనీలాలు ప్రోగు చేసుకొను హక్కు | 1-10-2026 నుండి 30-09-2027 వరకు | రూ.1,00,000/- |

పైన చూపిన బహిరంగ వేలములకు సంబంధించిన ఇతర నియమ నిబంధనలను దేవాలయ కార్యాలయములో తెలుసుకొనగలరు. కరపత్రములలో ఉన్న షరతులు వర్తించబడును.

నోట్: అమ్మవారి ఆలయమునకు 1/2 కి.మీ. దూరములో ఉన్న శివాలయ, రామాలయ దేవస్థానములు దర్శించుకోగలరు.

ఆర్. లక్ష్మి శిరోళి పంతు నాయక్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ.
సం/- యం. వీరేశం, కార్యనిర్వహణాధికారి, Gr.I
DIPR R.O. No. : 9291-PP/CL/ADVT/2026-27, Date: 05-09-2026

## 'కుడా' చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హన్మకొండలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో శనివారం కుడా చైర్మన్ గా గుండు సుధారాణి ఘనంగా ప్రమాణ స్వీకారం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,రేవూరి ప్రకాష్ రెడ్డి,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తదితరులు గుండు సుధారాణికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ... కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మరింత ప్రగతిపథంలో పయనించే విధంగా, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పట్టణాభివృద్ధి పనులు వేగవంతం చేసే దిశగా కృషి చేయాలని కూడా చైర్మన్ గుండు సుధారాణికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్ అలీ, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, పిసిసి నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలి




ప్రజాపక్షం/మరిపెడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తూన్నా కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలనీ సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ పిలుపునిచ్చారు. శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో ఏఐటియూసీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ను యూనియన్ కార్మికులతో కలసి ఆయన అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ, కార్మికుల హక్కులను, సంక్షేమాన్ని దెబ్బతీసే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తోందనీ విమర్శించారు. కార్మిక, కర్షక, రైతు, కూలి, సామన్యుల సమస్యలపై ఐక్యపోరాటాలను మరింత ఉధృతం చేయల్సిన అవసరం ఉందని అన్నారు.ఏఐటియూసీ నిర్వాహిస్తున్నా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలనీ కార్మికలోకానికి ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలను సెప్టెంబర్ 6, 2026న కరీంనగర్ జ్యోతిరావు పూలే సర్కస్ గ్రౌండ్‌లో సాయింత్రం 4 గంటలకు బహిరంగ సభతో ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏఐటియూసీ జాతియ నాయకులు కామ్రేడ్ అమర్‌జీత్ కౌర్, ఎండి యూసఫ్, కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి, కామ్రేడ్ ఎస్ బాలరాజు, కామ్రేడ్ వి.ఎస్. బోస్, కామ్రేడ్ ఎం.నరసింహ వంటి ప్రముఖులు హాజరవుతారనీ తెలిపారు.

## వినాయక చవితికి విద్యుత్ భద్రతే కీలకం

ప్రజాపక్షం/ములుగు: వినాయక చవితి వేడుకల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహాకులు అప్రమత్తంగా ఉండాలని ములుగు సర్కిల్ సూపరింటిండెంట్ ఇంజనీర్ బి భిక్షపతి సూచించారు. ఈ నెల 14న నిర్వహించనున్న వినాయక చవితి సందర్భంగా మండపాలు, విద్యుత్ అలంకరణలు, విగ్రహాల తరలింపు, నిమజ్జన మార్గాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిమజ్జన మార్గాల్లో విగ్రహాలు, క్రేన్లు, భారీ వాహనాల ఎత్తును దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయాలని ఆదేశించారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను గుర్తించి అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎత్తైన విగ్రహాలు, క్రేన్లు విద్యుత్ లైన్లకు తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల నిర్వాహాకులు అధికారిక విద్యుత్ సిబ్బంది ద్వారానే కనెక్షన్ పొందాలని, నాణ్యమైన ఐఎస్ఐ మార్క్ వైర్లు, పరికరాలను ఉపయోగించాలని చెప్పారు. దెబ్బతిన్న వైర్లు, ధ్రుల్ల తాత్కాలికంగా చేసిన కనెక్షన్లు, నీరు లేదా తేమకు గురైన విద్యుత్ పరికరాలను వినియోగించరాదన్నారు. విద్యుత్ తీగలు తెగిపడడం, లూజ్ వైర్లు లేదా ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. టివి, ఇంటర్నెట్ కేబుల్ వైర్లు తక్కువ ఎత్తులో వేలాడకుండా సంబంధిత కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సమన్వయం చేసుకుని చర్యలు చేపట్టాలని ఎస్ఈ సూచించారు. పండగ వేడుకల్లో ఆనందంతో పాటు ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, టిజిఎన్‌పిడిసిఎల్ సిబ్బందికి సహకరించి వినాయక చవితిని ప్రమాదరహితంగా నిర్వహించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సంబంధిత ఇన్‌చార్జికి మెమో జారీ చేసిన ఆలయ ఇఒ

ప్రజాపక్షం ఎఫెక్ట్


ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ఆలయంలో ప్రైవేట్ వ్యక్తితో కలెక్టర్‌కు మంగళవాయిద్యాల నిర్వహణ..? అనే శీర్షిక శుక్రవారం ప్రజాపక్షంలో ప్రచురితమైన వార్తా కథనానికి ఆలయ ఈఓ మహేష్ స్పందించారు. ఈ వ్యవహారంపై ఇంచార్జిగా కొనసాగుతున్న తూనూరి రాజయ్యకు ఈఓ మహేష్ మెమో జారీ చేసి వారం రోజుల్లో సంజాయిషీ కోరారు.

## జనగామ జిల్లాలో కొత్తగా మరో 17 'మీ సేవ' కేంద్రాలు

ప్రజాపక్షం/జనగామ: జిల్లాలో కొత్తగా మరో 17మీ సేవ కేంద్రాల నిర్వాహణకు అభ్యర్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. శనివారం వారొక ప్రకటన చేస్తూ జిల్లాలోని గుర్తించిన మండలాల్లో స్థానిక అభ్యర్థిత్వానికి సంబంధిత మండల ప్రామాణికంగా పరిగణించబడుతుందన్నారు. బచ్చన్నపేట 4,చిల్పూరు1, దేవరుప్పుల 1, స్టేషన్‌ఘనపూర్ 2, జనగామ 4, పాలకుర్తి 1, రఘునాథపల్లి 2 కేటాయించబడ్డాయన్నారు. అభ్యర్థి కనీసం గ్యాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలని, వయస్సు 21 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ సమర్పించాలని, ప్రాథమిక ఆంగ్ల పరిజ్ఞానం ఉండాలన్నారు. ధరఖాస్తులు ఈ నెల 7 నుండి 11 వరకు కాగా పరిశీలన 15వ తేదీన, తుది అర్హుల జాబితా 17, పరీక్ష 20వ తేదీ ఉంటుందన్నారు.

# అందరి చూపూ.. కొండా దంపతుల వైపే!

### వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణలు.. బిజెపి, బిఆర్ఎస్, జనసేనలో మొదలైన చర్చలు



ప్రజాపక్షం/హనుమకొండ: రాష్ట్రంలో ప్రస్తుతం అందరి చూపు కొండా దంపతుల వైపే ఉంది. రాష్ట్ర మంత్రి వర్గం నుండి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. కేబినెట్ నుంచి కొండా సురేఖ బర్తరఫ్ తో ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయంగా చర్చలు మొదలయ్యాయి. కాంగ్రెస్లో ముఖ్యంగా వరంగల్ నగరం పరిధిలో ఇప్పటి వరకు వారికి అసమ్మతిగా ఉన్న నేతలు మరింత గళం విప్పే పరిస్థితి పెరిగింది. ప్రస్తుతం కొండా దంపతులకు వ్యతిరేకంగా ఉన్న కోటరి అంతా ఏకమవుతున్నారు. పార్టీ తీసుకున్న నిర్ణయం కరెక్టేనని ప్రకటించడంతో పాటు పార్టీ వారికి ఎన్నో పదవులు ఇచ్చిందని వారు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. పార్టీ లైన్ దాటితే ఎవరికైనా ఇదే పరిస్థితి అని ప్రకటిస్తున్నారు. కొండా సురేఖ బర్తరఫ్ కాంగ్రెస్ పార్టీలో చర్చకు లేవనెత్తగా ఇతర పార్టీలోనూ చర్చ మొదలైంది. ఆమె ఏ పార్టీ వైపు మొగ్గుతారోనని ప్రతి ఒక్కరూ ఆరా తీస్తున్నారు. తాను కాంగ్రెస్ లోనే ఉంటానని కొండా సురేఖ ప్రకటించినా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎవరికి వారే అంచనాలకు వస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు గుమ్మనంగానే ఉన్నా బర్తరఫ్ వ్యవహారంపై మాత్రం చర్చ కొనసాగుతున్నది.మాజీ మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం ఉమ్మడి జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నేతల్లో అలజడిని రేపింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు కాంగ్రెస్ లో మెజార్టీ ఎమ్మెల్యేలు ఓ వైపు, కొండా వర్గంగా మరోవైపు ఉండగా మంత్రి పదవి నుంచి బర్తరఫ్ కావడంతో అది మరింత పెరిగింది. ఉమ్మడి జిల్లా పరిధిలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొండా దంపతులకు మెజార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు పడటం లేదు. పలు వేదికల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. అధిష్ఠానం దృష్టికి కూడా ఎమ్మెల్యేలు కొండా వర్గం గురించి తీసుకువెళ్లారు. చివరకు సీఎంనే కొండా కూతురు టార్గెట్ చేయడంతో వివాదం మరింత పెరిగి మంత్రి పదవి బర్తరఫ్ కు దారి తీసింది. ఈ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించగా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో మాత్రం జలక్ ఇచ్చింది. కాంగ్రెస్ లోనే ఉంటానని మాజీ మంత్రి కొండా సురేఖ ప్రకటించగా ఆమెపైన నిర్ణయం సరైనదేనని జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ప్రకటిస్తున్నారు. ఎవరైనా గాడి తప్పితే ఇదే నిర్ణయం ఉంటుందని అంటున్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అని ప్రకటిస్తున్నారు.

**మారుతున్న రాజకీయ సమీకరణాలు**

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయగా ఉమ్మడి జిల్లా పరిధిలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. సామాజిక అంశాలతో పాటు రాజకీయ అంశాలు ముడిపడి ఉండటంతో ఎవరికి వారే అంచనాలకు వేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రాధాన్యత ఇచ్చి మంత్రి పదవి ఇచ్చిన సీఎంను దిక్కరించడంతో బర్తరఫ్ చేసినందున కాంగ్రెస్ లోని కొండా వర్గం నేతల్లో కూడా అలజడి మొదలైంది. ఆమె కాంగ్రెస్ పార్టీలో ఉన్నా చేపట్టే కార్యక్రమాలతో ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యేలు మాత్రం అన్నింటిని ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వరంగల్ ఈస్ట్, పరకాల నియోజకవర్గాల పరిధిలో పూర్తిస్థాయిలో క్యాడర్ కు అందుబాటులో ఉండే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

**కొండా పయనం ఎటువైపు..?**

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయగా ఉమ్మడి జిల్లాలో మాత్రం కొండా దంపతుల పయనం ఎటు వైపు ఉంటుందో అని చర్చించుకుంటున్నారు. 30 ఏళ్లుగా తమకంటూ ఒక బాటను ఏర్పాటు చేసుకున్న వారు కాంగ్రెస్ తో పాటు ఇతర పార్టీలోనూ పూర్తిస్థాయిలో ఉండటం లేదు. గతంలో ఉమ్మడి రాష్ట్ర హయాంలో రోశయ్య సీఎంగా ఉన్న సమయంలో పార్టీని వీడి వైసీపీలో చేరారు. మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేశారు. వైసీపీ నుంచి తెలంగాణ ఏర్పాటు తర్వాత టీఆర్ఎస్ లో చేరి ఎమ్మెల్యే అయ్యారు. మళ్లీ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ లో చేరి ఎమ్మెల్యే అయ్యారు. రాష్ట్ర కేబినెట్ లో రెండున్నర ఏళ్లకు పైగా పనిచేశారు.మంత్రి పదవి బర్తరఫ్ చేయడంతో ప్రస్తుతం కొండా దంపతులు ఏ వైపు మొగ్గ చూపుతున్నారనే చర్చ కొనసాగుతుంది. గతంలో బీఆర్ఎస్, వైసీపీ పార్టీల్లో పని చేసినందున ఇప్పుడు ఆవైపు వెళ్తారా లేక కాంగ్రెస్ లోనే కొనసాగుతారా, బీజేపీ, జనసేన వైపు మొగ్గ చూపుతారా అనే చర్చలు సాగుతున్నాయి. బీఆర్ఎస్ వైపు వెళ్లే అవకాశం లేనట్లు ఆ పార్టీ వర్గాల నుంచి తెలుస్తున్నా బీజేపీ నేతలు చర్చించినందున ఆ వైపు మొగ్గ చూపుతారా లేక కాంగ్రెస్ లోనే ఉండి నిలదీస్తారా అని చర్చ కొనసాగుతుంది. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కొండా దంపతుల బర్తరఫ్ పై ఎలాంటి ప్రకటనలు చేయకున్నా పార్టీలో చర్చలు మాత్రం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్‌లో కొండా ప్రాబల్యం**

మాజీ మంత్రి కొండా సురేఖ, కొండా మురళి రాజకీయంగా ఏవైపు మొగ్గుతారో అనే చర్చలు కొనసాగుతున్నా కాంగ్రెస్ లో మాత్రం వారి ప్రాబల్యం తక్కువేమి కాదని పార్టీ నేతలు కొంత మంది చర్చించుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మాజీ మంత్రి కొండా సురేఖ, కొండా మురళి రాజకీయంగా ఏవైపు మొగ్గుతారో అనే చర్చలు కొనసాగుతున్నా కాంగ్రెస్ లో మాత్రం వారి ప్రాబల్యం తక్కువేమి కాదని పార్టీ నేతలు కొంత మంది చర్చించుకుటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వారికంటూ ఒక వర్గం ఉందని, కాంగ్రెస్ లో ఉంటేనే అనుకూలంగా ఉంటుందని కొంత మంది భావిస్తున్నారు. వారు పార్టీని వీడితే వచ్చే మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపైన ప్రభావం ఉంటుందని భావిస్తున్నారు. ఇవే కాకుండా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి కూడా సమీకరణాలు మారే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.ఉమ్మడి జిల్లా పరిధిలో రిజర్వేషన్ ఎమ్మెల్యేలు మినహా జనరల్ స్థానంలో ఎంపికైన వారు బీసీ నుంచి ఒక కొండా సురేఖనే ఉన్నారు. మిగతా ఎమ్మెల్యేలంతా ఓసీ వర్గానికి చెందినవారే ఉన్నారు. ఆమె పార్టీ వదిలితే మిగతా వర్గాల నుంచి కూడా కొంత ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ తో పాటు ఇతర పార్టీల నేతలు కూడా అంచనాకు వస్తున్నారు. మొత్తంగా కొండా దంపతుల రాజకీయ అడుగు ఎటువైపు పడుతుందోనని వేచి చూస్తున్నారు. వారు తీసుకునే నిర్ణయం ఆధారంగా ఉమ్మడి జిల్లాలో కూడా రాజకీయ పరిణామాలు భారీగా మారే అవకాశం ఉంది.

## భూపాలపల్లిలో హీటెక్కిన 'రాజకీయం'



ప్రజాపక్షం/భూపాలపల్లి : వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమాలు రాజకీయ వేడిని రాజేశాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించడంతో అంబేద్కర్ కూడలి వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరుపార్టీల శ్రేణులు పెద్దఎత్తున తరలిరావడంతో పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ నేతృత్వంలో హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉదయం 10 గంటల నుంచి అనుమతి తీసుకుంది. అదే సమయంలో కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ వెయ్యి రోజుల దగా పాలన పేరుతో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టేందుకు బీఆర్ఎస్ ఉదయం 11 గంటలకు అనుమతి తీసుకుంది. అయితే కాంగ్రెస్ కార్యక్రమం నిర్ణీత సమయానికి ప్రారంభం కాకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

మధ్యాహ్నం 1.30 గంటలు దాటినా అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ సభ కొనసాగుతుండటంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో అసహనం పెరిగింది. ఊర్వశి థియేటర్ వద్ద వేచి ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి కాంగ్రెస్ కాన్వాయ్ వెనుక వైపు చేరుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో అంబేద్కర్ కూడలి దద్దరిల్లింది. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యక్రమాలకు ఒకే ప్రాంతంలో, దాదాపు ఒకే సమయంలో అనుమతులు ఇవ్వడం, ఒక పార్టీ కార్యక్రమం ఆలస్యం కావడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికలు రాకముందే భూపాలపల్లి రాజకీయాలు వేడెక్కడంతో చర్చనీయాంశంగా మారింది.

## శ్రీ కృష్ణ తత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/హనుమకొండ: శ్రీకృష్ణ భగవానుడిని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన తత్వాన్ని సమాజంలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నల్గొండకు చెందిన ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లికంటి సత్యం యాదవ్ అన్నారు. వరంగల్ యాదవ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.అంతకుముందు సాయంత్రం హనుమకొండలోని రాంనగర్ ప్రాంతంలో గల సుందర్రా రాజ్ యాదవ్ నివాస గృహం నుంచి శ్రీకృష్ణ భగవానుడి శోభా యాత్ర రథం గొల్లకురుమల డప్పు వాయిద్యాలతో నగర పుర వీధుల గుండా ప్రయాణిస్తూ కాళోజీ కళా క్షేత్రానికి చేరుకుంది. వేద పారాయణంతో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహ మూర్తికి స్వాగతం పలికి వేదికపైన శ్రీకృష్ణుడి పూజలు నిర్వహించారు. కళాకారులు, గాయకులు గీతాలాపన నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకురాలు రావు పద్మ, డాక్టర్ కాళీ ప్రసాద్ పాల్గొని కృష్ణ తత్వంపై ప్రసంగించారు. ప్రతీ ఇంట్లో భగవద్గీత గ్రంథం ఉండాలని, ప్రతీరోజు భగవద్గీత పఠించాలని, కృష్ణుడు చూపిన మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఏదైనా శుభకార్యాలకు వెళ్లినపుడు భగవద్గీత పుస్తకాన్ని బహుమతిగా అందించాలని కోరారు.ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, ఆలపించిన గీతాలు, ఆధ్యాత్మిక భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా కళాక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. సీట్లు సరిపోక భక్తులు నిలబడి కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా అందరికీ గంధం, తిలకం, కృష్ణుడి రక్షలను ప్రసాదంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ వెల్ఫేర్ ట్రస్టు సభ్యులు, యాదవ సంఘం సభ్యులు, కురుమ సంఘం సభ్యులు, పలువురు ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతుల వద్దకే భూ రీ..సర్వే

### పొరపాట్లకు తావు లేకుండా పూర్తి చేయాలి

### కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/గణపురం: భూ రీ సర్వేను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గణపురం మండలం అప్పయ్యపల్లి శివారులోని తూపురం వద్ద శనివారం జరుగుతున్న డిజిటల్ భూ రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే విధానం, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. జిల్లాలో రీ సర్వేకు 70 గ్రామాలను ఎంపిక చేయగా ప్రస్తుతం 12 గ్రామాల్లో సబలు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మిగిలిన గ్రామాల్లోనూ సర్వేను ప్రారంభించి వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సర్వేయర్లకు గమ్‌షూస్, ఇతర రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రోవర్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలను సమర్థంగా వినియోగించి సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గణపుర మండలంలో ఆరు గ్రామాలు ఎంపిక కాగా మూడు గ్రామాల్లో ప్రస్తుతం రీ సర్వే జరుగుతోందని తెలిపారు. రీ సర్వే అనంతరం ప్రతి రైతుకు భూమికి సంబంధించిన స్పష్టమైన భూధార్ సంఖ్య, భూ మ్యాప్ అందుతాయని కలెక్టర్ చెప్పారు. దీనివలన భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం పెరగడంతో పాటు భూ వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత భూముల రీ సర్వే జరుగుతున్నందున రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

**అధికారులే భూముల వద్దకు రావడం సంతోషంగా ఉంది:** గతంలో భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టు తిరగాల్సి వచ్చేదని అప్పయ్యపల్లి రైతు కొప్పుల యాకయ్య తెలిపారు. ప్రస్తుతం అధికారులు నేరుగా గ్రామానికి వచ్చి భూముల వద్దే డిజిటల్ సర్వే నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆధునిక సాంకేతికతతో భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలు ఖచ్చితంగా నమోదైతే భవిష్యత్తులో భూ తగాదాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భూధార్ సంఖ్య, మ్యాప్ అందడం రైతులకు మరింత భరోసానిస్తుందని పేర్కొన్నారు. పర్యటనలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమకుమారి, ఆర్‌డిఓ హరికృష్ణ, తహసీల్దారు రాజేశ్వరరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం

### సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్: డబ్బాలు జంక్షన్: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని, సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగే ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ పెగడపల్లి డబ్బాలు జంక్షన్ వద్ద ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూల నిర్ణయాలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 లేబర్ చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చడానికి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడంలో భాగమేనని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, రాజేందర్, రాముగోపాల్ చారి, అమృతయ్య, తోట రామారావు, రాజయ్య, మల్లయ్య, శంకర్, రాంజీ, సూరయ్య పాల్గొన్నారు.

## పదేళ్ళు దోచుకున్నోళ్ళు సంక్షేమం గురించి మాట్లాడటమా?

### ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్



ప్రజాపక్షం/మరిపెడ: తెలంగాణ సెంటిమెంట్ పేరు చెప్పి అధికారంలోకి వచ్చి పదేళ్ళు రాష్ట్రన్ని దోచుకోని కెసిఆర్ వెయ్యి అబద్దాలు అడుతున్నడు.ప్రజాసంక్షేమం గురించి బిఆర్ఎస్ నాయకులు మాట్లడటం విడ్డురంగా ఉందని ప్రభుత్వ విప్,డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ విమర్శించారు.టిపిసిసి ఆదేశాలతో శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటి కేంద్రంలో మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుగులోతు రవినాయక్ అధ్వర్యంలో నిర్వాహించిన 1000 రోజుల పాలన విజయోత్సవ ర్యాలికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యరు.ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తెలంగాణలో ప్రజాప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండున్నర ఏళ్ళు పూర్తి చేసుకోని ఎన్నో విజయాలు సాధించి రాష్ట్రన్ని అభివృద్ధి చేస్తు ముందుకు పోతుంటే కెసిఆర్ వెయ్యి అబాద్దాలు అడారని విమర్శించారు. గత రెండున్నర సం.లు శాసనసభకు రాకుండా, ప్రజా సమస్యలపైన ప్రశ్నించకుండా 22 కోట్ల ప్రజధనం తీసుకున్నడని, కనీసం ప్రజాక్షేత్రంలో కనిపించలేదని అరోపించారు. శాసనసభకు వస్తడా రాజీనామా చేస్తాడా అని యువకులు నీలదిస్తారనీ, ప్రజలు బిఆర్ఎస్ ను మరచిపోతున్నరనీ మళ్ళి ఈ రోజు వెయ్యి అబాద్దాలు అంటు ప్రజక్షేత్రంలోకి వస్తున్నరనీ ఎద్దేవ చేశారు. ఈ కార్యక్రమంలో యుగేందర్‌రెడ్డి, ప్రగతి శ్రీ పాల్‌రెడ్డి, రవినాయక్, రాంలాల్, సునిత రవిందర్ రెడ్డి, విజయ్‌నాయక్, అంబరీష, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

## జనగామ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత

### కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య ఘర్షణ



ప్రజాపక్షం/జనగామ: జనగామ జిల్లాలో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బిఆర్ఎస్ ర్యాలీల సందర్భంగా గాంధీ విగ్రహం వద్ద రెండు పార్టీల నాయకుల మధ్య గర్షణ చోటు చేసుకుంది. ఇరు పార్టీల నాయకలు నినాదాలు చేసుకోవడంతో పాటు ఒకరిని ఒకరు నెట్టెసుకున్నారు. పోలీస్‌లు అప్రమత్తం కావడంతో పరిస్థితి సద్దుమనిగింది. ఇక డబుల్ బెడ్ రూం ఇళ్ల డ్రా తీస్తున్న సందర్భంగా సిపిఎం నాయకులు కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తుండగా అక్కడ వారిని అరెస్ట్ చేస్తున్న సమయంలో ఉద్రిక్తత నెలకొంది. పై రెండు సంఘటనలతో పాటు సిపిఎం నాయకులు అరెస్ట్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ఆందోళన, విద్యార్థుల రాస్తారోకో, నిరసన కార్యక్రమాలతో జనగామలో ఐటెన్షన్ నెలకొంది. జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిగా ఇక్కడే ఉండడంతో ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ చౌరస్తా నుండి గెస్ట్‌హౌస్ వరకు భారీ ర్యాలీ నిర్వయించారు. కాంగ్రెస్ హామీలపై భాకీ కార్డుల పేరుతో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి నాయకత్వాన నెహ్రూ పార్కు నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వయించారు. రెండు ర్యాలీలు ఒకే దఫా ప్రారంభం కావడంతో క్రిష్ణ కళామందిర్‌కు వెళ్లె దారి వద్ద ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల ర్యాలీలు తారాస పడ్డాయి. కాంగ్రెస్‌పై బిఆర్ఎస్, బిఆర్ఎస్‌పై కాంగ్రెస్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొందరు బిఆర్ఎస్ కార్యకర్తలు, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు తలపడేందుకు యత్నించిన నేపథ్యంలో పోలీసులు జనగామ జిల్లా సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వారిని అడ్డుకొని ర్యాలీలను ముందుకు నడిపించారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఖమ్మం రైల్వేస్టేషన్ ఆటో స్టాండ్ వద్ద గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సిహెచ్ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ ఆదేశాల మేరకు శనివారం ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద సిబ్బందితో కలిసి తనిఖీలు చేస్తుండగా ఒకటవ నెంబర్ ప్లాటు ఫాం సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న బ్యాగ్‌లో ఎండు గంజాయి దొరికిందని తెలిపారు. అతనిని విచారించగా ఒడిశాకు చెందిన కె. సింహాద్రిరావు అని అక్కడి నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఖమ్మం పరిసరప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలిదన్నారు. అతని నుంచి రూ.85,000 విలువ చేసే 1.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి ఎక్సైజ్ వన్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ వెంకన్న, శివకుమార్, వీరబాబు, తిరుపతి, స్రవంతి పాల్గొన్నట్లు పేర్కొన్నారు. గంజాయి, మధక ద్రవాలు వంటి మత్తుపదార్థాలు విక్రయాలు, రవాణ చేస్తున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ శ్రీనివాస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సిపిఐ సీనియర్ నాయకుడు అనుగోజు కోటయ్య మృతి



ప్రజాపక్షం/నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు అనుగోజు కోటయ్య శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు శనివారం ఉదయం గ్రామ శాఖ నాయకులతో కలిసి కోటయ్య భౌతికకాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కోటయ్య భౌతికకాయం పై ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కోటయ్య మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఆయన సిపిఐ బలోపేతానికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, గ్రామ శాఖ సహాయ కార్యదర్శులు భద్రాజీ వెంకటేశ్వరరావు, బాలెబోయిన వెంకన్న, కార్యవర్గ సభ్యుడు బాలిన నారాయణ, చిలువేరు రేణుబాబు, పొలంపల్లి నారాయణ తదితరులు ఉన్నారు.

## ధర్నా ఫలితం.. సాగునీటి విడుదల

మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కూసుమంచి: వర్షాభావ పరిస్థితులతో సాగునీటి కొరతను ఎదుర్కొంటున్న పాలేరు నియోజకవర్గ రైతుల పంటలను కాపాడేందుకు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి చేపట్టిన ఆందోళన ఫలించింది. ఈనెల 2న పాలేరు జలాశయం వద్ద ఆయన నిర్వహించిన ధర్నాకు స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు శనివారం జలాశయం నుంచి సాగునీటిని విడుదల చేశారు. పంటలు ఎండిపోతున్న పరిస్థితుల్లో తక్షణమే నీటిని విడుదల చేయాలని ధర్నా సందర్భంగా ఉపేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీటి విడుదలపై ఆయన స్పందిస్తూ రైతుల పక్షాన నిలబడి చేసిన పోరాటానికి నీటి విడుదలే నిదర్శనం, పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఊరుకోం, రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని అన్నారు. స్పందించి నీటిని విడుదల చేసిన నీటిపాదల శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు పంటకు నీరు, రైతు కుటుంబానికి భరోసా, పాలేరు రైతాంగ శ్రేయస్సు కోసం మా పోరాటం ఎల్లప్పుడూ కొనసాగుతుందని కందాళ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## మార్కుల కంటే సంస్కారం, నైతికతే ప్రధానం: కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ ఖమ్మం : విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మార్కుల కంటే సంస్కారం, నైతికత, సత్య పలుకే ప్రధానమైందని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివేకం లేని విద్య శూన్యమని మార్కుల కంటే సంస్కారం ముఖ్యమన్నారు. పెద్దలను గౌరవించడం, సత్యం కోసం నిలబడేవిధంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ అన్నారు. సమాజంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని గతంలో ఉపాధ్యాయులు మందలించినా, దండించినా విద్యార్థుల మంచికేనని ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు భావించే వారని ఉపాధ్యాయులను దేవుని ప్రతిరూపంగా గుర్తించి గౌరవించే వారన్నారు. కానీ ఇటీవల జరుగుతున్న ఘటనలు తీవ్ర ఆవేదనను కలిగిస్తున్నాయన్నారు. సమాజ సంస్కర్తలు ఉపాధ్యాయులేనని ఈ సమాజాన్ని ఆరోగ్యకరమైన సమాజంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. భవిష్యత్తులో మంచి సమాజం రూపుదిద్దుకోవాలంటే అందుకు ఉపాధ్యాయులు కీలక భూమిక పోషించాలని ఆయన సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తముడేనని ఈ రోజు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారిని స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యా బోధనలోనే కాకుండా ప్రభుత్వ కార్యక్రమాల అమలులోనూ అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ఈ విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఇఒ సదానందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 131 మంది ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ సన్మానించారు.

# కొమరయ్య ఆశయాలే కార్మిక ఉద్యమానికి బాట

పెన్షన్, బోనస్ వంటి హక్కులు ఆయన పోరాట ఫలితమే

ఎమ్మెల్యే కూనంనేని



ప్రజాపక్షం/చుంచుపల్లి: సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమనేత కొమరయ్య సేవలు చిరస్మరణీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొమరయ్య 30వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాలోని వివిధ గనులు, విభాగాల వద్ద ఎఐటియుసి బ్రాంచ్ నాయకుల ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కొమరయ్య చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నేడు కార్మికుల జీవితాల్లో కనిపిస్తున్న అనేక సంక్షేమ హక్కుల వెనుక కొమరయ్య వంటి నాయకుల సుదీర్ఘ పోరాటం ఉందన్నారు. కార్మికుడు ఉద్యోగ విరమణ అనంతరం కూడా గౌరవప్రదంగా జీవించేందుకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్న ధృఢ సంకల్పంతో కొమరయ్య పోరాడారని తెలిపారు. కార్మికుల భవిష్యత్తు భద్రత కోసం పోరాడినందుకే కొమరయ్యను కార్మికులు 'పెన్షన్ ప్రదాత'గా గౌరవంగా స్మరించుకుంటున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పైనా కొమరయ్య ప్రత్యేకంగా దృష్టి సారించారని నాయకులు తెలిపారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న కార్మికుల మధ్య వివక్ష ఉండకూడదనే భావనతో కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల కోసం పోరాడారని, పలువురు కార్మికులను పర్మినెంట్ చేయించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కార్మిక సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అన్నారు.

### అగ్రిమెంట్లపై దుష్ప్రచారం మానుకోవాలి..

కొమరయ్య స్ఫూర్తితో ఆర్ఎల్‌సి సమక్షంలో కార్మికుల శ్రేయస్సు కోసం అనేక కీలక డిమాండ్లపై అగ్రిమెంట్లు సాధించామని ఎఐటియుసి నాయకులు తెలిపారు. కార్మికులకు ప్రయోజనం చేకూర్చే ఈ అగ్రిమెంట్లను కొన్ని కార్మిక సంఘాలు జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి అనుకూలంగా వెళ్లే కొన్ని కార్మిక సంఘాల నాయకులు కూడా కార్మిక సంఘాల నాయకులు కూడా కార్మికులకు ప్రయోజనం చేకూర్చే అగ్రిమెంట్లపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమాల్లో ఎఐటియుసి సీనియర్ నాయకులు శేషయ్య, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శులు జక్కుల గట్టయ్య, రమణమూర్తి, సుధాకర్, ఉపాధ్యక్షులు కత్తర్ల రాములు, కిష్టోఫర్, కార్మిక నాయకులు, ఫిట్ కార్యదర్శులు కమల్, భూనక్య రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మేధావులను తయారు చేసే యోధులు ఉపాధ్యాయులు

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : విద్యార్థులకు పాఠ్యాంశాలతోపాటు క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేసే ఉపాధ్యాయులు నిజమైన యోధులని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. తరగతి గదుల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిలోని సృజనాత్మకతను వెలికితీసి ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుడి బోధన విద్యార్థి జీవితాన్నే మార్చగలదని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి అవసరమైన మేధావులు, శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులు, వివిధ రంగాల నిపుణులను తీర్చిదిద్దేది గురువులేనని అన్నారు. అందుకే ఉపాధ్యాయుల సేవలను గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, జడ్‌పి సిఇఒ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కారు, బైక్ ఢీ; ఒకరు మృతి



ప్రజాపక్షం/ కొణిజర్ల : కారు, మోటార్ సైకిల్ ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం కొణిజర్ల ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో చోటు చేసుకుంది. మల్లా మురళీకృష్ణ (31)తో పాటు బొద్దపు శివకుమార్ అనే వ్యక్తులు ఖమ్మం వస్తుండగా కొణిజర్ల సమీపంలో మోటార్ సైకిల్ ఆపి మూత్రవిసర్జనకు వెళ్లారు. ఆ తర్వాత రోడ్డుపైకి వచ్చి మురళీకృష్ణ మోటార్ బైక్ నడుపుతుండగా వెనక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మురళీకృష్ణను ఆసుపత్రికి తరలించగా మృతిచెందారు. మృతుడిది తూర్పు గోదావరి జిల్లా కిర్లంపుడి మండలం ముక్కోలు గ్రామానికి చెందిన వారు. రైస్‌మిల్ మెకానిక్‌గా పనిచేసే మురళీకృష్ణ పెనుబలి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

## సంఘటితంగా ఉద్యమిద్దాం..డిమాండ్లు సాధిద్దాం

టిజిఇ జెఎసి నేతల పిలుపు



ప్రజాపక్షం/ ఖమ్మం : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్యంగా ఉద్యమించి సమస్యలు పరిష్కరించుకుందామని టిజిఇ జెఎసి రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 10న జెఎసి ఆధ్వర్యంలో తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి ఖమ్మం నుంచి పెద్ద సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఛలో హైదరాబాద్ కార్యక్రమం జయప్రదం కోరుతూ శనివారం జెఎసి సన్నాహాక సమావేశాన్ని స్థానిక టిఎన్‌జిఒ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఖమ్మం జిల్లా ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని ఇప్పుడు హక్కుల సాధన కోసం ఖమ్మం ముందు వరుసలో నిలబడాలని విజ్ఞప్తి చేశారు. వివిధ సంఘాలు, సంస్థలు విడివిడిగా పోరాటాలు చేయడం వల్ల బలమైన ఉద్యమాలను నిర్మించలేకపోతున్నామన్న ఉద్దేశంతో జేఏసిని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంలో అంతర్భాగమని ఉద్యోగులు, ప్రభుత్వం కలిపి పనిచేసినప్పుడే ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా చేరతాయని జగదీశ్వర్, శ్రీనివాస్ తెలిపారు. ప్రతి నెల ఒకటిన వేతనాలు ఇస్తామని ప్రభుత్వం గొప్పగా చెబుతుందని ఇది ఘనత కాదని బాధ్యత అని వారు గుర్తు చేశారు. సభకు అనుమతి విషయంలో ఏదైనా సమస్య ఎదురైనా ముఖ్యమంత్రికి తమ సమస్యలు వినిపిస్తామన్నారు. జెఏసి పోరాట ఫలితంగా కొన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నప్పటికి ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. 10న జరిగే సభ కంటే ముందే ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. అభినందన సభగా మారుస్తారా లేక నిరసనగానే కొనసాగిస్తారా అన్నది ప్రభుత్వం చేతుల్లో ఉందని వారు స్పష్టం చేశారు. అంతకు ముందు జరిగిన సన్నాహాక సమావేశానికి జిల్లా జేఏసి చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా వివిధ సంఘాల నాయకులు చావా రవి, దామోదర్ రెడ్డి, సదానంద గౌడ్, శ్రీనివాసరెడ్డి, కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి, కొణిదెన శ్రీనివాస్, పరిశ పుల్లయ్య, కృష్ణ చైతన్య, భార్గవ్, నాగేశ్వరరావు, కోడి లింగయ్య, మేరీ ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

## మోదీ వ్యాఖ్యలపై పోరాటం తప్పదు

సీతక్క మార్గం అనుసరణీయం

సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ప్రజాపక్షం/ ఖమ్మం : మోదీ దిమాగి నక్సల్స్ పేరుతో మాట్లాడుతున్న మాటలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాడక తప్పదని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. దేశ సంపదను విదేశాలకు, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడంలో మోదీ సఫలీకృతులయ్యారని దేశ సమస్యలను పరిష్కరించడంలో మాత్రం ఘోరంగా విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. ఇటీవల మరణించిన పార్టీ సీనియర్ నాయకురాలు శ్రీకాకుళం సాయిధ పోరాట యోధుడు ధర్మన్న సతీమణి సీతక్క సంస్మరణ సభ శనివారం స్థానిక మాస్‌లైన్ కార్యాలయంలో జరిగింది. ఈ సభలో రంగారావు మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన గంగసాని వీరయ్య అలియాస్ ధర్మన్న 1972 ప్రాంతంలో తన జీవిత సహచరి సీతక్కను తీసుకుని సాయుధ పోరాట బాట పట్టారన్నారు. సీతక్క విప్లవోద్యమంలో పాల్గొన్నదని అనేక కష్టాలను అనుభవించి కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి కృషి చేసిందన్నారు. ఇబ్బందులకు, నిర్బంధాలకు భయపడక తన లక్ష్య సాధన వైపు సీతక్క సాగిందని, ఆమె ఆశయాలు సదా అనుసరణీయమన్నారు. దేశంలో ఒక ప్రత్యేక పరిస్థితులు నెలకొన్నాయని వామపక్ష లౌకిక శక్తులు మరింత బలోపేతం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సభకు ముందు సీతక్క చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో మాస్‌లైన్ జాతీయ నాయకులు కెచ్చల రంగారెడ్డి, మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, జిల్లా నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, సిహెచ్ శిరోమణి, సీతక్క వారసులు కల్పన, కృష్ణ, పార్టీ బాధ్యులు రామయ్య, అశోక్, శివలింగం పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే ఆదినారాయణ



ప్రజాపక్షం/చంద్రుగొండ: పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషిగా కృషి చేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయన అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువుల పాత్ర అమూల్యమన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడంతో పాటు వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయమన్నారు. తన నిధులతో నియోజకవర్గంలోని ఉన్న పాఠశాలల అభివృద్ధికి నిధులు వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈక్రమంలో మద్దుకూరులో నూతన పాఠశాల భవనానికి రూ. రెండు కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. మహమ్మద్ నగర్ దత్తత గ్రామంలో పాఠశాల భవనానికి, రేపల్లెవాడ పాఠశాలలో టాయిలెట్లకు, చంద్రుగొండలో ఎంఆర్‌సి బిల్డింగ్‌కు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో ప్రభుత్వం అందించే సైకిళ్లను విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

## వైరాకు బిఆర్ఎస్ చేసింది శూన్యం

మున్సిపల్ చైర్ పర్సన్ కాపా చంద్రకళ

ప్రజాపక్షం/ వైరా : గత బిఆర్ఎస్ ప్రభుత్వం వైరాకు చేసింది శూన్యమని మున్సిపల్ చైర్ పర్సన్ కాపా చంద్రకళ తెలిపారు. అభివృద్ధిని చూడలేక బిఆర్ఎస్ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రకళ మాట్లాడుతూ వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ నాయకత్వంలో అభివృద్ధి పథంలో వైరా ముందుకు సాగుతుందన్నారు. వైరా మున్సిపాలిటీని అత్యుత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాలతో పేదల కలలను నిజం చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ బొర్ల గంగారావు, కాంగ్రెస్ నాయకులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వి. సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, పమ్మి అశోక్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, బలరామయ్య పాల్గొన్నారు.

## యువతను మోసం చేసిన కాంగ్రెస్

మాజీ మంత్రి పువ్వాడ



ప్రజాపక్షం/ ఖమ్మం : యువతను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని యువతకు ఇచ్చిన హామీలను వెయ్యి రోజులైన అమలు చేయలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దగా చేసిందని యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదన్నారు. బిఆర్ఎస్ పిలుపు మేరకు శనివారం ఖమ్మంలో యువజన విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి మయూరి సెంటర్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన సభలో అజయ్ కుమార్ మాట్లాడుతూ గడిచిన మూడేళ్లుగా వేలాది కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఇంజనీరింగ్ అడ్మిషన్ల సమయంలో నెల రోజుల్లో చెల్లిస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో కనీస వసతులు లేవని, నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అజయ్‌కుమార్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బచ్చు విజయ్‌కుమార్, కర్నాటి కృష్ణ, మగ్బూల్, యువజన విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 'సాయిస్ఫూర్తి'లో ఘనంగా ఓరియంటేషన్ కార్యక్రమం

ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, ఆదినారాయణ హాజరు




ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని 'సాయిస్ఫూర్తి' అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, ఎంబిఏ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంసెట్2026 కౌన్సెలింగ్, మేనేజ్‌మెంట్ కోటా ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, గంగారం సర్పంచ్ కాకర్ల రేవతి, డాక్టర్ మట్టా దయానంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద మాట్లాడుతూ జ్ఞానాన్ని ఆయుధంగా మలుచుకుని, విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు, హెటిరో సంస్థల అధినేత డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి సందేశాన్ని వర్చువల్‌గా వినిపించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ విద్య అంటే కేవలం మార్కులు, డిగ్రీ సాధించడం కాదని, జ్ఞానం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, విలువలను పెంపొందించుకోవడమేనని అన్నారు. జారే ఆదినారాయణ విద్యార్థులు పెద్ద కలలు కని, కష్టపడి పనిచేస్తూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## ఫుడ్ పాయిజన్ అవాస్తవం

చిన్నారులంతా క్షేమమే

జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల



ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి ఐసిడిఎస్ పరిధిలోని కిష్టారం3 అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్ జరిగిందన్న ప్రచారంలో వాస్తవం లేదని జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల తెలిపారు. సెప్టెంబర్ 1న ఆకుకూర పప్పులో మరో ఆకును పోలిన పదార్థం కనిపించడంతో ముందస్తు జాగ్రత్తగా ముగ్గురు చిన్నారులను ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రితో పాటు తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రక్త పరీక్షలు, ఇసిజి, 2డి ఎకో తదితర పరీక్షలు నిర్వహించగా ఎలాంటి అసాధారణతలు గుర్తించలేదని తెలిపారు. ముగ్గురు చిన్నారులు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అంగన్‌వాడీ సిబ్బందికి ఆహార భద్రతపై సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే కీలకం

'ఆల్ఫోర్స్' విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** విద్యార్థుల భవిష్యత్తును తరగతి గదిలో తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ని పురస్కరించుకొని జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శని వారం సుల్తానాబాద్ లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను, విద్యార్థులచే వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ఏ ఉద్యోగికి దక్కని గౌరవం కేవలం ఉపాధ్యాయునికే దక్కుతుందన్నారు. విద్యార్థుల ప్రసంగాలు పాటలకు అనుగుణంగా చేసిన నృత్యాలు ఆద్యంతం ఆసక్తిగా సాగాయి,ఉపాధ్యాయులకు విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపక బృందం,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## 'భగీరథ' పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు




**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం పట్టణం టెంపుల్ సమీపాన ప్రధాన రహదారి వద్ద పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టి నీటి లీకేజీలు నిలుపుదల చేయాలని, తాగునీరు వృథా కాకుండా, రహదారులపై రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతూ ఈనెల 3వ తేదీన 'ప్రజాపక్షం'లో ప్రచురితమైన కథనానికి నగరపాలక అధికారులు స్పందించారు. శనివారం పైప్‌లైను లీకేజీల ప్రదేశంలో తవ్వకాలు చేపట్టారు. పగిలిన పైపులను తొలగించి మరమ్మతులు ప్రారంభించారు. కొత్త పైపులను అమర్చి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

## చందుర్తిలో ఎరువులకు కొరత లేదు



**ప్రజాపక్షం/ చందుర్తి :** జిల్లాలో పంటల సాగుకు కావాల్సిన ఎరువులకు కొరత లేదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. చందుర్తి మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పిఎసిఎస్ లో ఎంత యూరియా ఉంది? ఎంత వచ్చింది? యాప్ ద్వారా రైతులు బు కింగ్ చేసుకున్న వివరాలు మొబైల్, రిజిస్టర్ లో పరిశీలించారు. ఆన్‌లైన్, పిఎసిఎస్ లో యూరియా నిల్వలను సిబ్బందితో లెక్కించి తనిఖీ చేయించారు. పిఎసిఎస్ లో రైతులు యూరియా తీసుకువెళ్లేందుకు రాగా, వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... జిల్లాలో ఎరువులకు కొరత లేదని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. సాగుకు అనుగుణంగా ఎరువులు తీసుకువెళ్లాలని సూచించారు. పరిశీలనలో వేములవాడ ఆర్‌డిఒ కుమారి, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, ఎడిఎ సిబ్బంది ఉన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై కదం తొక్కిన బిఆర్ఎస్



**ప్రజాపక్షం/ వేములవాడ టౌన్:** మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందని బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు మండిపడ్డారు. శనివారం వేములవాడలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, విద్యార్థులు, యువతతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెటిఆర్ ఐటి రంగాన్ని విస్తరించి యువతకు విస్తృత ఉద్యోగావకాశాలు కల్పించారని గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చకపోతే ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ఏనుగు తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ప్రపంచానికి కృష్ణుడు మార్గదర్శి



**ప్రజాపక్షం / చొప్పదండి :** శ్రీ కృష్ణ భగవానుడు యావత్ ప్రపంచానికే మార్గదర్శి అని గీతా విద్యాలయం పాఠశాల డైరెక్టర్ లింగారావు అన్నారు. శనివారం రోజున చొప్పదండి పట్టణంలోని గీతా విద్యాలయం పాఠశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో విద్యార్థులు శ్రీ కృష్ణుడు, గోపిక వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ఉట్టి కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల డెరెక్టర్ లింగారావు మాట్లాడుతూ భగవద్గీతలో అర్జునుడికి మార్గదర్శకంగా ఉపదేశించిన మాటలలోని కొన్ని కర్మ, నిర్వహణ, జ్ఞానం మొదలైన విషయాలపై అవగాహన కల్పించారు. ఎల్లవేళలా ధర్మం, సత్యం అనే విలువలతో కూడిన జీవితాన్ని అనుసరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మండల శాఖ అధ్యక్షుడు గుర్రం ఆనంద రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని దివాళా తీయించిన కెసిఆర్

రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి




**ప్రజాపక్షం/గజ్వేల్:** కాళేశ్వరం అవినీతిపైకెసిఆర్ అసెంబ్లీకి వచ్చి జవాబు చెప్పాలని, అసెంబ్లీకి రాకపోతే వెంటనే ఆయన గజ్వేల్ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్‌లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొని ఆయన ప్రసంగించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ 8 లక్షల కోట్ల అప్పుతో దివాలా తీయించినట్లు విమర్శించారు. పేదల డబ్బుతో తెలంగాణ సాధించగా, రూ.1000 కోట్ల నిధులు ఎక్కడికని నిలదీశారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై జరిగే చర్చలో కెసిఆర్ పాల్గొనాలని, అంతేకాకుండా రూ. 8 లక్షల కోట్ల అప్పుపై అసెంబ్లీలో జవాబు చెప్పాలని పేర్కొన్నారు. మల్లన్న సాగర్ నిర్మాణంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. దేశంలో చిన్న రాష్ట్రమైనప్పటికీ పెద్ద పార్టీగా అవినీతి సొమ్ముతో నిధులు సమకూర్చుకున్నట్లు విమర్శించారు. ముఖ్యంగా కెసిఆర్ తీరుతో గజ్వేల్ అభివృద్ధి కుంటుపడుతోందని, ఇక్కడి ప్రజలు నమ్మి ఓట్లేసిన పాపానికి అసెంబ్లీకి వచ్చి నిధులు అడగాలని సూచించారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అధికార పక్షంపై నిప్పులు చెరుగుతుండగా, ఇక్కడి ప్రతిపక్ష నేత కెసిఆర్ మాత్రంఫాంహౌజ్‌కు పరిమితమైనట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తుండగా, గజ్వేల్‌లో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొని అభివృద్ధికి కెసిఆర్ ఆటంకంగా మారినట్లు తెలిపారు. దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి జవాబు చెప్పాలని సవాల్ విసిరారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎల్లక్షన్ రెడ్డి, భూమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వైస్ విజయ మోహన్, నాచగిరి ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త, పిసిసికార్యదర్శి నాయిని యాదగిరి, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, మజీద్ కమిటీ చైర్మన్ మతీన్, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు సమీర్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సుఖేందర్ రెడ్డి, నేతలు మోన గారి రాజు, సారిక శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, రేగొండ గౌడ్, రాము లు గౌడ్, రమేష్ గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్, చెప్పాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'నేడు' ధర్మపురికి భట్టి రాక

**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక-ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈనెల 6, 7 తేదీల్లో ధర్మపురిలో పర్యటించనున్నారు.6వ తేదీ ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రికిధర్మపురి చేరుకుంటారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇతరులతో సమావేశమై ధర్మపురిలో రాత్రి బస చేస్తారు.7వ తేదీ సోమవారం తెల్లవారుజామున 2.58 గంటలకు ధర్మపురిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన అనుబంధ దేవాలయం శ్రీ ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి జరుగను న్నశంకుస్థాపన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం ఉదయం ధర్మపు రి నుంచి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.ఉప ముఖ్యమంత్రి పర్యటనను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర సాంఘిక సం క్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పిలుపునిచ్చారు.

## ఒక్క విద్యార్థిపై కేసు పెట్టినా.. తస్మాత్ జాగ్రత్త

పోలీస్‌లకు మాజీ మంత్రి హరీష్‌రావు మాస్ వార్నింగ్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** విద్యార్థుల ఉన్నత చదువులు, ఉద్యోగం, భవిష్యత్తు కోసం అండగా ఉంటానని.., పోలీస్‌లు కూడా అత్యుత్సాహం చేస్తున్నారూ, పోలీస్‌లకు చెప్తున్నా మా విద్యార్థుల మీద కేసులు పెట్టొద్దు... వారిని ఎవరూ కొట్టొద్దు... కొట్టేది ఉంటే హరీశ్ రావును కొట్టండి... పెట్టేది ఉంటే హరీశ్ రావు మీద కేసులు పెట్టండి... కానీ మా విద్యార్థుల మీద కాదనీ మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు పోలీసులకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద శనివారం జరిగిన నిరుద్యోగ యువత నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటం చేస్తుంటే, విద్యార్థుల మీద కేసుల పెడతా అని పోలీస్ లు బెదిస్తున్నారట, ఒక్క విద్యార్థి మీద కేసు పెట్టిన తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఇప్పుడు ప్రభుత్వం గ్యారంటీలు అమలు చేయకపోతే నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని అన్నారు. బిఆర్ఎస్ ప్రజల గొంతుకై పోరాడుతుందనీ, విద్యార్థుల పక్షాన పోరాడుతుందనీ, మీరు బాగా చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎ స్వి, యువజన విభాగం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురువులే భావితరాల రూపశిల్పులు : కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** గురువులే భావితరాల రూపశిల్పులని.. మన అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానవంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైందని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఇఒచైతన్య జైనీ, విద్యాశాఖ ఏడి ప్రశాంత్ రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల రెండో ఇల్లు అని.. బాల్యం నుంచే పాఠ్యాంశాలతో పాటు శుభ్రత, ధైర్యం, క్రమశిక్షణ నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించి సన్మానించారు. పరీక్షల విభాగం సెక్రటరీ భగవంతయ్య, స్పెషల్ అధికారులు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, దాసి శ్రీనివాస్, మహేందర్, జిసిడిఒ ఉమారాణి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ఎంఇఒ లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల :** విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యం లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రధానోత్సవం శనివారం జగిత్యాల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగిత్యాల శాసనసభ్యుడు డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథి గా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్ష లు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్య ంత గొప్పదని అన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల కృషి ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను గుర్తించి పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమని,ఈ పురస్కారాలు మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని తెలిపారు.అదనపు కలెక్టర్ రాజా గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి,వారిని ప్రోత్సహిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు ఇతరులకు ఆదర్శంగా నిలిచి,విద్యార్థుల అభ్యున్నతికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాము,డిప్యూటీ సిఇఒనరేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉన్నారు.

## సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి జీవన్ రెడ్డి



**ప్రజాపక్షం/జగిత్యాల:** విద్యార్థులు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందనిమాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు.బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన వైఫల్యంపై ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై జగిత్యాల పట్టణంలోని ఆర్ డి ఒకార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి వందలాది మంది బిఆర్ఎస్‌నాయకులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికిబిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యా సాగర్ రావు, జగిత్యా ల జిల్లా పరిషత్ తొలి చైర్‌పర్సన్ దావా వసంత సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ..దేశ భవిష్యత్ అయిన.. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు.రాష్ట్ర ప్రభు త్వం కళాశాలలకు రూ. 12 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని వివరించారు. బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల వి ద్యా సాగర్ రావు మాట్లాడుతూ..విద్యార్థుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని రేవంత్ రెడ్డి కొత్త నాటకం ప్రారంభించార ని,ఆశ చూపడం..మోసం చేయడంలో నెంబర్ 1 రేవంత్ రెడ్డి అనిఆరోపించారు.కార్యక్రమంలోబిఆర్ఎస్‌నాయకులుఉన్నారు.

## 16న అవార్డు ఎంక్వైరీ నిలిపివేయాలి : మంత్రి దుద్దిళ్ల



**ప్రజాపక్షం/రామగిరి:** ఆర్‌జి3 ఒసిపి2 విస్తరణలో భాగంగా రాజాపూర్ గ్రామాన్ని సుమారు 451 ఎకరాల భూమిని సింగరేణి సంస్థ తీసుకునే క్రమంలో గత సంవత్సరం నవంబర్‌లో రిక్విజిషన్ చేశారు. అనంతరం డిసెంబర్‌లో రెవెన్యూ సింగరేణి అధికారుల ఆధ్వర్యంలో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి ప్రాజెక్టు నంబర్లు కేటాయించారు. నంబర్లు కేటాయించే సమయంలో రాజాపూర్ పరిధిలోని ఇండ్లకు ఆర్టిహెచ్ అనే రెండు విభాగాలుగా విభజించి నంబర్లు కేటాయించారు. జనవరిలో జారీ చేసిన పబ్లిక్ నోటిఫికేషన్‌లో ఆర్‌పి నెంబర్లను మాత్రమే చేర్చి,ఆర్టిహెచ్ నంబర్లను చేర్చలేదు.అప్పటి నుండి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ ఆధ్వర్యంలో,రాజాపూర్ సర్పంచ్ పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ నాయకుల సహకారంతో గ్రామ సమస్యలను ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకి తెలియజేశారు.ఆగస్టులో కలెక్టర్ పబ్లిక్ డిక్లరేషన్ జారీ చేయసారు.ఈ నెల 16వ తేదీన అవార్డు ఎంక్వైరీకి హాజరు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ విషయాన్ని ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్ల గా, మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ ఫోన్ చేసి,ఈనెల16వ తేదీ న నిర్వహించనున్న అవార్డు ఎంక్వైరీని నిలిపివేయాలి. రాజాపూర్ గ్రామ సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు అవార్డు ఎంక్వైరీ నిర్వహించ వద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ పుల్లెల సతీష్,గ్రామశాఖ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్,యూత్ అధ్యక్షుడు మాటేటి శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాటేటి రవి పాల్గొన్నారు.


## రైల్వే కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటా!



**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం రైల్వేస్టేషన్‌లో పనిచేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ హామీ ఇచ్చారు. ద.మ.రై. మల్టీపుల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు రామగుండం రైల్వే స్టేషన్ నుంచి గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, యూనియన్ అధ్యక్షులు కన్నూరి సతీష్‌కుమార్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో జీఓ97ను ఎండగడతాం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల శాసనసభ్యుడు కెటిఆర్



**ప్రజాపక్షం/వేములవాడ :** పాలిటెక్నిక్ కళాశాలల విలువైన భూములు, ఆస్తులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్నేసిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ ఆరోపించారు. శనివారం జిఒనంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 రోజులకు పైగా ఆందోళన చేస్తున్న సిరిసిల్ల పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను కెటిఆర్ కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పాలిటెక్నిక్ కళాశాలలను లేబర్ డిపార్ట్‌మెంట్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు తీసుకొచ్చిన జిఒ నంబర్ 97 వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగడతామని స్పష్టం చేశారు. జిఒ 97ను రద్దు చేసే వరకు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బిఆర్ఎస్ పార్టీ వారి వెంట ఉంటుందని భరోసా ఇచ్చారు. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌తో పాటు సిరిసిల్ల, కరీంనగర్ తదితర పట్టణ ప్రాంతాల్లో విలువైన భూముల్లో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల ఆస్తులపై ప్రభుత్వం దృష్టి పెట్టిందనికెటిఆర్ ఆరోపించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, తుల ఉమ, చల్మెడ ల క్ష్మీ నరసింహారావు, తోట ఆగయ్య, జిందం కళ చక్రపాణి, న్యా ల కొండ అరుణ, జిందం చక్రపాణి, మనోహర్‌రెడ్డి, బిఆర్ ఎస్‌వినాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు.

## కెసిఆర్... ఫాంహౌస్ వీడి అసెంబ్లీకి రా!

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నేత వి హనుమంతరావు



**ప్రజాపక్షం/గజ్వేల్:** కెసిఆర్ ఎర్రవల్లి ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రావాలని, నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హనుమంత రావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండాల్సినకెసిఆర్ దర్శనం కష్టంగా మారిందని, ప్రభుత్వ జీతభత్యాలు పొందుతున్న ఆయన ముఖం చాటేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. రాజకీయ కోసం రాష్ట్ర ప్రయోజనాలు అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, ఎఎంసి చైర్మన్లు, మైనార్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు సమీర్, నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిచ్‌ల ఫోరం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలలో ప్రజాప్రభుత్వం సఫలం

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్ నుంచి జెండా చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని అనంతరం మాట్లాడుతూ బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడైనా ఏ ఒక్క రైతుకైనా లక్ష రూపాయల రుణ మాఫీ ఏక కాలంలో చేశారా అని ప్రశ్నించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని, రైతులు ఎవరూ అధైర్యపడవద్దని తెలిపారు. రూ. 5 లక్షల నుంచి 10లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పేదలకు గుడిసెల రహిత తెలంగాణ లక్ష్యంగా అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని భరోసా ఇచ్చారు.పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ. 88కోట్లు విడుదల చేయించామని, పనులు కొనసాగుతున్నాయని, మరో 80 కోట్లు భూసేకరణ కోసం నిధులు మంజూరు చేయించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు నంబర్ వన్ గా ఉన్నాయని కితాబునిచ్చారు. స్వ యాన కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గ కేంద్రంలో ఆర్వోబీ పనులు నత్తనడకన సాగుతున్నాయని, కానీ పెద్దపల్లిలో మాత్రం ఆర్‌డిఒబి పనులు చకచక సాగి పూర్తి దశకు చేరుకున్నాయన్నారు. రెండు, మూడు నెల ల్లో ఆర్‌డిబి ప్రజలకు అందుబాటులోకి కూడా తీసుకువస్తామని తెలిపారు. అవినీతి రహిత పాలనే కాంగ్రెస్ ప్ర భుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ సర్కారు హయంలో ఆ మ్ ఆద్మీ బీమా యోజన పథకాన్ని కొనసాగిస్తున్నామని, విడతల వారీగా మహిళలకు వడ్డీ బకాయిలను వారి బ్యా ంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజా స ంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న రేవంత్ సర్కారు పై మాజీ మంత్రి కెటిఆర్ అసత్య ప్రచారాలు, ఆరోపణ లు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కా ర్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వ్యవసా య మార్కెట్ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, డై రెక్ట ర్లు, పట్టణ కౌన్సిలర్లు,పలు గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, పట్టణ అ ధ్యక్షులు,బ్లాక్‌కాంగ్రెస్‌అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ నా య కులు,కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలుపాల్గొన్నారు.

### విద్యార్థులలో మాదకద్రవ్యాల వ్యసనం పట్ల..

# ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలి

**ప్రధాని మోదీ ఉద్బోధ**



**న్యూఢిల్లీ:** విద్యార్థులలో మాదకద్రవ్యాల వ్యసనం పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యకాలాపాల ద్వారా పిల్లలు అధిక స్క్రీన్ సమయాన్ని ఎదుర్కోవడంలో సహాయపడాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయ దినోత్సవానికి ఒక రోజు ముందైన శుక్రవారం జాతీయ అవార్డులు పొందిన ఉపాధ్యాయులతో ప్రధాని సంభాషించారు. బాల్యాన్ని పరిరక్షించడంతో పాటు పిల్లల్లోని సహజ ఉత్సుకతను పెంపొందించాలని ప్రధాని మోదీ ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. తరగతి అభ్యాసాన్ని మరింత ఆసక్తికరంగా మార్చడానికి ఉపాధ్యాయులు సృజనాత్మక పద్ధతులను పంచుకోవాలని మోదీ అన్నారు. ఉపాధ్యాయులు పిల్లల విద్యా ప్రతిభకు అతీతంగా వారి ప్రవర్తన, దైనందిన జీవితాలపై కూడా శ్రద్ధ వహించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కిచెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోతున్న నేపథ్యంలో పిల్లల జీవితాలలో ఉపాధ్యాయులు పోషించాల్సిన పాత్ర మరింత ముఖ్యం అవుతోంది అన్నారు. మాదకద్రవ్యాల గురించి ప్రధాని మోదీ మాట్లాడుతూ కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాలలో ఎవరు ఎవరికి ఏమి ఇస్తున్నారో ఎవరికీ తెలియదు కాబట్టి, ఈ సమస్య వల్ల ఎవరైనా ప్రభావితం అయ్యారో లేదో గుర్తించడం కష్టమని అన్నారు. ఈ పరిస్థితులలో ఉపాధ్యాయుడు అవగాహన కల్పించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. అలాగే, ఏ పిల్లవాడి ప్రవర్తనలోనైనా ఏమైనా మార్పు కనిపిస్తే నిశితంగా గమనించాలని ప్రధాని మోదీ సూచించారు. ప్రధానమంత్రి లోక్‌కల్యాణ్ మార్గ్ నివాసంలో జరిగిన సంభాషణకు సంబంధించిన వీడియోను శనివారం విడుదల చేశారు. ఉపాధ్యాయులు కేవలం పుస్తకాలు, సిలబస్‌లకే పరిమితం కాకుండా విద్యార్థుల జీవితాల్లోకి ప్రవేశించాలని ప్రధానమంత్రి కోరారు. విద్యార్థులను ఎక్కువ సమయం స్క్రీన్ చూడకుండా ఉపాధ్యాయులు ఎలా దూరం పెట్టవచ్చో అలాగే వారిని బహిరంగ క్రీడా కార్యకలాపాల వైపు ఎలా ప్రోత్సహించవచ్చనే విషయం గురించి కూడా ప్రధాన మంత్రి మాట్లాడారు. ఈ ఏడాది మూడు శాఖల నుంచి 82మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. వీరిలో పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖ నుంచి 48మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌ల నుంచి 21మంది ఉపాధ్యాయులు/ అధ్యాపకులు, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ నుంచి 13మంది నైపుణ్య శిక్షకులు ఉన్నారు.

### 'దేశమే ప్రథమం' స్ఫూర్తితో..

# విద్యార్థులను తీర్చిదిద్దండి: రాష్ట్రపతి



**న్యూఢిల్లీ:** శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని, 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తితో ముందుకు సాగే విద్యార్థుల తరాలను తీర్చిదిద్దాలని శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాసిన ఒక వ్యాసంలో, తమ విద్యార్థులను మంచి విద్యార్థులుగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యమని ఆమె పేర్కొన్నారు. తమ ఆలోచనలలో, చేతలలో నైతికతను పాటిస్తూనే శ్రేయస్సు, కీర్తిని సాధించే విద్యార్థులే ఉపాధ్యాయుని విజయానికి సజీవ నిదర్శనాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సామాజిక సమ్మిళితాన్ని కేంద్రంగా చేసుకుని, అభివృద్ధి చెందిన దేశంగా మారే లక్ష్యం దిశగా దేశం స్థిరంగా ముందుకు సాగుతోందని ఆమె వివరించారు. 'మనసులను తీర్చిదిద్దడం, భవిష్యత్తును తీర్చిదిద్దడం' (షేపింగ్ మైండ్స్ : బిల్డింగ్ ది ఫ్యూచర్') అనే శీర్షికతో ప్రచురితమైన వ్యాసంలో తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లలను చదువుకోవడానికి పంపినప్పుడు ఉపాధ్యాయులపైనే అత్యధిక నమ్మకం ఉంచుతారని ముర్ము చెప్పారు. తమ విద్యార్థులు తమలో తాము అత్యున్నతంగా ఎదగడానికి మంచి ఉపాధ్యాయులు సహాయపడతారని ద్రౌపదిముర్ము తెలియజేశారు. ఉపాధ్యాయుల వైఖరి, ప్రవర్తన పిల్లలో భయాందోళనలను కలిగించకూడదని, వారి మనోధైర్యాన్ని దెబ్బతీయకూడదని, లేదా, వారిలో ఎలాంటి న్యూనతాభావం పెరగడానికి అనుమతించకూడనదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హితవు పలికారు. మంచి ఉపాధ్యాయులు తమ విద్యార్థులు తమలో తాము అత్యుత్తమంగా ఎదగడానకి సహాయపడతారని ఆమె వివరించారు. విద్యార్థులలో స్వతంత్ర ఆలోచనను ప్రోత్సహించడం, వారిలో ఉత్సుకతను రేకెత్తించడం, ప్రశ్నలు అడిగే ధోరణిని పెంపొందించడం, వాదన, విచక్షణ సామర్థ్యాన్ని పదును పెట్టడం, విద్యార్థులు స్వతంత్ర వ్యక్తులుగా ఎదగడానికి స హాయపడటం ఇవి భోదనలోని అత్యంత ఉపయోగకరమైన, ప్రతిఫలదాయకమైన అంశాలలో కొన్ని అని రాష్ట్రపతి చెప్పారు. 'ఇలాంటి స్ఫూర్తిదాయకమైన విద్య ద్వారా మాత్రమే మనం విజయవంతమైన పారిశ్రామికవేత్తలు, ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, సృజనాత్మక కళాకారులు ఉద్భవిస్తున్న సవాళ్లకు వినూత్న పరిష్కారాలను కనుగొనగల పౌరుల తరాలను పెంచగలం'అని ముర్ము అన్నా రు. 'మన అంకిత భావం, చిత్తశుద్ధిగల ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవంతో చూ డండి' అని రాష్ట్రపతి ముర్ము ప్రతీపౌరుడికీ నాది ఒక విజ్ఞప్తి. అంకిత భావం కలిగిన ఉపాధ్యాయుల కృషితో భారతదేశం నిరంతరం నేర్చుకుంటూ అ గ్రగామిగా నిలవాలని నేను మన: స్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని'రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.

# సార్వత్రిక విద్యావిధానం రూపొందించాలి

- ప్రతి విద్యార్థికీ సమాన అవకాశాలు లభించేలా చూడాలి
- టీచర్లకు రాహుల్‌గాంధీ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** దేశంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య అందేలా వ్యవస్థను నిర్మించాలని లోక్‌సభలో ప్రతిపక్షనేత శనివారం టీచర్లకు విజ్ఞప్తి చేశారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ గాంధీ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. 'మీ జ్ఞానం, సేవ, అంకితభావం ద్వారా, మీరు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది, దేశంలో భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేయాలి. మీ సహకారం అమూల్యమైనది. నేడు, భారతదేశ విద్యా వ్యవస్థ మన ముందు అనేక తీవ్రమైన ప్రశ్నలను ఉంచుతోంది. ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, ఉజ్వల భవిష్యత్తు లభించే వ్యవస్థను మనమందరం కలిసి నిర్మించాలి' అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు తన హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. నేడు ఎవరి పేరు మీద ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నారో ఆ భారత రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన నివాళులర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఉపాధ్యాయులకు, భారత మాజీ రాష్ట్రపతికి నివాళులర్పించారు. 'ఉపాధ్యాయులు మేధస్సును తీర్చిదిద్దుతారు, విలువలను పెంపొందిస్తారు. మన దేశ భవిష్యత్తుకు పునాదులు వేస్తారు' అని ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. డాక్టర్ రాధాకృష్ణన్‌ను 'ఒక ప్రముఖ తత్వవేత్త, ఉపాధ్యాయుడు, రాజనీతిజ్ఞుడు, ఆయన జ్ఞానం కాలాతీతమైనది. ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటుంది' అని ఆయన కొనియాడారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ కూడా ఎక్స్‌లో పోస్టు చేస్తూ 'ప్రఖ్యాత పండితుడు, తత్వవేత్త, అద్భుతమైన రచయిత, మంత్రముగ్ధులను చేసే వక్త, సోవియట్ యూనియన్‌లో కొద్దికాలం పాటు ప్రభావవంతమైన దౌత్యవేత్త, విద్య, సంస్థల నిర్మాణం కోసం గాఢంగా అంకితమైన వ్యక్తి'గా స్మరించుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు రాధాకృష్ణన్ ఇతర కాంగ్రెస్ దిగ్గజాలు, ఒక మాజీ రాష్ట్రపతితో ఉన్న మూడు చిరస్మరణీయ ఛాయాచిత్రాలను ఎక్స్‌లో పంచుకున్నారు. 'ఒకటి జూన్ 1964లో కొత్తగా నియమితులైన ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి, కె. కామరాజ్‌లతో ఉన్నది. మరొకటి నవంబర్ 1964 నాటిది, ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకిర్ హుస్సేన్, ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రితో ఉన్నది. చివరిది 1954 నాటిది, రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూలతో ఉన్నది, వారితో ఆయన దశాబ్దాల పాటు అత్యంత ఆత్మీయ వ్యక్తిగత సంబంధాన్ని పంచుకున్నారు అని ఆయన రాశారు.

# భరద్వాజ్‌కు ఒకరోజు పోలీస్ కస్టడీ




**న్యూఢిల్లీ:** జూన్‌లో జంతర్ మంతర్ వద్ద సిజెపి ఆధ్వర్యంలో జరిగిన నిరసన సందర్భంగా ఒక యువ కార్యకర్త తండ్రిపై దాడి చేశారన్న ఆరోపణలపై హిందుత్వ ఇన్‌ఫ్లూయెన్సర్ స్వతంత్ర భరద్వాజ్‌పై ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే శుక్రవారం ఢిల్లీ పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి (అత్యాచారాల నివారణ) చట్టం, నేరపూరిత బెదిరింపుల నిబంధనలను చేర్చారు. ఆయనపై పోక్సో కేసు కూడా నమోదైంది. కాగా, స్వతంత్ర భరద్వాజ్‌ను శనివారం ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, ఆయనకు ఒక రోజు పోలీసు కస్టడీ విధించారు. కోర్టు వర్గాల సమాచారం ప్రకారం, మధ్యాహ్నం సుమారు 2 గంటలకు అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ లాలెర్ నివాసంలో భరద్వాజ్‌ను హాజరుపరిచారు. ఆయన తరపు న్యాయవాది వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. వాస్తవానికి భరద్వాజ్‌ను పాటియాలా హౌస్ కోర్టులలో ప్రత్యక్షంగా హాజరుపరచాల్సి ఉంది. ఇదిలా ఉండగా, భరద్వాజ్‌ను అరెస్టు చేయాలని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వెలుపల కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిరసన చేపట్టిన కొన్ని గంటల తర్వాత, శుక్రవారం బులంద్‌షహర్‌లో భరద్వాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. జూన్ 23న సిజెపి నిరసన సందర్భంగా మైనర్ కార్యకర్త తండ్రి సంజయ్ 'పుర్రె పగలగొట్టానని', తన రాజకీయ పలుకుబడి కారణంగా అరెస్టు నుంచి తప్పించుకున్నానని భరద్వాజ్ ఒక ఇంటర్వ్యూలో పేర్కొనడంతో, ఆ ఇంటర్వ్యూపై ప్రజాగ్రహం వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. 'నేను పుర్రె పగలగొట్టాను... ఈ నేరం ఏ సెక్షన్ పరిధిలోకి వస్తుందో మీకు తెలుసా? సెక్షన్ 307. అతనికి 60 కుట్లు పడ్డాయి' అని ఆయన ఒక వీడియో పోడ్‌కాస్ట్‌లో అన్నారు. సంజయ్ గాయాలు స్వల్పమైనవని, అవి ఒక స్టీల్ బ్రాస్‌లెట్ వల్ల కలిగాయని ఢిల్లీ పోలీసులు ఇంతకుముందు తెలిపారు. వ్యతిరేకత ఎదుర్కొన్న భరద్వాజ్, ఆ తర్వాత ఒక పోడ్‌కాస్ట్‌లో తాను ఆత్మరక్షణ కోసమే అలా చేశానని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో బెదిరింపులు, వేధింపులకు పాల్పడ్డానని మైనర్ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు, శుక్రవారం పోలీసులు అతనిపై లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో) కింద కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సమాచార సాంకేతిక చట్టంలోని సెక్షన్ 67తో పాటు, బిఎన్ఎస్ సెక్షన్లు 351(3), 78 (వెంటపడటం), 79 (మహిళల పరువుకు భంగం కలిగించడం) కింద కూడా పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. తనను తాను నాస్తికురాలిగా, మానవతావాదిగా అభివర్ణించుకునే ఆ మైనర్, తన తండ్రిపై జరిగిన దాడిని నిరసించి, పోలీసులకు ఫిర్యాదు చేసిన తర్వాత, తనపై అత్యాచార బెదిరింపులకు, మాటల వేధింపులకు, మార్ఫింగ్ చేసిన చిత్రాలకు గురయ్యానని ఆరోపించింది. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీ రామ్) అధినేత, నగిన ఎంపి చంద్రశేఖర్ ఆజాద్ కూడా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులను కలిసి భరద్వాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టాల కింద నిబంధనలను చేర్చాలని, అలాగే బాలికపై అత్యాచార బెదిరింపులు, ఆన్‌లైన్ వేధింపుల ఆరోపణలపై ప్రత్యేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కూడా ఆ ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది.

# వైద్య చికిత్సకు జారంగే నిరాకరణ

**ఎనిమిదవ రోజూ కొనసాగిన నిరాహారదీక్ష**



**జాల్నా :** ఇచ్చిన హామీలను మహారాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ, మరాఠా కోటా కోసం మనోజ్ జారంగే చేపట్టిన ఆందోళన శనివారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. జారంగే నీళ్లు తీసుకోవడానికి, వైద్య చికిత్స స్వీకరించడానికి నిరాకరిస్తూ తన ఆందోళనను మరింత తీవ్రతరం చేశారు. ఈ వారం ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం చేసిన విజ్ఞప్తి మేరకు నీళ్లు తాగడానికి, సిరల ద్వారా ద్రవాలు స్వీకరించడానికి అంగీకరించిన జారంగే, ఇప్పుడు తన అంగీకారాన్ని ఉపసంహరించుకున్నారు. తన డిమాండ్లు క్షేత్రస్థాయిలో వాస్తవంగా అమలు అయ్యేంత వరకు ఎలాంటి చికిత్సను స్వీకరించబోనని స్పష్టం చేస్తూ, ఇక్కడి అంతర్వాలి సారథిలోని నిరసన ప్రదేశంలో వైద్యులు నిర్వహించే వైద్య పరీక్షకు ఆయన నిరాకరించారు. ఆయన మనసు మార్చుకునేందుకు వైద్య బృందం ప్రయత్నిస్తున్నప్పటికీ, 'ప్రభుత్వం మా డిమాండ్లన్నింటినీ క్షేత్రస్థాయిలో అమలు చేసేంత వరకు, నేను ఏమీ తీసుకోను, ఎలాంటి చికిత్స చేయించుకోను' అని జారంగే జాల్నాలో మీడియాకు వెల్లడించారు. ఉద్యోగాలు, విద్యాసంస్థలలో మరాఠా వర్గానికి కోటా కల్పించేందుకు, సుమారు 58 లక్షల మరాఠాలకు సంబంధించిన రికార్డులపై పని ప్రారంభిస్తామని మహాయుతి ప్రభుత్వం తనకు హామీ ఇచ్చిందని, కానీ ఆ దిశగా ఏమీ మొదలు కాలేదని జరంగే ఆరోపించారు. హైదరాబాద్ గెజిట్‌కు సంబంధించిన ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదని ఆయన పేర్కొన్నారు. రిజర్వేషన్ల సమస్యకు సంబంధించిన సమాచారాన్ని గ్రామస్తులకు బహిరంగ ప్రకటనల ద్వారా తెలియజేస్తామన్న ప్రభుత్వ హామీ కూడా అమలు కాలేదని ఆయన విలేకరులతో అన్నారు. ఆయన డిమాండ్లపై ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తెలియజేస్తామని ప్రభుత్వ ప్రతినిధి బృందం ఇంతకుముందు చెప్పింది. అయితే, తమ డిమాండ్లు నెరవేరే వరకు తన ఆందోళనను విరమించుకోబోనని జారంగే స్పష్టం చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే సెప్టెంబర్ 12న ముంబయికి వెళ్తానన్న తన సంకల్పాన్ని ఆయన పునరుద్ఘాటించారు. అర్హులైన మరాఠాలకు కుణ్బీ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి సెప్టెంబర్ 12లోగా ప్రభుత్వ తీర్మానం (జిఆర్) చేయాలని జారంగే డిమాండ్ చేశారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా మరాఠా వర్గ సభ్యులు ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) కింద కోటా పొందేందుకు వీలుంటుంది. గురువారం నాడు, మంత్రులు రాధాకృష్ణ విఖే పాటిల్, ఉదయ్ సమంత్, ఎమ్మెల్సీ ప్రసాద్ లాడ్ ఎమ్మెల్యే మకరంద్ పాటిల్‌లతో కూడిన ప్రభుత్వ ప్రతినిధి బృందం జారంగేను కలిసి, ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న దృష్ట్యా నిరాహార దీక్షను విరమించుకోవాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం సుమారు 58 లక్షల కుణ్బీ రికార్డులను గుర్తించిందని, కుణ్బీ సర్టిఫికెట్ల జారీని వేగవంతం చేస్తుందని విఖే పాటిల్ తెలిపారు.

# రాజకీయశక్తిగా ఎదిగిన 'జెన్ జీ'

**ప్రతిపక్షం, ప్రభుత్వం విస్మరించలేవు : దీపాంకర్ భట్టాచార్య**



**న్యూఢిల్లీ :** జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన, 'జెన్ జీ' తరం ప్రభుత్వం ఇకపై విస్మరించలేని ఒక రాజకీయ శక్తిగా ఎదిగిందని స్పష్టం చేస్తోందని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, యువతలో వచ్చిన ఈ చైతన్యం నుండి ప్రతిపక్షాలు బలాన్ని పుంజుకుని, విస్తృతమైన ఎన్నికల కూటమిని ఏర్పాటు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఓటు హక్కు వయస్సును 18 నుండి 16 ఏళ్లకు తగ్గించాలని కూడా భట్టాచార్య పేర్కొన్నారు. 1988లో వయస్సును 21 నుండి 18 ఏళ్లకు తగ్గించినప్పుడు చెప్పిన కారణం— అంటే యువతకు రాజకీయ అవగాహన ఉందని, వారు ఎన్నికల ప్రక్రియలో అర్థవంతంగా పాల్గొనగలరని భావించడం. ఇప్పుడు ఆ వాదన 16–17 ఏళ్ల వయస్సు గల వారికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. శనివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుడు, యువత, విస్తృత ఓటర్ల ఆందోళనలపై 'ఇండియా' కూటమి పార్టీలు సమష్టిగా స్పందించాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ విషయంపై ప్రతిపక్ష కూటమి సమావేశం కావాలని ఆయన పిలుపునిచ్చారు. 'జంతర్ మంతర్ నిరసనను గమనిస్తే, యువత తీవ్ర అసహనంతో ఉన్నారని అర్థమవుతుంది. కేంద్రం దానిని అణచివేయడానికి ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. చివరికి వారు ఒక పరిష్కారానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది' అని భట్టాచార్య అన్నారు. దేశ రాజధానిలో జూన్, జుల్ నెలల్లో జరిగిన నిరసనలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ నిరసనల పర్యవసానంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. 'ప్రభుత్వం విస్మరించలేని రాజకీయ శక్తిగా జెన్‌జీ మారిందని ఇది నిరూపిస్తోంది. ప్రతిపక్షాలు దీని నుండి బలాన్ని పొందాలి' అని ఆయన అన్నారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలు, యువతకు సంబంధించిన ఇతర విస్తృత సమస్యలపై జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో, నిరంతరాయంగా పాల్గొన్నారు. విధానపరమైన మార్పులు, జవాబుదారీతనం విషయంలో యువత ఆందోళనల గురించి ఈ నిరసన ఒక బలమైన సందేశాన్ని పంపిందని భట్టాచార్య అన్నారు. ఈ భావన ఇప్పుడు కేవలం పరీక్షలకు సంబంధించిన సమస్యలకే పరిమితం కాకుండా విస్తరించిందని ఆయన వాదించారు. 'భారతదేశంలోని యువత ప్రభుత్వం పట్ల తీవ్ర అసహనంతో ఉన్నారని, అలాగే ప్రభుత్వ సేవలు, విధానపరమైన మార్పులు, ప్రభుత్వ జవాబుదారీతనం పట్ల ఆసక్తిగా ఉన్నారని జంతర్ మంతర్ నిరసన ఒక బలమైన సందేశాన్ని ఇచ్చింది' అని ఆయన అన్నారు. వివిధ రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, నియామకాల్లో కుంభకోణాలపై జరిగిన నిరసనలు, అలాగే విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆందోళనలను ప్రస్తావిస్తూ, ఈ ఆందోళనలు సమాజంలోని వివిధ వర్గాలకు విస్తరిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. యువతలో వచ్చిన ఈ చైతన్యాన్ని రాజకీయ మార్పు, జవాబుదారీతనం కోసం ఒక విస్తృతమైన డిమాండ్‌గా మలచడమే తదుపరి సవాలు అని సిపిఐ (ఎంఎల్)లిబరేషన్ ప్రధాన కార్యదర్శి అన్నారు. దీని కోసం, యువ ఓటర్లపై ప్రభావం చూపే అంశాలపై ప్రతిపక్ష పార్టీలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**'సర్'పై ఇండియా కూటమి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలి**

ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)తో సహ వివిధ అంశాలపై 'ఇండియా' కూటమి సమావేశమై ఉమ్మడి కార్యాచరణను రూపొందించుకోవాలని భట్టాచార్య అన్నారు. తమకు ఒక సమావేశం అవసరమని, సమావేశమైనప్పుడు, పరిష్కరించాల్సిన అంశాలు ఇవేనన్న అభిప్రాయాన్ని ఆయన వెలిబుచ్చారు. యువతలో పెరుగుతున్న రాజకీయ చైతన్యాన్ని ఎన్నికల వ్యవస్థ కూడా గుర్తించి, ఓటు హక్కు పరిధిని విస్తరించాలని ఆయన అన్నారు. అనేక రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల గురించి భట్టాచార్య మాట్లాడుతూ తన పార్టీ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్‌లలో పోటీ చేస్తుందని చెప్పారు. వీలైతే ఇండియా కూటమిలో భాగంగా పోటీ చేయడానికి ప్రాధాన్యత ఇస్తామని, అయితే విస్తృత కూటమి కుదరకపోతే స్వతంత్రంగా లేదా వామపక్ష కూటమిలో భాగంగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# పాట్నాలో ఉప్పొంగుతున్న 'గంగ'

- 11 జిల్లాల్లో 10.26 లక్షల మందిపై వరద ప్రభావం
- పాట్నాలోని గాంధీ ఘాట్ వద్ద 10 సెం.మీ పెరిగిన గంగానది నీటిమట్టం



**పాట్నా :** బిహార్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరదలు పోటెత్తుతున్నాయి. భారీ వర్షాల కారణంగా బిహార్‌లోని 11 జిల్లాల్లో సుమారు 10.26 లక్షల మంది వరదల బారిన పడ్డారు. పాట్నాలోని గాంధీ ఘాట్ వద్ద గంగా నది నీటి మట్టం 10 సెం.మీ పెరిగింది. శనివారం ఉదయానికి 'గరిష్ట వరద స్థాయి' (హెచ్ఎఫ్ఎల్)ని అధిగమించింది. వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, సహాయక, రక్షణ చర్యలను నిశితంగా పర్యవేక్షించాలని ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి మంత్రులు, అధికారులను ఆదేశించారు. గంగా నదిలో నీటి మట్టాలు పెరుగుతున్న నేపథ్యంలో, సీనియర్ అధికారులు ప్రభావిత ప్రాంతాల్లోనే ఉంటూ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఉదయం 10 గంటల సమయానికి గంగా నది 'గరిష్ట వరద స్థాయి' కంటే 1 సెం.మీ ఎత్తులో ప్రవహిస్తోందని, దీనివల్ల రాష్ట్ర రాజధానిలోని లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే ప్రమాదం ఉందని నీటి వనరుల శాఖ బులెటిన్ పేర్కొంది. నది నీటి మట్టం పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని బిజెపి జాతీయ నాయకుడు నితిన్ నబిన్ తెలిపారు. బిహార్‌లోని అనేక నదులు వివిధ ప్రాంతాల్లో ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయని బులెటిన్ తెలిపింది. వీటిలో దుమ్రియాఘాట్, హాజీపూర్ వద్ద గండక్, బల్తారా వద్ద కోసి, ఖగారియా వద్ద బుర్హి గండక్, దిఘా, హతిదాహ్, భాగల్‌పూర్, కహల్‌గావ్, బక్సర్, ముంగేర్ వద్ద గంగ, శ్రీపాల్‌పూర్ వద్ద పున్‌పున్, దరౌలి వద్ద ఘఘరా నదులు ఉన్నాయి. 'అనేక నదులలో నీటి మట్టాలు పెరగడం వల్ల, 11 జిల్లాల్లోని 201 గ్రామ పంచాయతీలు, 50 బ్లాకుల పరిధిలో సుమారు 10.26 లక్షల మంది వరదల బారిన పడ్డారు' అని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ బులెటిన్‌లో పేర్కొంది. ప్రభావిత జిల్లాల్లో పాట్నా, భోజ్‌పూర్, సరన్, వైశాలి, భాగల్‌పూర్, బేగుసరాయ్, బక్సర్, సమస్తిపూర్, ముంగేర్, కతిహార్ మరియు అరారియా ఉన్నాయి. పాట్నాలోని గాంధీ ఘాట్ వద్ద గంగా నది నీటి మట్టం 'నాలుగు గంటల్లో 10 సెం.మీ పెరిగి 50.53 మీటర్లకు చేరుకుందని, ఇది శనివారం ఉదయం 10 గంటలకు 'గరిష్ట వరద స్థాయి' కంటే 1 సెం.మీ ఎక్కువ' అని నీటి వనరుల శాఖ తెలిపింది. గతంలో అత్యధిక నీటి మట్టం 50.52 మీటర్లుగా ఆగస్టు 21, 2016న నమోదైంది. ఆదివారం ఉదయం 8 గంటలకల్లా గాంధీ ఘాట్ వద్ద గంగా నది నీటి మట్టం మరింత పెరిగి 50.62 మీటర్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించడమైనదని నీటి వనరుల శాఖ బులెటిన్ పేర్కొంది. రాష్ట్రంలో, పొరుగున ఉన్న నేపాల్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా వివిధ నగరాల్లో నదీ జలాల మట్టం పెరుగుతోంది. బిహార్‌లో సెప్టెంబర్ నెలలో ఇప్పటివరకు 60.8 మి.మీ వర్షపాతం నమోదైంది, ఇది సాధారణం కంటే 69 శాతం ఎక్కువ. వరద ప్రభావిత జిల్లాల్లో 27 ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, ఏడు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. పాట్నా మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా యంత్రాంగం, నీటి వనరుల శాఖలు అత్యంత అప్రమత్తంగా ఉంటూ అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# మోకాళ్ల లోతు నీటిలో ఢిల్లీ వీధులు

**గత రెండు రోజులు దేశ రాజధానిలో భారీ వర్షాలు**



**న్యూఢిల్లీ:** గత రెండు రోజులుగా దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. శనివారం మరోసారి భారీ వర్షం కురిసింది. దీంతో ఢిల్లీలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. మోకాళ్ల లోతు నీటిలో రోడ్లు కనిపించకుండా పోగా, వాహనాల రాకపోకలు నత్తనడకన సాగాయి. ఉదయం 8:30 నుండి 11:30 గంటల మధ్య సఫ్దర్‌జంగ్‌లో 22 మి.మీ వర్షపాతం నమోదవ్వగా, ఇదే సమయంలో పాలమ్‌లో 25.2 మి.మీ, లోధి రోడ్డులో 24.4 మి.మీ, రిడ్జ్ ప్రాంతంలో 6.8 మి.మీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షం కారణంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, ధౌలా కువాన్ మధ్య ఉన్న నేషనల్ హైవే 48 జలమయమైంది. పాలమ్ విమానాశ్రయ సొరంగ మార్గం, సంగం విహార్‌లోని నీమ్ చౌక్ రోడ్డు పరిసరాల్లో కూడా భారీగా నీరు నిలిచిపోయినట్లు సమాచారం. షకార్‌పూర్, లక్ష్మీ నగర్, మెహ్రౌలీబదర్‌పూర్ రోడ్లలో నీరు నిలిచిపోగా, సంగం విహార్‌లోని అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా మహిపాల్‌పూర్‌లో తీవ్రమైన నీటి నిల్వ సమస్య కనిపించింది. వాహనాలు నీటిలో కదలడానికి ఇబ్బంది పడగా, పిల్లలు నీటిలో ఆడుతూ కనిపించారు. ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం యొక్క టెర్మినల్ 3 వద్ద కూడా భారీగా నీరు నిలిచిపోయింది. నీటి నిల్వ, బ్రిక్స్ సదస్సు ఏర్పాట్ల కారణంగా వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ మందగించిందని ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు 'ఎక్స్' వేదికగా ప్రజలను అప్రమత్తం చేశారు. మధుర రోడ్డులో అపోలో హాస్పిటల్, ఆశ్రమ్ చౌక్ మధ్య ఒక చెట్టు కూలిపోయినట్లు సమాచారం. 8.5 మి.మీ, నరైనాలో 20.5 మి.మీ, ఝరోడా కలాన్‌లో 4.5 మి.మీ మరియు ప్రీతమ్‌పురలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

### జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

# లష్కరే కమాండర్ యాసిర్ హతం!

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతున్నది. శనివారం మధ్య కశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. యూస్‌మార్గ్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. కాగా 2025 పహల్గామ్ ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చాయి.

# నేపాల్‌లో మళ్ళీ విరిగిపడ్డ కొండచరియలు

- చౌలానీ నదికి ముంపు ప్రమాదం
- ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు
- పది రోజుల తర్వాత సజీవంగా బయటపడిన వృద్ధురాలు
- 11 రోజుల్లో 1,344 మృతదేహాలు స్వాధీనం
- సొరంగాల్లో సజీవులను వెలికితీసేందుకు ముమ్మర చర్యలు
- ఇంకా జాడ తెలియని 5,083 మంది
- చైనాలో కొండరాళ్ళు పడి పదిమంది మృతి



**కాఠ్మండు:** హిమనీనద ఉత్పాతంవల్ల పది రోజులుగా అతలాకుతలమైన నేపాల్‌లో మరోసారి కొండ చరియలు విరిగిపడ్డాయి. దార్చులా జిల్లా భట్టారీ ప్రాంతంలో భారీస్థాయిలో కొండచరియలు విరిగిపడి చౌలానీ నదీ ప్రవాహాన్ని అడ్డుకున్నాయి. పెద్ద పెద్ద రాళ్ళు,మట్టి నదీ ప్రవాహంలో పై నుండి పడ్డాయి. దీంతో పరవళ్ళు తొక్కే నదికి ఆటంకం ఏర్పడింది. ఈ రాళ్ళు,మట్టి అడ్డు తొలగిపోతే అప్పటివరకూ ఆగిపోయిన నీరు ఒక్కసారిగి కిందకు ప్రవహిస్తే చౌలానీ నదీ పరివాహక ప్రాంతంలోని దిగువన ఉన్న తీర నివాసాలన్నీ ప్రమాదంలో పడతాయి. ఈ పరిస్థితులను ముందుగానే గమనించి నేపాల్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దించింది ప్రజలను అప్రమత్తం చేసింది. ఎప్పటికప్పుడు సమాచారం తెలిజేయాలని ఆదేశించింది. దార్చులా జిల్లాలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ చౌలానీ నది మహాకాళి నదిలో సంగమిస్తుంది.చౌలానీ నదిపై అడ్డంగా కొండచరియలు విరిగిపడ్డాయి.

ఇదిలా ఉండగా భోటేకోశీ వరదలు సంభవించిన 11 రోజుల తర్వాత 60 ఏళ్ళ వృద్ధురాలిని శనివారంనాడు సహాయ బృందాలు సురక్షితంగా వెలికి తీసుకువచ్చాయి. కుప్పకూలిన నాలుగు అంతస్తుల భవనం శిథిలాలలో చండికా శ్రేష్ఠ అనే వృద్ధురాలు పది రోజులుగా ఉండిపోయింది. బిదురు మున్సిపాలిటీ–10లో సహాయ చర్యలు చేస్తుండగా బృందాలు ఆమెను కనుగొన్నాయి. తర్వాత ఆమెను హెలికాప్టర్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. సొంగాలలో జలవిద్యుత్ ప్రాజెక్టు పనులు చేస్తున్న వందల కార్మికులు చిక్కుకుపోయిన ప్రదేశాలలో కొత్త ఆశలు చిగురించాయి. మంచు ఖండం విరిగిపడి ప్రమాదం జరిగిన పది రోజుల తర్వాత శుక్రవారంనాడు జరిగిన అద్భుత పరిణామంలో ఇద్దరు కార్మికులు సొరంగం నుండి ప్రాణాలతో బయటకు వచ్చిన తర్వాత ఇంకా 150 మీటర్ల దూరంలో అనేకమంది ప్రాణాలతో సజీవంగా ఉంటారన్న ఆశలు చిగురించాయి. దీంతో సహాయ చర్యలను సిబ్బంది ముమ్మరం చేశారు. ఆగస్టు 26వ తేదీన వరదలు సంభవించిన తర్వాత ఈనాటి వరకూ సహాయ బృందాలు 13,100 మందిని రక్షించాయి. ఒక్క రసువాలోనే 8,600 మందిని కాపాడారు. ఐతే ఈనాటికీ 5000 మంది పైగా ప్రజలు, ఇప్పటివరకూ 1344 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసేందుకు వారి బంధువుల నుండి డిఎన్ఎ శాంపిల్స్‌ను తీసుకుంటున్నారు. ఇదిలా ఉండగా చైనాలో కొండచరియలు విరిగిపడి పదిమంది శిథిలాల క్రింద సమాధి అయ్యారు. గ్జియాంగ్ జీలో ఈ ఘటన జరిగింది.

# ఉక్రేన్–రష్యా మూడురోజులు కాల్పుల విరమణ

పుతిన్,జెలెన్స్కీలతో ట్రంప్ దూతల చర్చలు ప్రారంభం



**మాస్కో:** ఉక్రేన్‌లో యుద్ధ సమస్య పరిష్కారానికి చర్చల ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి.ఇందులో భాగంగా ఉక్రేన్–రష్యా మూడు రోజులు కాల్పుల విరమణ పాటించాలని నిర్ణయించాయి. ఉక్రేన్–రష్యాలతో అమెరికా సంప్రదింపుల చర్చలు వేగవంతం చేస్తున్నట్లు డోనాల్డ్ ట్రంప్ ప్రకటనతోపాటు ఆయన తరపు రాయబారులు ఇద్దరు మాస్కో చేరుకోవడం,ఉక్రేన్ కూడా మూడు రోజులు కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు తొలుత ప్రకటించడం వంటి కీలక పరిణామాల మధ్య రష్యా అధ్యక్షుడు,సర్వసైన్యాధ్యక్షుడైన వ్లాదిమీర్ పుతిన్ ఈ తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

శనివారం అర్థరాత్రి 12 గంటలు సమయం దాటగానే మూడు రోజులపాటు కాల్పుల విరమణ అమలులోకి వస్తుంది. పుతిన్ ప్రకటన వెలువడటానికి ముందుగానే ఉక్రేన్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, సెప్టెంబరు ఐదో తేదీ నుండి ఎనిమిదో తేదీ వరకూ కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు పేర్కొంది.ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్,మధ్యవర్తి వ్యవహారాల్లో ఆరితేరిన స్టీవ్ విట్‌కాఫ్ ఇద్దరూ శనివారంనాడు మాస్కో చేరుకున్నారు.

''కాల్పుల విరమణ పాటిస్తున్నట్లు ముందుగా ఉక్రేన్ నుండే సమాచారం వచ్చింది,శనివారం అర్థరాత్రి నుండీ కాల్పుల విరమణ పాటించాలని ఆదేశించారు,కీవ్‌లో జరగబోయే సంప్రదింపులకు సంబంధించిన నిర్ణయమిది'' అని పుతిన్ ప్రతినిధి ద్మీత్రీ పెస్కోవ్ చెప్పారు. ఉక్రేన్ కాల్పుల విరమణ పాటించిందన్న విషయం రష్యాకు తెలుసా?రష్యా కూడా కాల్పుల విరమణ పాటిస్తుందా? అని టాస్ వార్తాసంస్థ ప్రశ్నించినప్పుడు పెస్కోవ్ ఈ విషయం చెప్పారు.

అంతకుముందు వ్నుకోవో విమానాశ్రయంలో కుష్నెర్,విట్‌కాఫ్‌లకు రష్యా దౌత్యవేత్త కిరిల్ దిమిత్రియేవ్ స్వాగతం పలికారు.రష్యాతో చర్చలు ముగిసిన తర్వాత ఆదివారంనాడు వీరిద్దరూ ఉక్రేన్‌కు బయలుదేరి వెళతారు.యుద్ధం ముగించేందుకు ఒక ప్రతిపాదన తెస్తున్నట్లు ట్రంప్ ఒకరోజుముందే చెప్పారు. ''యుద్ధం ముగించేందుకు మా దగ్గర ఒక ఐడియా ఉంది'' అని ట్రంప్ చెప్పారు.ట్రంప్ పంపించిన రాయబారులు ఇద్దరు ఇటు పుతిన్‌తో,అటు జెలెన్స్కీతో విడివిడిగా చర్చలు జరుపుతారని ఆక్సియోస్ వార్తాసంస్థ ప్రకటించింది. తొలుత పుతిన్ మాట్లాడుతూ, అమెరికా ప్రతినిధులకు రష్యా ఎల్లప్పుడూ ఆహ్వానం పలుకుతుందని వారితో కలిసి పనిచేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందని అన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక ఈ ఇద్దరు రాయబారులూ పలుసార్లు మాస్కోలో పర్యటించారు. ఇటీవలికాలంలో ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధం భీకరరూపం దాల్చింది. బ్రిటన్,యూరోపియన్ యూనియన్ సహాయం చేయడంవల్ల యుద్ధంలో రష్యాకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.ఉక్రేన్‌కు చాలా సుదూరంగా ఉన్న రష్యన్ ప్రాంతాలలో తీవ్ర నష్టం కలుగుతోంది. రష్యన్ పౌరులో ఆందోళన పెరిగింది. అదేవిధంగా కీవ్‌పై కూడా వందల డ్రోన్లు,క్షిపణులతో రష్యా విరుచుకుపడుతూ ఉండటంతో అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ దశలో చాలా కాలం విరామం తర్వాత రెండు దేశాల మధ్యా అమెరికా రాయబారం ప్రారంభమైంది.

## ఐరాస జనరల్ అసెంబ్లీలో 26న జైశంకర్ ప్రసంగం

**న్యూయార్క్:** ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సెప్టెంబరు 26వ తేదీన నిర్వహించే 81వ సమావేశంలో భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ప్రసంగించనున్నారు. ఈనెల ఎనిమిదో తేదీ నుండీ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతాయి. 193 సభ్యదేశాలున్న జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి ప్రపంచ నాయకులు ఈనెల 22వ తేదీ నుండి 28వ తేదీ వరకు వరుస ప్రసంగాలు చేయనున్నారు. ఈ క్రమంలో భారత విదేశాంగమంత్రి జైశంకర్‌కు 26వ తేదీన ప్రసంగించడానికి సమయం కేటాయించారు. గత ఏడాది జరిగిన సమావేశంలో కూడా ఆయన ప్రపంచ నాయకుల సమక్షంలో ప్రసంగించారు. సంప్రదాయబద్ధంగా చూసినప్పుడు ప్రపంచ నాయకుల ప్రసంగాలు జనరల్ అసెంబ్లీలో బ్రెజిల్‌తో ప్రారంభమవుతాయి. ఏడాదిపాటు జరిగే ఈ 81వ సమావేశాలకు బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాలమంత్రి ఖలీలుర్ రెహ్మాన్ అధ్యక్షత వహిస్తారు. ఆయన ఈ ఏడాది జూన్ నెలలో ఎన్నికయ్యారు. అదే విధంగా సెప్టెంబరు 22వ తేదీన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ప్రాంతీయ యుద్ధాలు,ప్రకృతి వైపరీత్యాలు,ఆర్థిక సంక్షోభాలు తలెత్తిన తరుణంలో ఈ 81వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి.అభివృద్ధి హక్కు తీర్మానంఃవాతావరణ చర్యలు ప్రకటించి 40 సంవత్సరాలు పూర్తన సందర్భం కూడా ఈ సమావేశాలలో కలిసివచ్చింది. ఈపుల 24వ తేదీన బంగ్లాదేశ్,నేపాల్ ప్రతినిధులు ప్రసంగిస్తారు. ఆ మరునాడే పాకిస్థాన్ దేశ ప్రతినిధి ప్రసంగం చేస్తారు. ప్రస్తుత ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంలోనీ గుటెర్రెస్ పదవీకాలం ఈ ఏడాది ఆఖరుతో పూర్తవుతుంది. ఈసారి ఒక మహిళ ప్రధాన కార్యదర్శి పదవికి తెరమీదకు వచ్చారు. మొదటిసారి ఐక్యరాజ్యసమితి చరిత్రలో ఒక మహిళా అభ్యర్థి పోటీలో ఉన్నారు.

## అలీ తాహెర్ కోసం ఐడిఎఫ్- హెజ్బొల్లా పోరాటం

**బీరూట్:** గడచిన రెండు నెలలుగా ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత లెబనాన్‌లో చాలా ప్రాంతాలలో సంఘర్షణ ఆగిపోయినప్పటికీ అలీ తాహెర్ పర్వతంపై పట్టు కోసం పోరాటం నేటికీ కొనసాగుతోంది.ఇరాన్ మద్దతుగల హెజ్బొల్లా ఉగ్రవాదులు అలీ తాహెర్ పర్వతాన్ని తమ అధీనంలో ఉంచుకోవాలని ప్రయత్నం చేస్తుండగా, దీనిని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని ఐడిఎఫ్ ప్రయత్నం చేస్తోంది. ఈ పర్వతాన్ని లెబనాన్ సైన్యాలకు అప్పగించాలని అమెరికా కోరుతుండగా అందుకు హెజ్బొల్లా తిరస్కరిస్తోంది.ఈ ఏడాది మార్చిలో ఇరాన్‌కు మద్దతుగా హెజ్బొల్లా దళాలు ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేయడంతో లెబనాన్ భూభాగాన్ని ఐడిఎఫ్ దళాలు ఆక్రమించుకోవడం ప్రారంభించాయి. ఇప్పటివరకూ జరిగిన యుద్ధంలో 5000 మంది లెబనీయులు మరణించారు. హెజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నట్లు ఐ.డి.ఎఫ్ చెబుతున్నది. అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా అలీ తాహెర్ పర్వతంపై పట్టుకోసం ఇజ్రాయెల్ సైన్యాలు,హెజ్బొల్లా మధ్య రోజువారీ దాడులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాన్ని వదులుకోవడానికి హెజ్బొల్లా ఉగ్రవాదులు ఇష్టపడటం లేదు.వారు ఈ పర్వతంపై గుహలు నిర్మించారు. మౌలిక సదుపాయాలను ఇరాన్ నిధులతో అభివృద్ధి చేశారని, వాటిని ధ్వంసం చేస్తున్నామని ఇజ్రాయెలీ సైన్యాలు చెబుతున్నాయి. నబతియే నగరానకి సమీపంలో ఈ పర్వతం ఉంది. 2000 సంత్సరంలో లెబనాన్ నుండి ఇజ్రాయెల్ సైన్యం వైదొలగేముందు 18 సంవత్సరాల పాటు అలీ తాహెర్‌ను తన అధీనంలోనే ఉంచుకుంది.

## రెండు రాష్ట్రాల ఎన్నికల్లో దూసుకుపోతున్న జర్మనీ మితవాద ఎఎఫ్‌డి



**బెర్లిన్:** జర్మనీలోని సాక్సన్,అన్హాల్ట్ రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికల్లో పచ్చి మితవాద ఎ.ఎఫ్.డి (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ)పార్టీ గెలుపు దిశగా ఆధిక్యంలో ముందుకు వెళుతోంది.ఈ పార్టీ సంపూర్ణ మెజారిటీ గనుక సాధిస్తే రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఈ ప్రాంతంలో విజయం సాధించిన పచ్చిమితవాదపార్టీగా రికార్డుల్లో నమోదవుతుంది.ఎ.ఎఫ్.డి తరపున ఉల్రిచ్ సీగ్మండ్ ఈ రెండు రాష్ట్రాలకు ప్రధాన నాయకుడుగా ఉన్నారు. తాము అధికారంలోకి వస్తే రీ–మైగ్రేషన్ (వలస ప్రజలను తిరిగి వారి దేశాలకు పంపడం) చర్యలు చేపడతామన్న ప్రధాన నినాదాన్ని ప్రచారంలోకి తెచ్చారు.

ఇన్‌ఫ్రాటెస్ట్ డిమాప్ సమాచారం ప్రకారం,పచ్చిమితవాద ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీపార్టీకి 42 శాతం ఓట్లు వస్తాయని అంచనావేస్తున్నారు.రెండు సంవత్సరాల క్రితం ఎ.ఎఫ్.డి.పార్టీకి ఉన్న ప్రజా మద్దతుతో పోల్చిచూస్తే ఈ భారీ ప్రజాదరణ చాలా చాలా ఎక్కువ. బహిశా దేశంలో జరిగే ఎన్నికలలో కూడా ఎ.ఎఫ్.డి.ని అధికారంలోకి తీసుకురావడానికి ఈ ప్రజాదరణ సరిపోతుందని అంచనావేస్తున్నారు. కానీ ఎ.ఎఫ్.డి.పార్టీ జర్మనీలో ముస్లింలకు,వలస ప్రజలకు తీవ్ర వ్యతిరేకం. దీనివల్ల ఈ పార్టీ ప్రగతిశీలవాదులు,అభ్యుదయవాదులు,కమ్యూనిస్టులు వంటి ప్రధాన స్రవంతి పార్టీల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నది. దేశంలో ఎ.ఎఫ్.డితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకూడదని జర్మనీలో ఉన్న మిగతా అభ్యుదయ,ప్రధాన స్రవంతి పార్టీలన్నీ ఒక నియమం పాటిస్తున్నాయి. దీనిని వారు ''ఫైర్‌వాల్''గా అభివర్ణించారు. పచ్చిమితవాదులను అధికారంలోకి రానీయకుండా ప్రగతిశీలపార్టీలు ఈ ఫైర్‌వాల్ విధానం పాటిస్తున్నాయి. ఎ.ఎఫ్.డి.తో కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా ఉండటంతోపాటు పార్లమెంటులో కూడా ఏ విషయంలోనూ ఆ పార్టీతో కలిసి పనిచేయకుండా దూరంగా ఉండే ఫైర్‌వాల్ విధానం అనుసరిస్తున్నాయి. ఐతే స్వదేశంలో ఈ విధమైన తీవ్ర వ్యతిరేకత కారణంగా ఎ.ఎఫ్.డి.పార్టీ అమెరికాలోని ''మాగా'' ఉద్యమంతో సంబంధాలు పెట్టుకుంది. మాగా ఉద్యమం కూడా అమెరికాలో పచ్చిమితవాదాన్ని ప్రోత్సహిస్తున్నది. దీనికి డోనాల్డ్ ట్రంప్ ప్రధాన పోషకుడుగా ఉన్నారు. అందుకే ''మాగా ఉద్యమం'' తరహాలో జర్మనీలో కూడా ఎ.ఎఫ్.డి.పార్టీ మేక్ జర్మనీ గ్రేట్ ఎగైన్'' అనే నినాదంతో దేశాన్ని హోరెత్తిస్తోంది. ఎంజిజిఎ అనే అక్షరాలు రాసి ఉన్న టోపీలు తలపై ధరించడం ఇప్పుడు జర్మనీలో ఒక ఫ్యాషన్‌గా ఎ.ఎఫ్.డి ప్రోత్సహిస్తోంది. అమెరికాలోని మాగా ఉద్యమం, జర్మనీలోని ఎంజిజిఎ ఉద్యమకారులు,నాయకులమధ్య సంబంధ బాంధవ్యాలు,అభిప్రాయాలు,సహకారం ఇచ్చిపుచ్చుకోవడం కూడా విస్తారంగా పెరిగింది. ముఖ్యంగా ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అనుసంధానం బాగా బలపడింది.







## రాజకీయాలా?

(మొదటి పేజీ తరువాయి)

చేయడం సరికాదన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా,ధాన్యం కొనుగోళ్లు, రూ.500కే గ్యాస్ సిలిండర్,ఆరోగ్యశ్రీ,ఉచిత విద్యుత్ వంటి పథకాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. గత 30 నెలల్లో రైతుల కోసం రూ.1.70 లక్షల కోట్లను ఖర్చు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు.తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేసి,ఇందుకోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. రుణమాఫీపై సిద్దిపేట, సిరిసిల్లలోనైనా, అసెంబ్లీలోనైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేశారు.మీ హయాంలో ఎంత రుణమాఫీ చేశారు..మేం ఎంత చేశామో చర్చిద్దాం. దమ్ముంటే మామ, అల్లుడు.. తండ్రి, కొడుకు అసెంబ్లీకి రావాలి అని రేవంత్‌రెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేతలు ఆటోడ్రైవర్లను ఉసిగొల్పినా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని రద్దు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకుంటోందన్నారు.

**కాంగ్రెస్‌ది సామాజిక న్యాయం**

కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కుటుంబ సభ్యులకు మంత్రి పదవులు,కీలక పదవులు దక్కాయని సీఎం విమర్శించారు.తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదలు,బడుగులు,వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించామని అన్నారు. శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్,సిపిఐ నాయకులు నెల్లికంటి సత్యం తదితరులకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చామని తెలిపారు.బిఆర్ఎస్ పాలనలో తెలంగాణను బందిపోట్ల ముఠాల మాదిరిగా దోచుకున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఓఆర్ఆర్‌ను అమ్ముకుని వేల కోట్ల రూపాయలు సమకూర్చుకుని, చివరకు అధికార కుర్చీ నుంచి దిగిపోయారని విమర్శించారు.ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని రైతు బంధు కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణను తన కుటుంబ ప్రయోజనాలకు పరిమితం చేశారని విమర్శించిన రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ సామాజిక న్యాయం దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. తెలంగాణలో మళ్లీ దోపిడీ పాలనకు అవకాశం ఇవ్వకుండా ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభలో నీటిపారుదల శాఖ శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి,రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఎం ఎల్ ఏలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, ఎంఎల్ సిలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, మునుగోడుఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి, తుంగతుర్తి ఎంఎల్ ఏ మందుల సామేలు, భువనగిరి ఎంఎల్ఏ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎం ఎల్ఏ కుందూరు జయవీర్ రెడ్డి, మిర్యాలగూడ శాసన సభ్యులు బత్తుల లక్మారెడ్డి, దేవరకొండ శాసన సభ్యులు బాలు నాయక్, జిల్లా కలెక్టర్ బి.చంద్ర శేఖర్, ఎస్‌పి శరత్ చంద్ర పవర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ఢీకొట్టిన కారు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారని పోలీసులు చెప్పారు. మరణించిన వారు దిండిగల్‌లోని ఒక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు. వారు ఎన్‌హెచ్ 66 మీదుగా కొడుంగల్లూర్ వైపు వెళ్తున్నారు. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేపట్టిన సహాయక చర్యల ద్వారా నుజ్జు నుజ్జు అయిన కారులోంచి విద్యార్థుల మృతదేహాలను బయటకు తీశారు. వారి మృతదేహాలను త్రిస్సూర్ మెడికల్ కాలేజీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కైపమంగళం పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడని పోలీసులు తెలిపారు. బాధితుల వద్ద లభించిన విద్యార్థి గుర్తింపు కార్డుల ఆధారంగా పోలీసులు వారి కుటుంబాలను సంప్రదించారు. తమ పిల్లలు కేరళకు వెళ్లిన విషయం కొన్ని కుటుంబాలకు తెలియదని పోలీసులు పేర్కొన్నారు. కాగా, మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు ఆసుపత్రి అధికారులు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ ప్రమాదం లారీ డ్రైవర్ తప్పిదం వల్లే జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిందని త్రిస్సూర్ రూరల్ జిల్లా పోలీస్ చీఫ్ మహమ్మద్ నదీముద్దీన్ తెలిపారు. 'ఇది కచ్చితంగా లారీ డ్రైవర్ తప్పిదమే. ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. అంతేకాకుండా, హైవే అధికారులు, కాంట్రాక్టర్ల పాత్రపై కూడా విచారణలో భాగంగా పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఆయన విలేకరులతో అన్నారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, అయితే వాహన యజమానిని గుర్తించామని, త్వరలోనే డ్రైవర్‌ను పట్టుకుంటామని నదీముద్దీన్ చెప్పారు.

## ఎరుపుమయం

(మొదటి పేజీ తరువాయి)

చాడ వెంకటరెడ్డి, ప్యాట్రన్ కలవేన శంకర్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ వందేళ్ల కు పైగా ఉద్యమ చరిత్ర కలిగిన ఎఐటియుసి ప్రస్థానంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో మొట్టమొదటి సారి మహాసభలు జరుగుతున్నాయని, అన్ని రంగాల సంఘటిత, అసంఘటిత రంగాలను, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే కార్మిక వర్గాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో ఎఐటియుసి పాత్ర ఉందని ఎనలేనిదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సింగరేణి, బీడీ పరిశ్రమ, చేనేత పరిశ్రమలో పనిచేసే కార్మికులందరి హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి జెండా కింద అనేక పోరాటాల నిర్వహించి, ఎన్నో సంఘాలు నిర్మించడంలో కరీంనగర్ జిల్లా ముందుందని,ఎన్నో పోరాటాలు చేసి,విజయాలు సాధించిన చరిత్ర కరీంనగర్ కు ఉందని తెలిపారు. అలాంటి చరిత్ర కలిగిన ఎఐటియుసి రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం అన్ని వర్గాల కార్మికులు వేలాదిగా తరలిరావాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ప్యాట్రన్ కలవేన శంకర్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణకు కేంద్ర బిందువైన కరీంనగర్ లో ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు జరగడం సంతోషకరమని, కార్మికుల హక్కులు,చట్టాలు కాపాడుకోవడం కోసం పోరాటాలు ఉధృతం చేయడం కోసం కరీంనగర్ లో జరిగే మహాసభ వేదిక కావాలని శంకర్ ఆకాంక్షించారు. ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, టేశీనివాస్ సమ్మయ్య మాట్లాడుతూ ఎఐటియుసి రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్, వరల్డ్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి సి.శ్రీకుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ తో పాటు ఎఐటియుసి రాష్ట్ర నిర్మాణ బాధ్యులు వి. ఎస్.బోస్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎం.డి.యూసఫ్, ఎస్.బాల్ రాజ్ హాజరవుతున్నారని తెలిపారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, నగర్ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠ రెడ్డి తదితరులు ఉన్నారు.

## 'ఎఐ డేటా'సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు పేర్కొన్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్‌న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 2026, జనవరిలోనే సిఎం రేవంత్ రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మధ్య దావోస్‌లో చర్చలు జరిగాయి. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టిసిఎస్ ప్రతినిధుల మధ్య పలుమార్లు చర్చలు జరిగిన కొద్ది నెలల్లోనే ఈ ప్రాజెక్టును కార్యరూపంలోకి వచ్చిందని, దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించిందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైందన్నారు. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు , గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది.

ఇది దేశానికే చారిత్రాత్మక ప్రాజెక్ట్ ...

ఏఐ విప్లవంలో ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా ఎదుగుతున్న హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి

ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. 'ఏఐ డేటా' సెంటర్ ఏర్పాటు తెలంగాణతో పాటు దేశానికి ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు అని అన్నారు.ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన టిసిఎస్ ప్రతినిధులను సిఎం అభినందించారు. ప్రభుత్వం తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఆయన ప్రకటించారు. టిసిఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందన్నారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని,తెలంగాణ రైజింగ్ విజన్2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని సిఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు.

## 'టీచర్స్ డే' సందర్భంగా తండ్రి పేరిట ఫెలోషిప్‌ను ప్రకటించిన సచిన్



ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తన తండ్రి ప్రొఫెసర్ రమేశ్ తెందుల్కర్ జ్ఞాపకార్థం క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ కీలక ప్రకటన చేశారు. ప్రతి సంవత్సరం ఎండి (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) చేసే ఒక విద్యార్థికి ఆర్థికంగా సాయం అం దించనున్నారు. యువ డాక్టర్లను ప్రోత్సహించేందుకు ముందడుగు వేశారు. ఇంగా హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి తెందుల్కర్ ఫౌండేషన్ ఈ ఫెలోషిప్‌ను ఇవ్వనుంది. శ్రీనగర్‌లోని క్లెఫ్ట్, క్రా నియోఫేసియల్ కేర్‌లో ప్రత్యేక శిక్షణ కోసం ఏటా ఎండి చేసే ఒకరిని ఎంపిక చేయనుంది. 'నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. మా నాన్న నాలో అంతకంటే ఎక్కువ చూశారు. నేను ఏమవ్వాలో నిర్ణయించడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. స్వయంగా కనుక్కొనేందుకు అవసరమైన స్వేచ్ఛను నాకు ఇచ్చారు. నా తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థుల కోసం ఫెలోషిప్‌ను అందించనుండటం సంతోషంగా ఉంది. మా నాన్న నమ్మిన సిద్ధాంతం ఇది. విద్యే అవకాశాలను సృష్టిస్తాయని ఆయన భావించారు. అది ఇతరులకు ఉపయోగపడితే అంతకుమించిన పరమార్థం మరొకటి ఉండదు. ఉపాధ్యాయుని పాఠాలు ఒక విద్యార్థితో ప్రారంభం కావచ్చు. కానీ, వారి ప్రభావం ఎందరో జీవితాలకు, ఎన్నో తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది' అని సచిన్ పోస్టు పెట్టారు.

## దులీప్ ట్రోఫీ ఫైనల్.. సర్వం సిద్ధం



దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచే ఈస్ట్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య తుది పోరు జరగనుంది. తిలక్ వర్మ నాయకత్వంలోని సౌత్ జోన్ జట్టులో సిరాజ్, దేవదత్ పడిక్కల్ ఆడటం ఖాయమే. అయితే, కెఎల్ రాహుల్ రాకపై సందిగ్ధత ఉంది. రాహుల్ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని తిలక్ వెల్లడించాడు. ఫైనల్ నేపథ్యంలో ఇరు జట్ల కెప్టెన్లు తిలక్, ఇషాన్ కిషన్ ప్రెస్ కాన్ఫరెన్స్ మాట్లాడారు. ఈ సందర్భంగా తిలక్ వర్మ మాట్లాడుతు 'సీనియర్ పేసర్ షమీని అడ్డుకొనేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతోంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్ తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతడి బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం' అని తిలక్ వర్మ తెలిపాడు. ఇషాన్ కిషన్ మాట్లాడుతు 'మహ్మద్ షమీ అత్యుత్తమ ప్లేయర్. బెంగాల్ తరఫున ఆడేటప్పటి నుంచి అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడు. వికెట్లు తీయడంతో పాటు మైదానంలో తన శక్తినంతా వినియోగిస్తాడు. భారత క్రికెట్ కూ ఎన్నో సేవలు అందించాడు. ఇప్పుడందరూ వయసు గురించి మాట్లాడుతున్నారు. కానీ, అది కేవలం ఒక నంబర్ మాత్రమే. అతడి కష్టం గురించి ఎవరూ అనడం లేదు. ఇప్పటికీ షమీ భాయ్ వికెట్ల దాహం తీరలేదు' అని ఇషాన్ తెలిపాడు. షమీతోపాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారింది. సెమీస్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆకట్టుకున్నాడు.

## బిసిసిఐకి షాకిచ్చిన ఒలింపిక్ సంఘం

### క్రికెటర్లకు వసతులపై కీలక సూచన..!



ఆసియా క్రీడల్లో క్రికెటర్ల సౌకర్యార్థం మౌలిక వసతులు లేకపోవడంపై అసంతృప్తితో ఉన్న బిసిసిఐకి భారత ఒలింపిక్ సంఘం షాకిచ్చింది. జపాన్‌లోని ఐచీ నగోయాలో టెంట్‌లోనే డ్రెస్సింగ్ రూమ్, 500 మీటర్ల దూరంలో వాష్ రూమ్‌పై భారత బోర్డు ఫిర్యాదును తిరస్కరించింది. నిర్వాహకులు ఏర్పాటు చేసిన వాటితోనే సర్దుకుపోవాలని సూచించింది ఐఒఎ. ఒకవేళ టీమిండియా క్రికెటర్లకు ఇబ్బందిగా ఉంటుందని భావిస్తే.. సొంత ఖర్చుతో ఏర్పాట్లు చేసుకోవచ్చని పేర్కొంది. దాంతో.. టోర్నీ నిర్వాహకులను నమ్ముకునే కంటే భారత ప్లేయర్ల కోసం మెరుగైన వసతులు కల్పించడంపై బిసిసిఐ దృష్టి సారించనుంది. సెప్టెంబర్ 19వ తేదీ నుంచి జపాన్ వేదికగా ఆసియా క్రీడలు మొదలవ్వనున్నాయి. అయితే.. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే అథ్లెట్లు, క్రికెటర్లకు వసతులు, ఏర్పాట్లు మాత్రం ఆశించిన స్థాయిలో లేవు. టెంట్లలో లేదా కంటైనర్లలో వసతి, ఆమడ దూరంలో టాయిలెట్లు.. వంటివి క్రికెటర్లకు అసౌకర్యాన్ని కలిగిస్తాయని వాపోతున్న బిసిసిఐకి కీలక సూచన చేసింది భారత ఒలింపిక్ సంఘం. టైమ్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం.. వసతులపై అభ్యంతరం ఉంటే సొంతంగా ఏర్పాటు చేసుకునేందుకు అభ్యంతరం చెప్పబోమని బిసిసిఐకి ఐఒఎ స్పష్టం చేసింది. 'బిసిసిఐ సిఇఒ హేమంగ్ అమిన్ మాతో టచ్‌లో ఉన్నారు. జపాన్‌లో వసతుల పరిశీలన కోసం బిసిసిఐ ఓ బృందాన్ని పంపిస్తోంది. అందుకు మాకు అభ్యంతరం లేదు. ఆసియా క్రీడల్లో ఇలా వసతులపై ఫిర్యాదులు రావడం ఇదే మొదటిసారి. భారత బృందాన్ని ఒకేలా చూస్తాం. అందుకే క్రికెటర్లకు వసతుల్లో మార్పులు చేయలేం. ఈ పరిస్థితుల్లో అథ్లెట్ల మంచీచెడూ బిసిసిఐ చూసుకోనుంది. వసతుల పరంగా కొత్త మార్పులేవీ ఉండబోవని భారత ఒలింపిక్ సంఘం స్పష్టం చేసినట్లు సమాచారం. నిర్వాహకులు ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలి. 'మా వల్ల కాదంటే మాత్రం.. సొంతంగా ఏర్పాటు చేసుకోవచ్చు' అని బిసిసిఐకి ఐఒఎ తేల్చి చెప్పింది' అని ఐఒఎ సిఇఒ రఘురామ్ అయ్యర్ వెల్లడించారు. 'జపాన్‌లో ఆసియా క్రీడల ఏర్పాట్ల పట్ల ఎసిసి, బిసిసిఐ సంతృప్తిగా లేవు. అందుకని పరిశీలకులను జపాన్ పంపిస్తాం. వారు అక్కడి పరిస్థితులపై మాకు నివేదిక ఇస్తారు. టెంట్లలో డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటు చేశారని, వాష్‌రూమ్‌లు 500 మీటర్ల దూరంలో ఉన్నాయి. దాంతో, క్రికెటర్లు అసౌకర్యానికి గురవుతారనే విషయాన్ని ఎసిసి సమావేశంలో జపాన్ ఒలింపిక్ అధికారుల దృష్టికి తీసుకొచ్చాం. అంతేకాదు హోటల్ గదులు కూడా చిన్నగా ఉన్నాయి' అని బిసిసిఐ వర్గాలు ఎఎన్ఐతో పేర్కొన్న విషయం తెలిసిందే. టోర్నీ ఆరంభం కల్లా పరిస్థితిలో మార్పు లేకుంటే బీ టీమ్‌ను పంపాలని బిసిసిఐ ఆలోచిస్తున్నట్టు కథనాలు వచ్చాయి. అయితే.. భారత బోర్డు మాత్రం ఈ విషయమై ఎలాంటి ప్రకటన చేయలేదు.




### ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 77,264.51 పాయింట్లు. ముగింపు 76,515.43 పాయింట్లు. నష్టం749.08పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,175.65 పాయింట్లు. ముగింపు 23,897.70 పాయింట్లు. నష్టం 277.95 పాయింట్లు.

(స్టాక్ మారెట్లు వరుసగా నాలుగో వారం కూడా నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అని-శ్చితి ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా 'బేర్' జోరు కొనసాగింది. స్టాక్ మార్కెట్లు కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి).




### ఈవారం చివరి రోజు మార్కెట్లు..

బిఎస్ఇ ఇండెక్స్‌లో టాటా స్టీల్, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, కోటక్ మహీంద్ర బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, ఎంఅండ్ఎం, హిందుస్థాన్ యూనిలివర్, ఎన్‌టిపిసి, ఐటిసి, బజాజ్ ఫిన్ సర్వ్, ఇండిగో, యాక్సెస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఇన్ఫోసిస్, ఎల్ అండ్ టి, ఎస్‌బిఐఎన్ లాభాల్లో ముగిశాయి. మారుతి, బిఇఎల్, ఐసిఐసిఐ బ్యాంక్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, టిసిఎస్, ఏషియన్ పెయింట్స్, ఎటర్నల్, హెచ్ సిఎల్ టెక్, భారతి ఎయిర్ టెల్ నష్టాల్లో ముగిశాయి. కాగా, కొత్తగా అమలు చేసిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సిఎఎస్)పై మార్కెట్ నియంత్రణ సంస్థ అయిన సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) జారీ చేసిన సర్క్యులర్‌తో, ఎన్ఎస్ఇలో ఏంజెల్ వన్ షేర్లు దాదాపు 8 శాతం పెరగగా, ఆ తర్వాత బిఎస్ఇ షేర్లు 5 శాతం పెరిగాయి. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు కూడా దాదాపు 3 శాతం లాభపడగా, నువమా వెల్త్ మేనేజ్మెంట్ షేర్లు ఒక శాతంపైగా పెరిగాయి. రాబోయే ద్రవ్యోల్బణ గణాంకాలు మితంగా ఉంటే మరో వడ్డీ రేటు పెంపు అవసరం కాకపోవచ్చని ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ క్రిస్టోఫర్ వాలర్ సూచించిన తర్వాత యుఎస్ ట్రెజరీ రాబడులు పడిపోయాయి.

## గ్రీన్‌ఫీల్డ్ విద్యుత్ సమస్యలకు వినూత్న పరిష్కారాలు



గ్రీన్‌ఫీల్డ్ విద్యుత్ ఉత్పత్తిలో భారత్‌ను నెంబర్ వన్‌గా నిలబెట్టే లక్ష్యంతో 'ఎనర్జీ సోషలిజం మిషన్' పలు వినూత్న ఇంజినీరింగ్ పరిష్కారాలను ప్రకటించింది. పారిశ్రామిక ఆటోమేషన్ నిపుణుడు ఆనంద్ బద్కుల్ రూపొందించిన ఈ సాంకేతికతలు మానవ శక్తిని సహజ ఇంధన వనరుగా ఉపయోగించడంతోపాటు సౌర, పవన, జల విద్యుత్ ఉత్పత్తిని మరింత సమర్థంగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. సౌర విద్యుత్లో బ్యాటరీల అవసరాన్ని తగ్గించడం, వాతావరణంతో సంబంధం లేకుండా 24 గంటల విద్యుత్ ఉత్పత్తి, ఎలక్ట్రికల్ వాహనాల బ్యాటరీ సామర్థ్యాన్ని తగ్గించడం, విపత్తుల సమయంలో మొబైల్ విద్యుత్ కేంద్రాలుగా వినియోగించడం వంటి పరిష్కారాలను మిషన్ ప్రతిపాదించింది. మూడు పేటెంట్ దరఖాస్తులను డబ్ల్యుఐపిఒకు సమర్పించింది.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,56,660
22 క్యారెట్లు: రూ. 1,43,600
18 క్యారెట్లు: రూ. 1,17,490
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).



## బ్యూటీ బ్రాండ్‌ను ప్రారంభించిన 'నాని'

అందరిచేత ఎంతో ప్రేమగా 'నాని' అని పిలిపించుకునే నీలం రాఠీ, తన 69 ఏళ్ల వయసులో వ్యాపారంలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆయుర్వేద స్ఫూర్తితో 'బయోముని' అనే క్లిన్ బ్యూటీ బ్రాండ్‌ని ప్రారంభించారు. అందం, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో 'నేచురల్', 'ఆర్గానిక్', 'పారాబెన్‌ఫ్రీ', 'సల్ఫేట్‌ఫ్రీ' వంటి పదాలు ఎక్కువగా వినిపిస్తున్నప్పటికీ, ఉత్పత్తిలో నిజంగా ఏముందో వినియోగదారులకు పూర్తిగా తెలియడం లేదని ఆమె ప్రశ్నిస్తున్నారు. ఒక పదార్థం లేదని చెప్పడం మాత్రమే పూర్తి పారదర్శకత కాదని నాని అభిప్రాయపడుతున్నారు. 'కొబ్బరి ఆధారిత సర్ఫాక్టెంట్లు', 'నేచురల్ బయోఎంజైమ్స్' వంటి విస్తృత పదాలు ఉపయోగిస్తే, అందులోని నిర్దిష్ట పదార్థాలు ఏమిటో వినియోగదారులు తెలుసుకోలేరు. వెబ్సైట్ లేదా క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలు వెతికే అవసరం లేకుండా, ఉత్పత్తి లేబుల్పైనే పూర్తి సమాచారాన్ని అందించాలని ఆమె అంటున్నారు. భద్రతా ప్రమాణాలు, ధ్రువీకరణలు, పారదర్శకత మూడు వేర్వేరు అంశాలని నాని స్పష్టం చేస్తున్నారు. ఒక







పదార్థం నిర్దిష్ట ప్రమాణాలను పాటిస్తుందా అనేది ఒక ప్రశ్న. ఆ పదార్థం ఉత్పత్తిలో ఉందని వినియోగదారుడు స్పష్టంగా తెలుసుకోగలడా అనేది మరో ప్రశ్న. ఈ సూత్రంతో 'బయోముని' తన ఉత్పత్తుల లేబుళ్లపైనే పూర్తి పదార్థాల జాబితాను అందిస్తున్నట్లు సంస్థ చెబుతోంది. ఆమె ప్రధాన సందేశం: ఉత్పత్తిలో ఏమి లేదో మాత్రమే చెప్పకుండా, ఏమి ఉందో కూడా స్పష్టంగా చెప్పాలి.

## అగ్రిమెంట్లు తీసుకురండి.... బహిరంగ చర్చకు సిద్ధం

### ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : కార్మికుల కోసం ఎఐటియుసి సాధించిన ఒప్పందాలపై విమర్శలు చేస్తున్న ఇతర కార్మిక సంఘాలు తాము సాధించిన అగ్రిమెంట్లను తీసుకుని బహిరంగ చర్చకు రావాలని ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య సవాల్ విసిరారు. శ్రీరాంపూర్ ఆర్కే 5 గని వద్ద నిర్వహించిన గేట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలోని 11 డివిజన్లలో ఎక్కడైనా, ఏ తేదీనైనా, ఏ వేదికపైనైనా చర్చకు ఎఐటియుసి సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. న్యాయ నిపుణులు, పాత్రికేయులు, కార్మికుల సమక్షంలో ఎవరు ఎన్ని అగ్రిమెంట్లు సాధించారు, వాటివల్ల కార్మికులకు ఎంత ప్రయోజనం కలిగిందో తేల్చుకుందామని పేర్కొన్నారు. ఎఐటియుసి ఇచ్చిన సమ్మె నోటీసుతో ఆర్‌ఎల్‌సి సమక్షంలో జరిగిన చర్చల ఫలితంగా పెర్క్స్‌పై ఆదాయపు పన్ను యాజమాన్యం భరించడం, విధి నిర్వహణలో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం, ప్రతినెలా మెడికల్ బోర్డు నిర్వహణ, బదిలీ నిబంధనల్లో మార్పులు, అర్హులైన మైనింగ్ సిబ్బందికి పదోన్నతులు వంటి కీలక అంశాలపై అంగీకారాలు సాధించినట్లు వివరించారు. హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, సింగరేణి పాఠశాలల్లో సిబిఎస్ఇ సిలబస్, కాంట్రాక్టు కార్మికులకు ఇఎస్ఐ వైద్యం, ఆధారిత ఉద్యోగాల పరిష్కారం, సొంత ఇంటి పథకంపై ప్రభుత్వంతో చర్చలు తదితర డిమాండ్లపై యాజమాన్యంతో ఒప్పందాలు కుదిరాయని తెలిపారు.

సంస్థ మనుగడ కోసం కొత్త బొగ్గు గనులు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కందికట్ల వీరభద్రయ్య, ఎస్కె బాజీ సైదా, రాచర్ల చంద్రమోహన్, అఫ్రొజ్ ఖాన్, రాజ్‌కుమార్, నర్సింగరావు, మల్లేష్, ప్రవీణ్, జిపి రావు, మురళి పాల్గొన్నారు.

## ఆర్‌టిసి ఆస్తులు కబళిస్తే ప్రత్యక్ష పోరాటమే

### ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఆర్‌టిసి స్థలాల వినియోగం సరికాదు ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకో వాలి : ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న

ప్రజాపక్షం/హైదరాబాద్:ఆర్‌టిసికి చెందిన స్థలాలను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వినియోగించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నప్పటికీ ఆర్‌టిసి ఆస్తులపై ప్రభుత్వం కన్నేయడం సరికాదని, ఆర్‌టిసి ఆస్తులను కబళించే ప్రయత్నాలను ప్రభుత్వం కొనసాగిస్తే యూనియన్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని ఎస్.బాబు, ఈదురు వెంకన్న హెచ్చరించారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం కాలేదని, సంస్థ ఆస్తులు కార్పొరేషన్‌కు చెందినవేనని వారు పేర్కొన్నారు. ఆర్‌టిసి స్థలాలను ఇతర అవసరాలకు కేటాయించడం సంస్థ అభివృద్ధికి, ప్రజా రవాణా వ్యవస్థకు నష్టం కలిగిస్తుందన్నారు. ఎపి పునర్విభజన చట్టం ప్రకారం ఉన్న ఆస్తులను ఇలా ఇతరులకు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

**ఆర్‌టిసి ఉద్యోగులూ పేదలే..**

ఆర్‌టిసిలోనే ఇళ్లు లేని నిరుపేద ఉద్యోగులు వేల సంఖ్యలో ఉన్నారని, హైదరాబాద్‌లో కనీసం గజం స్థలం కొనుగోలు చేసే స్తోమత కూడా అనేకమంది ఉద్యోగులకు లేదని తెలిపారు. అద్దె ఇళ్లలో జీవిస్తూ నెలనెలా ఇంటి అద్దెలు చెల్లించలేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఆర్‌టిసి స్థలాల్లో కా కుండా ప్రభుత్వానికి చెందిన ఇతర ఖాళీ భూములను ఇందుకు వినియోగించాలని కోరారు. ఆర్‌టిసి స్థలాల్లో ఇళ్లు లేని ఆర్‌టిసి ఉద్యోగులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ అమలు చేయాలని గతంలో పలుమార్లు విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన సెటిల్మెంట్లు కూడా పూర్తిగా చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃపరిశీలించి, ఆర్‌టిసి స్థలాలను సంస్థ ప్రయోజనాలకే వినియోగించాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం

### సిపిఐ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసు

ప్రజాపక్షం / మంచిర్యాల : కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన ప్రభుత్వ రంగాన్ని బలహీనపరుస్తోందని సిపిఐ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, మేకల దాసు విమర్శించారు. సెప్టెంబర్ 6,7,8 తేదీల్లో కరీంనగర్‌లో నిర్వహించనున్న ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను శనివారం మంచిర్యాల ఐబిలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించే కార్మికులు, రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి కేంద్రం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జిడిపి పెరుగుతోందని పాలకులు ప్రచారం చేసుకుంటున్నా సామాన్యుల జీవితాల్లో మార్పు కనిపించడం లేదని, నిరుద్యోగం ఎందుకు తీవ్రమవుతోందని ప్రశ్నించారు. కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత మెరుగుపడకపోవడానికి కేంద్ర విధానాలే కారణమని నిలదీశారు. కాగితాల్లో కనిపించే గణాంకాలు మాత్రమే అభివృద్ధికి కొలమానం కావని, ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, ఉపాధి అవకాశాలు, కార్మికుల వేతనాలు, సామాజిక భద్రత లభించినప్పుడే నిజమైన పురోగతి అని స్పష్టం చేశారు. హక్కుల సాధనకు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఎఐటియుసి నిరంతరం పోరాటం చేస్తుందని, ఈ మహాసభలను కార్మికులు, ఉద్యోగులు, రైతులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు ఖలీందర్ అలీ ఖాన్, జోగుల మల్లయ్య, మిట్టపల్లి పౌలు, లింగం రవి, కొట్టే కిషన్ రావు, వనం సత్యనారాయణ, మిర్యాల రాజేశ్వర్ రావు, చాడా మహేందర్ రెడ్డి, కాదండి సాంబయ్య, ఎగుడ మొండి, పానుగంటి సత్యనారాయణ, మండ యాదగిరి, బియ్యాల రాజేశం పాల్గొన్నారు.



## స్వార్థ రాజకీయాల కోసం చరిత్ర వక్రీకరణ

### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవన్‌లో ఉస్తెల నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడికి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం సాగించిన వీరోచిత పోరాటం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం 4 వేల మంది పోరాడిన అమరవీరులు త్యాగాలు చేసి, 10 లక్షల ఎకరాల భూమి పంచి, 3 వేల గ్రామాలు విముక్తి చేసి గ్రామ స్వరాజ్యాలు స్థాపించిన ఘనత సాయుధ పోరాటానికి ఉందని గుర్తు చేశారు. ఆ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరిస్తూ హిందు, ముస్లీం తగాదాలుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దాన్ని తిప్పి కొట్టి నిజమైన వారసులు కమ్యూనిస్టులని వారు మాత్రమే ఈ ఉత్సవాలను జరిపేందుకు అర్హులన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా వారి స్మృతులు, గుర్తులు నేటికి ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచాయన్నారు. రైతులు, కార్మికులు, కర్షకులు, యువత, మహిళలు ఐక్యంగా పాల్గొని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని జిల్లావ్యాప్తంగా అమరుల త్యాగాలు స్మరించుకుంటూ ర్యాలీలు, బహిరంగ సభలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు మంచినీటి కోసం చెరువులు నింపటానికి పాలేరు వరకు నీటిని విడుదల చేసి ప్రజలను నీటి ఎద్దడి నుండి కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, ఎల్లంల యాదగిరి, బద్దం కృష్ణారెడ్డి, బూర వెంకటేశ్వర్లు, నంద్యాల రామ్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్య, వైద్య, ఉపాధి హక్కుల పోరాటాలకు సన్నద్ధమవ్వాలి

### సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు పిలుపు





ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : రాజ్యాంగం కల్పించిన విద్య, వైద్యం, ఉపాధి హక్కులకై యువత సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర మూడో మహాసభలు, సెప్టెంబర్ 8న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని శ్రీరాములు డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించి పేదలకు ఉచిత వైద్యం అందించాలని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఉద్యోగాలు కల్పించలేని పక్షంలో అర్హులైన నిరుద్యోగులకు వెంటనే నిరుద్యోగ భృతిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సెప్టెంబర్ 8వ తేదీన యాదగిరిగుట్ట బస్టాండ్ వద్ద నిర్వహించనున్న ఎఐవైఎఫ్ బహిరంగ సభను విజయవంతం చేయడానికి యువకులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ బైక్ ర్యాలీ మరియు కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బండి జంగమ్మ, సీపీఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, పేరబోయిన బంగారు, గోపగాని రాజు, గుండు వెంకటేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు ప్రణయ్, కంబాల వెంకటేష్, నాయకులు అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, సంగీ అరవింద్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



## సమాజ మార్పునకు ఉపాధ్యాయుల పాత్ర క్రియాశీలకం : ఎమ్మెల్యే బత్తుల

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజంలో చైతన్యాన్ని, మార్పును తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత క్రియాశీలకమైనదని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి సందర్భంగా శనివారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు శోభాయమానంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బత్తుల లక్ష్మారెడ్డి పలువురు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి పర్వదిన శుభాకాంక్షలు అందజేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యాశాఖ సిబ్బంది, కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి- ఎమ్మెల్సీ



సమాజంలో అత్యున్నత స్థానంలో నిలిచే గురువులు విద్యార్థులలోని జ్ఞానాన్ని వెలికితీసి ఉన్నత స్థానాలకు చేర్చడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సన్మాన మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మనాయక్, హెడ్‌మాస్టర్ లాలునాయక్, విద్యాశాఖ ఉపాధ్యాయులు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, 5వ వార్డు ఇన్‌చార్జి కేతావత్ జవహర్ నాయక్ పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ ఉద్యమకారుల అరెస్టును ఖండించిన ప్రజాసంఘాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నకిరేకల్‌లో చెరువు సభకు సిఎం రేవంత్ రెడ్డి వస్తున్నారని సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటి కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి, కోకన్వీనర్ చల్లమల్ల నరసింహలను పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. శాంతియుత ఉద్యమం చేపడుతున్న బుల్లెట్ ట్రైన్ ఉద్యమకారులను అరెస్టు చేయడాన్ని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, సామాజిక సంఘాలు పెద్ద ఎత్తున ఖండించాయి. కేంద్రం ఇచ్చిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్‌ను మార్చే ప్రయత్నం చేస్తున్న వారికి వ్యతిరేకంగా శాంతియుత ఉద్యమాలు నిరసనలు చేపడుతున్న బుల్లెట్ ట్రైన్ ఉద్యమకారులను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సిఎం సభకు గాని, ప్రభుత్వ కార్యకలాపాలకు, అధికార కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం చేయకుండా దీక్షలు, వినతి పత్రాలు, శాంతియుత నిరసనలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే, బిజెపి రాష్ట్ర నాయకులు సంకినేని వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి రాజా, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు వజ్జె వీరయ్య, కందుకూరి యాదగిరి, జలగం మల్లేష్, నరేంద్ర గౌడ్, ఖదీజ్ఞాని, గుండు వెంకన్న, కిరణ్, మట్టిపెల్లి సైదులతోపాటు పలు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.

## గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులుగా తంగిరాపల్లి శ్రీవాణి రవికుమార ని, అధ్యక్షుడు పసుపునూరి నాగభూషణం, ఉపాధ్యక్షులుగా పాదరాజు ఉమాశంకర్ ని, కిమోజు మల్లికార్జున్ని, ప్రధాన కార్యదర్శిగా జెర్రిపోతుల భరత్, బెల్లంకొండ చంద్రకాంత్, కోశాధికారి గాయపాక పృథ్వీ, కూర నరేందర్‌ని ఎన్నుకోవడం జరిగినది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పసుపునూరి నాగభూషణం మాట్లాడుతూ రాబోయే గణపతి పండుగను గతం కంటే వైభవంగా ఘనంగా శాంతియుతంగా చేస్తానని తెలిపారు. గతంలో ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని రాబోయే కార్యక్రమాలని అన్ని వ్యవస్థలతో కలిసి పనిచేసి దిగ్విజ యం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ హిందూ సంఘా లు, యువజన సంఘాలు, వివిధ గణపతి మండపాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి రాష్ట్ర మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6,7,8 తేదీలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను గరిడేపల్లి మండల నుంచి కార్మికులు, వివిధ సంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలు ఎంతో ప్రత్యేకమైనవని అన్నారు. కేంద్రంలో బిజేపి ప్రభుత్వం పెట్టుబడిదారుల కార్పోరేట్ యాజమానుల ఆస్తులను పెంచేందుకు కుట్రలు చేస్తూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తున్నారని అన్నారు. ఈ మహాసభలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై చర్చించి తీర్మాణాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు బండ్ల ఆనందరావు, గుగులోతు రవి, గుర్రం రమేష్, మచ్చ సుగుణ, సుబ్బయ్య, ఆంజనేయులు, బిక్షం పాల్గొన్నారు.









## రూ.344.92 కోట్లతో నకిరేకల్ అభివృద్ధికి బాటలు

**ప్రజా పక్షం/నకిరేకల్:** నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న తరుణంలో ప్రజాపాలన ప్రగతి సభ నిర్వహించిన సందర్భంగా సీఎం ఎ.రేవంత్‌రెడ్డి శనివారం నకిరేకల్‌లో పర్యటించి రూ.344.92 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులను ప్రారంభించారు.ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ వేముల వీరేశం చొరవతో విద్య,వైద్యం,రహదారులు,విద్యుత్తు,మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ పనులకు శ్రీకారం చుట్టారు.రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల,రూ.45.60 కోట్లతో నకిరేకల్ గురజాల రహదారి నుంచి భైరవునిబండ,అమ్మనబోలు మీదుగా రామంజపురం వరకు రహదారి,రూ.20 కోట్లతో సమీకృత మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.17.50 కోట్లతో పాత ఎన్‌హెచ్9 విస్తరణ,పటిష్టీకరణ,రూ.9.85 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్, రూ.6.25 కోట్ల చొప్పున నకిరేకల్, చిట్యాల మున్సిపల్ కార్యాలయ భవనాలు, రూ.3.63 కోట్లతో మునిపాముల 33/11 కేవీ సబ్‌స్టేషన్, రూ.1.10 కోట్లతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భవన నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

## సంక్షేమ పథకాలు అమలుకు ప్రభుత్వం కట్టుబాటు

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

### రూ. 35 కోట్లతో కాటేపల్లి- ఆలేరు డబుల్ నిర్మాణానికి శంకుస్థాపన




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత కేసిఆర్ ప్రభుత్వం ధనిక తెలంగాణాను అప్పుల తెలంగాణాగా మార్చినప్పటికీ,ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుతూ ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరిం చడమే నిజమైన ప్రజా పాలన అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం ఆయన మోటకొండూరు మండలంలోని కాటేపల్లి లో సర్పంచ్ పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్, వివిధ శాఖల అధికారులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించిన అనంతరం కాటేపల్లి నుండి మోటకొండూ రు మీదుగా దిలావ ర్పూర్ ఎక్స్ రోడ్ వరకు 35 కోట్లతో మంజూరైన డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆయా గ్రామాల సర్పంచ్ లతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం సందర్భంగా జరుపుకునే గురుపూజోత్సవం కార్యక్రమంలో భాగంగా కాటెపల్లి అంగన్వాడి టీచర్, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఎమ్మెల్యే శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రాథమిక పాఠశాలలో చదివే పిల్లలకు సరిపడే ఉపాధ్యాయులు లేనందున విద్యా వాలంటీర్ తో నడిపిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేయడంతో విద్యా వాలంటీర్ కు ఇచ్చే జీతభత్యం బీర్ల ఫౌండేషన్ తరఫున ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు డిఈ శ్రీనివాస్, ఎంపీడీఓ ఇందిర, తహసిల్దార్ రాజేంద్ర ప్రసాద్, ఎంపీఓ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మోటకొండూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు, నాయకులు కొంతం మోహన్ రెడ్డి, బోయిని ఝాన్సీ, నెమ్మాని సుబ్రహ్మణ్యం, బుగ్గ శ్రీశైలం, పాండు రంగయ్య ఉన్నారు.

## ఉపాధ్యాయులతోనే సమాజ సమూల మార్పు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఉపాధ్యాయులతోనే సమాజ సమూల మార్పు సాధ్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జిల్లావ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ఆయన చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన జీవిత ప్రయాణంలో గురువుల పాత్రను గుర్తు చేసుకుని, ఉపాధ్యాయ లోకానికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సాధారణంగా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల్లో ఇచ్చే ప్రశంసా పత్రాలు కొన్ని పరిమితులకు లోబడి ఉంటాయని, అందుకే ఈ సారి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యారంగంలో నిరంతరం శ్రమిస్తున్న వారందరికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు డిఈఓ పరిధిలోని పాఠశాలలతో పాటు ఇంటర్, పాలిటెక్నిక్, రెసిడెన్షియల్, వెల్ఫేర్ పాఠశాలల ఉపాధ్యాయులను కూడా ఈసారి అవార్డులకు ఎంపిక చేసి ప్రశంసా పత్రాలను అందజేసినట్లు వివరించారు. తరగతి గదుల్లో నిశ్శబ్దంగా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల మహోన్నత సేవలను వారి విద్యార్థుల ప్రగతి ద్వారానే గుర్తించగలమని కొనియాడారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల నాలెడ్జ్, చదవడం, రాయడం బోధించడమే కాకుండా మారుతున్న సమాజంలో ఏది మంచి, ఏది చెడు అని గ్రహించే నిర్ణయాత్మక శక్తిని, మానవతా విలువలను పెంపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా చైతన్యవంతమైన జిల్లా అని ఇక్కడి విద్యారంగం ప్రస్తుతం ఒక సరికొత్త దేశలో ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భారత దేశ తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘనంగా నివాళులర్పించారు. సూర్యాపేట జిల్లా పేరులోనే ఉన్న సూర్యుడిలాగా ఇక్కడి విద్యారంగం కూడా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి వెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, డిఐఓ సులోచన రాణి, ఆర్‌సిఓలు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

## సంక్షేమం అభివృద్ధితో ప్రజాపాలన..



**ప్రజాపక్షం/భువనగిరి :** సంక్షేమం అభివృద్ధి తో ప్రజాపాలన జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లంల జంగయ్య అన్నారు. శనివారం భువనగిరిలోని ఎస్వి గెస్ట్ హౌస్ నందు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి ప్రజా పాలన నిరంతరం ప్రజా క్షేత్రంలో పనిచేస్తున్న కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆశీస్సులతో భువనగిరి మండల ప్రజానీకం మరింత సంక్షేమ పథకాలు అందించే విధంగా పని చేస్తూ పని చేస్తూ పార్టీ గ్రామ శాఖలను ఏర్పాటు చేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అని కమిటీ తీర్మానం చేయడం జరిగింది గడపగడపకు సంక్షేమ పథకాలను సమగ్ర అభివృద్ధి సాగునీరు తాగునీరు ప్రజా ప్రతినిధులతో ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేఖా బాబురావు, చుక్క స్వామి, చిక్కుల వెంకటేష్, ఎడ్ల వెంకట్ రెడ్డి, విఠల్ వెంకటేశ్, ఓరుగంటి అంజయ్య, మైలారం వెంకటేష్, నల్లగొండ ప్రభాకర్, చిన్నాబాతినీ స్వరూప లూర్దయ్య, రజిత, రాజశేఖర్, రవి, కృష్ణ మూర్తి, రమేష్, శ్రీశైలం, గణే ష్, మహిపాల్, సాయిదమ్మ, పద్మ పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో మహిళ మృతి

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఇంటిని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తాకి మహిళ మృతిచెందిన విషాద ఘటన మర్రిగూడలో చోటుచేసుకుంది.బోనాల పండుగ సందర్భంగా పగడాల చెన్నమ్మ (56) ఇంటిని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.రాంబాబు తెలిపారు.

## నిరుద్యోగం, విద్యా, ఉపాధి, సామాజిక సమస్యలపై పోరు

### యువత పెద్ద ఎత్తున తరలిరావాలి : విప్లవ్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు కొండూరు విప్లవ్ మాట్లాడుతూ యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం విద్యా ఉపాధి సామాజిక సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈనెల 8 నుండి 10 వరకు యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యువతకుల కోసం సాధన కోసం జరిగే ఈ మహాసభలకు విద్యార్థులు యువకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, మాజీ యువజన నాయకుడు మారగొని నాగరాజు, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, లాలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) మండల కమిటీని ఎన్నుకున్నారు. మండ ల అధ్యక్షుడిగా కరెంటోత్ వినోద్, ఉపాధ్యక్షులు. దుబ్బాక చరణ్, సింగ పంగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా రవితేజ, సహా య కార్యద ర్శులుగా గడ్డం యాదయ్య, వరికుప్పల సాయికుమార్, కోశాధికారిగా ఏర్పుల రాములుతో పాటుగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.





## వంద పడకల ఆసుపత్రికి నర్రా రాఘవరెడ్డి పేరు పెట్టాలి

### సిఎం రేవంత్ రెడ్డికి సిపిఐ(ఎం) వినతి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్‌లో నూతనంగా ప్రారంభించిన వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి పేరు పెట్టాలని, ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని,నియోజకవర్గ పరిధిలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ఎం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.నకిరేకల్ నియోజకవర్గానికి ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాపక్ష నేతగా పని చేసిన నర్ర రాఘవరెడ్డి పేరు ప్రభుత్వాసుపత్రికి పెట్టాలని కోరారు అదేవిధంగా జిల్లాలోనే రెండవ ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన మూసి ప్రాజెక్ట్ పూడిక తీసి ఆధునీకరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని,పద్మానగర్ కాలనీ జంక్షన్ వద్ద ప్రమాదకరంగా మారిన హైవేపై ఫ్లైఓవర్ నిర్మించాలని,డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించడంతో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను మంజూరు చేయాలని, ఫైర్ స్టేషన్‌కు పక్కా భవనం నిర్మించాలని, పండ్ల తోటల రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కోరారు.చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి,వట్టిమర్తి గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తిగా నిర్మించి పేదలకు పంపిణీ చేయాలని, ఉదయసముద్రం బీవెల్లెం పిల్లాయిపల్లి,ధర్మారెడ్డిపల్లి కాలువల ఫీడింగ్ పనులను పూర్తి చేసి ఫీడర్ ఛానల్ ద్వారా నీరు అందించి చెరువులు, కుంటలు నింపాలని, పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై నిర్మించే ఫ్లైఓవర్ బ్రిడ్జిని రైల్వే గేటు వద్దకు పొడిగించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాళ ప్రమీల,జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, బొజ్జ చిన్నవెంకులు,పెంజర్ల సైదులు,పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

## మధ్యవర్తులను ఆశ్రయించవద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపాలిటి ద్వారా అందించే వివిధ సేవలు పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియలోనే, నిబంధనల ప్రకారం జరుగుతున్నందున ప్రజలు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూర్యాపేట మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ అనుమతులు, ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్ జారీ, ఇంటి నంబర్ల మంజూరు, జనన ధృవీకరణ పత్రాల జారీ తదితర సేవలకు సంబంధించి నేరుగా మున్సిపల్ కార్యాలయ అధికారిక ప్రక్రియను మాత్రమే అనుసరించాలన్నారు. మున్సిపాలిటి నుంచి జారీచేసే భవన నిర్మాణ అనుమతులు, ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్, ఇంటి నంబర్లు, జననమరణ సర్టిఫికెట్లు తదితర సేవలన్ని నిర్ధేశిత నియమ నిబంధనల మేరకు ఆన్‌లైన్ విధానంలోనే మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సేవలు ఇప్పిస్తామంటూ ఎవరైనా మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించవద్దని కోరారు. మున్సిపల్ సిబ్బంది ఎవరైనా సేవల కోసం డబ్బులు అడిగినా, ఇతర ఆర్థిక లావాదేవీలకు పాల్పడాలని కోరినా వెంటనే తన దృష్టికి తీసుకొని వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం మున్సిపల్ సేవలు అందించడమే లక్ష్యమని చెప్పారు.

## మైనోద్దీన్ కుమారుని మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి :** రైతు సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎండీ.మైనోద్దీన్ పెద్ద కుమారుడు ఎండీ.బందగీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఆ కుటుంబానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ అన్నారు.శనివారం డిండి మండలంలోని కందుకూరు గ్రామంలో మైనోద్దీన్ తోపాటు కుటుంబ సభ్యులను అంజయ్య పరామర్శించారు. బందగి చిన్ననాటి నుండి భారత కమ్యూనిస్ట్ పార్టీ విద్యార్థి సంఘంలో,యువజన సంఘంలో చురుకుగా పాల్గొని నాయకత్వ బాధ్యతలు సైతం తీసుకోని విద్యార్థి, యువజన సంఘాల భలోపేతానికి ఎంతో కృషిచేసారని అన్నారు.పార్టీ కార్యక్రమాల్లో సైతం పాల్గొని అందరితో చాలా కలిసి మెలిసి ఉండి,ఆప్యాయంగా పలకరించే వాడని అన్నారు. కుటుంబానికి అండగా ఉండి తల్లి తండ్రికి భార్య బిడ్డకూ తోడుగా ఉండే సమయంలో ఇలా జరగడం చాలా బాధను కలిగించిందని అన్నారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ పార్టీ బందగి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎనమల్ల నవీన్,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి రవీందర్ శర్మ,గ్రామశాఖ కార్యదర్శి శ్రీను,ఎండీ.జమీల్ ఉన్నారు.

## ఉపాధ్యాయులే సమసమాజ నిర్మాతలు

కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** విద్యార్థులకు జ్ఞానంతో పాటు జీవితాన్ని ఎదుర్కొనే శక్తిని అందించి, వారిని సన్మార్గంలో నడిపించే ఉపాధ్యాయులే సమసమాజ నిర్మాతలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ప్రస్తుత కృత్రిమ మేధస్సు (ఎఐ) యుగంలో విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, పఠన అలవాటు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగడం, మంచి ఫలితాలు రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ శాలువాలతో ఘనంగా సన్మానించి,జ్ఞాపికలు,ప్రశంసాపత్రాలను అందజేశారు.జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, ఇంటర్మీడియట్ అధికారి పరశురామ్, సంక్షేమ శాఖల అధికారులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు శివాజీ, రాములుకు జిల్లా ఉత్తమ అవార్డులు






**ప్రజాపక్షం/కౌటాల :** కౌటాల మండలానికి చెందిన ఉపాధ్యాయులు అదే శివాజీ, మాడే రాములు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిత చేతుల మీదుగా వారు ఈ అవార్డులను స్వీకరించారు. గుడ్లబోరి ఎంపిపిఎస్ ఎస్జిటి ఉపాధ్యాయుడు అదే శివాజీ, పటేల్‌గూడ టిడబ్ల్యూపిఎస్ ఎస్జిటి ఉపాధ్యాయుడు మాడే రాములు విద్యాభివృద్ధికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు దక్కాయి.పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని, ఈ గుర్తింపు మరింత బాధ్యతతో, అంకితభావంతో పనిచేసేలా ప్రేరణనిచ్చిందని తెలిపారు. అవార్డు గ్రహీతలను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## రిజిస్టర్డ్ కమిటీకే..
## గణేష్ ఉత్సవాల నిర్వహణ హక్కు

సిద్ధి వినాయక మండలి అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/మందమర్రి :** సొసైటీగా చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ పొందిన కమిటీకే గణేష్ ఉత్సవాలను నిర్వహించే హక్కు ఉందని సిద్ది వినాయక గణేష్ మండలి అధ్యక్షుడు మంద వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీలో ఉత్సవాల నిర్వహణపై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఉత్సవాల ఆదాయానికి సంబంధించి అవకతవకలు జరిగినట్లు దృష్టికి రావడంతో, ఆ ఏడాది మండలిని రిజిస్ట్రేషన్ నంబర్ 215/2026తో అధికారిక సొసైటీగా నమోదు చేయించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం అధికారిక కమిటీ ఆధ్వర్యంలోనే వేడుకలు జరగాలని, వచ్చే చందాలు, విరాళాలు, ఖర్చుల వివరాలను పారదర్శకంగా వెల్లడించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాలు ముగిశాక ఆదాయ వ్యయాల లెక్కలను కాలనీ ప్రజల ముందు బహిరంగంగా ప్రదర్శించాలని సూచించారు. కమిటీ అనుమతి లేకుండా ఎవరైనా చందాలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ఆయన వెల్లడించారు.

## ఉపాధ్యాయుడే మార్గదర్శకుడు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఉపాధ్యాయుడు మార్గదర్శకుడని కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ అన్నారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులను డైరెక్టర్ నరాల సుధాకర్, ప్రిన్సిపాల్ నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు కూడా సరిపోవాలనాలనే భాగంగా పాఠాలు చెప్పారు. అద్వితీయ ప్రదర్శన కనబర్చిన ఇద్దరు విద్యార్థులు శేఖర్, దేవికలను బహుమతులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నరాల సుధాకర్‌తో పాటు ప్రిన్సిపాల్ నరేష్, వైస్‌ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, బాధ్యులు సందేశ్, శంకర్ పాల్గొన్నారు.

## మాడేగావ్ పంచాయతీ రికార్డులు, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ఎంపిఓ గోవర్ధన్



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** దిలావర్‌పూర్ మండలంలోని మాడేగావ్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని,అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) గోవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను, పారిశుద్ధ్య నిర్వహణ,నిధుల వినియోగం,అభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమగ్రంగా పరిశీలించారు. పంచాయతీ రికార్డులను ఎప్పటికప్పుడు పక్కాగా నిర్వహించాలని,గ్రామ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు.అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు,చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు.పిల్లల హాజరు పట్టికను ,ఆహార నాణ్యతను తనిఖీ చేశారు. గ్రామ పరిశుభ్రత, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం అందించే పోషకాహారం అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా చూడాలని స్పష్టం చేశారు. పంచాయతీ కార్యదర్శి,అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది,పాల్గొన్నారు.

## ఎఐటియుసిలో చేరిన దుర్గ రమేష్



**ప్రజాపక్షం/మావల:** ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో సీఐటీయూకు చెందిన సీనియర్ సెక్యూరిటీ గార్డ్ దుర్గ రమేష్ శనివారం ఎఐటియుసిలో చేరారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ముజీబ్, నాయకుడు ఎనికె అమీర్ ఆధ్వర్యంలోరావు ఉపాధ్యక్షుడు సిద్ధ దేవేందర్ ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. దుర్గ రమేష్ చేరికతో యూనియన్ మరింత బలోపేతం అవుతుందని దేవేందర్ ధీమా వ్యక్తం చేయగా, సంఘ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రమేష్ తెలిపారు.

# మంత్రి జూపల్లి పర్యటనలో లోటుపాట్లు ఉండొద్దు

నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/నిర్మల్ :** జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం బాసరలో పర్యటించి వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో, పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శనివారం బాసరలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం,గోదావరి నది పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమాల షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పార్కింగ్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం భైంసా తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తనిఖీ చేశారు. నోటీసుల జారీ, తదుపరి ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేసి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా పలువురు ఓటర్లతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి వారి సందేహాలను అడిగి తెలుసుకుని నివృత్తి చేశారు.ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ ఈఈలు అనిల్, సుభాష్, ఉద్యానవన శాఖ అధికారి రమణ,బాసర ఆలయ ఈఓ అంజనా దేవి, తహసీల్దార్లు పవన్ చంద్ర,శశి భూషణ్,అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ వైఫల్యాలపై 'యువగర్జన'

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో ఘోరంగా విఫలమైందని మండిపడుతూ శనివారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని భీమ్‌గల్‌లో భారీ విద్యార్థి యువత సదస్సు, బైక్ ర్యాలీ నిర్వహించారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై పోరాటమే లక్ష్యంగా సాగిన ఈ ర్యాలీకి యువత, ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది.ముఖ్యంగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థుల కోసం ప్రకటించిన 5 లక్షల విద్యాభరోసా కార్డులను వెంటనే జారీ చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.4వేల నిరుద్యోగ భృతిని బకాయిలతో సహా చెల్లించాలని విద్యార్థులను వేధిస్తున్న ఫీజు రిఎంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ బైక్ ర్యాలీకి నియోజకవర్గం నలుమూలాల నుండి వేలాది మంది యువకులు, విద్యార్థులు కొన్ని రోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన జెన్‌జీల ఆందోళనలతో కేంద్ర విద్యామంత్రి పదవికి రాజీనామా చేశాడని గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి సర్కార్‌కు కూడా తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. నాయకులు పాల్గొన్నారు.

## 'సర్' అనామస్ నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ సంగీత



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు (అనామలీస్) నో మ్యాపింగ్ ఓటర్లకు ఆలస్యం చేయకుండా నోటీసులు జారీ చేయాలని ,ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) స్పెషల్ కంపేయిన్‌లలో బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లాలో ఎస్ఐఆర్ అనామలీస్ నో మ్యాపింగ్ ఓటర్లకు నోటీసులు జారీ ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) స్పెషల్ కంపెయిన్ వంటి తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ అనామలిస్ నో మ్యాపింగ్ ఓటర్లకు బూత్ లెవల్ కంపీయస్ వంటి తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఓటర్లు 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఎదైనా ఒకదాని వివరాలను సమర్పించాలని తెలిపారు. 5,6,13 తేదిలలో స్పెషల్ కంపెయిన్ కొనసాగనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఓటర్లు తమకు సంబందంచిన ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు స్పెషల్ కంపెయిన్ కార్యక్రమం సద్వినియోగం చేసుకుని ఓటర్ల జాబితాలో తమ పేరు వివరాలను పరిశీలించుకోవాలని అవసరమైన సవరణలు ఉంటే నిర్ణీత ఫారాల ద్వారా సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఓటర్ల జాబితా సవరణకు సంబందించిన అంశాలపై తమ అభిప్రాయాలు సూచనలు అందించాలని రాజకీయ పార్టీల ప్రతినిదులను కోరారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులుపాల్గొన్నారు.


# ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం భూమిని గుర్తించాలి



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కోసం అవసరమైన ప్రభుత్వ భూమిని తక్షణమే గుర్తించి నివేదిక అందించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు భూమి గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ వారు శనివారం పెంచికల్‌పేట్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి దోహదపడే ఈ భారీ ప్రాజెక్టుకు రెవెన్యూ శాఖ పరిధిలోనే భూమిని గుర్తించాలని కోరారు. ఎల్కపల్లి శివారులోని సర్వే నంబర్ 61లో సుమారు 1,672 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, రైతుల సాగు భూములు మినహాయించి మిగిలిన భూమిని సర్వే చేయాలని తెలిపారు. గతంలో అటవీ శాఖకు కేటాయించిన భూమి ఎంత, ప్రస్తుతం వారి ఆధీనంలో ఉన్నది ఎంత, రెవెన్యూ వద్ద మిగిలినది ఎంత అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. భూములను పరిరక్షిస్తూ పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు భక్తు రాంచందర్, చప్పిడే రవీందర్, పోర్తేటి వెంకటేష్, బిఆర్ఎస్ మండల నాయకులు చౌదరి తిరుపతి, జాజీమోగ్గ శ్రీనివాస్, సాధన కమిటీ జెఎసి కన్వీనర్ బిట్టు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, సిర్పూర్ ఆరె కుల అధ్యక్షుడు చెప్పిడే సత్యనారాయణ, సిద్ధార్థ సేవా సమితి అధ్యక్షుడు లహన్ రాజ్, నాయకులు అల్లూరి రాజు, సామల రాజన్న, పుల్గం దామాజి, ఎల్కరి లచ్చన్న, ముజాఖిర్, తెలిగే రమేష్, డొకే నారాయణ, పాగిడే అనంతరావు, బొట్టుపల్లి హరీష్, సమీకృత గురుకుల పాఠశాల సాధన జెఎసి కన్వీనర్ ఎలగందుల తిరుపతి పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** సమాజానికి ఉపాధ్యాయుడు దిక్సూచి అని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎనలేనిదని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కలెక్టర్, ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, విద్యాబుద్ధులు నేర్పి భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులేనని పేర్కొన్నారు. విద్యారంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు మార్గదర్శకులని, జిల్లాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావడానికి మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. సివిల్ సర్వీసెస్ వైపు ప్రోత్సహించిన ఉపాధ్యాయులే తన ఎదుగుదలకు కారణమని కలెక్టర్ గుర్తుచేసుకున్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 52 మందిని శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించి అభినందించారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఈఓ రాజు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులుపాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయుడు బత్తుల రాజయ్యకు మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రశంసా పత్రం అందజేశారు.నా సేవలను గుర్తించి నాకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసిన ఉన్నత అధికారులకు పాఠశాల బృందం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమాచారం తెలుసుకున్న మండల దళిత సంఘాల నాయకులు ఉత్తమ ఉపాధ్యాయుని శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు సాగరిక, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుమలత, జాకియా, రాజశేఖర్, దుబాసి సంజీవ్, టంకరి లక్ష్మణ్, బండారి సిద్ధరాములు, రాగుల బాబు పాల్గొన్నారు.



## నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్ట్

నకిలీవి తయారుచేస్తే
చర్యలు తప్పవు : సిపి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బోధన్ పట్టణంలో నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్ట్ చేసినట్లు సిపి సాయిచైతన్య తెలిపారు. శనివారం కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బోధన్ పట్టణం రాకాసిపేట్ సహారా మీసేవ కేంద్రంగా నకిలీ ప్రభుత్వ సర్టిఫికెట్లు తయారీ నిర్వాహకుల గుట్టు రట్టు చేసామన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిసిఎస్ ఎసిపి శ్రీవైలం, సిసిఎస్ సిబ్బంది బోధన సిబ్బంది కలిసి రాకాసిపేట్ వద్ద మసీదు దగ్గర సహారీ మీ సేవ కేంద్రంలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీలలో మీసేవ ఆపరేటర్ షేక్ వసీమ్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని దురాశతో గత రెండు సంవత్సరాల నుంచి మీసేవ యజమాని మహ్మద్ ముక్రమ్ ఇతరులతో కలిసి మీసేవ సర్టిఫికెట్లు తయారుచేసి ఇస్తున్నాడని ఈ సర్టిఫికెట్లపై సంబంధిత రబ్బర్ స్టాంపులు వేసి ఓరిజినల్ సర్టిఫికెట్లకు రూ.5 వేల నుంచి 10 వేల వరకు వసూలు చేసి పంచుకునే వారని ఆ సర్టిఫికెట్లను తీసుకున్న వారు మోసపూరితంగా ప్రభుత్వం నుంచి లబ్ధి పొందుటకు నకిలీ సర్టిఫికెట్లను ఉపయోగించినట్లు తెలిసిందన్నారు. మీసేవ కేంద్రాలలో నకిలీ సర్టిఫికెట్లు తయారుచేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. నిర్వాహక్కుల నుంచి నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నకిలీ మీసేవ సర్టిఫికెట్లు ఐదు, 22 జనన ధృవీకరణ జిరాక్స్ పత్రాలు, మీసేవ ఖాళీ ఓరిజినల సర్టిఫికెట్లు 38, రబ్బర్ స్టాంపు, తయారుచేసిన నకిలీ టీసీ 13 బోనఫైడ్లు, షాదీముబారక్‌కు సంబంధించి తయారుచేసిన నకిలీ జిరాక్స్ కాపీలు, కలర్ ప్రింటర్, ముద్దాయిల రెండు సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకుని వారిపై చట్టపరంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిఆపరు. ఈ దర్యాప్తులో సహకరించిన ఎసిపి శ్రీనివాస్, సిఐ వెంకటనారాయణ, ఎస్ఐ రామ్, సిసిఎస్ సిబ్బంది సిఐ అజయ్, ఎస్ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ అనిల్, గంగప్రసాద్, గంగారాం, శివకృష్ణలను సిపి అభినందించారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

వేగవంతంగా కేసుల పరిష్కారానికి పోలీస్, న్యాయశాఖల సమన్వయ సమావేశం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అర్హత కలిగిన క్రిమినల్ కాంపౌండబుల్ కేసులను రాబోయే జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు పోలీస్ న్యాయశాఖల అధికారులు సన్నద్ధమవుతున్నారు.సెప్టెంబర్ 12న నిర్వహించనున్న ఈ కార్యక్రమం విజయవంతం కోసం పోలీస్, ప్రాసిక్యూషన్, న్యాయశాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులను సమర్థవంతంగా గురించే ప్రక్రియ, బాధితులు మరియు కక్షిదారులతో సమన్వయం చేసుకోవడం, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడంపై విస్తృతంగా చర్చించారు.కేసుల వివరాలను సకాలంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి అప్‌డేట్ చేయడం ద్వారా పరిష్కారాన్ని సులభతరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో పోలీసు, ప్రాసిక్యూషన్ మరియు న్యాయస్థానాల మధ్య సమర్థవంతమైన సమన్వయం అత్యంత కీలకమని స్పష్టం చేశారు.దర్యాప్తు అధికారులు నాణ్యమైన దర్యాప్తును చేపట్టి, కోర్టు ఆదేశాల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు.తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా లోక్‌అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్. శ్రీవాణి తెలిపారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి పి. రవీందర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేవేందర్, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, పలువురు సీఐలు, ఎస్ఐలు, సిడిఓలు, న్యాయస్థాన అధికారులు పాల్గొన్నారు.టైగర్స్ టాస్క్ ఫోర్స్ భారీ విజయం 25 ఆలయ చోడీలు, హౌస్ బ్రేకింగ్ కేసుల ఛేదన, 12 కిలోల వెండి స్వాధీనం*నిర్మల్ జిల్లావ్యాప్తంగా వరుసగా ఆలయాలు, ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర ముఠా ఆటను జిల్లా పోలీసులు విజయవంతంగా కట్టికట్టారు. దొంగతనాల నియంత్రణ పాత కేసుల ఛేదన కోసం జిల్లా ఎస్పి డా. జి. జానకి షర్మిల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'టైగర్స్ టాస్క్ ఫోర్స్' బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను అదుపులోకి తీసుకుంది. భైంసా ఎఎస్‌పి, నిర్మల్ డిఎస్‌పిల పర్యవేక్షణలో సిసి కెమెరా ఫుటేజీలు, నిందితుల కదలికలు, గత నేరాల చరిత్రను సమగ్రంగా విశ్లేషించి ఈ దర్యాప్తును పూర్తి చేశారు.పోలీసుల లోతైన దర్యాప్తులో అరెస్టయిన మారేపెద్ది రాజశేఖర్, గడ్చంద రాజేశ్వర్, కల్లద్దవార్ శ్రీకాంత్, సారా సాయికిరణ్ అనే నలుగురు నిందితులకు మొత్తం 25 చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయింది. వీటిలో నిర్మల్ జిల్లాలోని అయ్యప్ప ఆలయం, మహాలక్ష్మి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు పలు ఇళ్లలో జరిగిన 16 కేసులకు సంబంధించి దొంగిలించబడిన సొత్తును రికవరీ చేశారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు, గన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసులలోనూ ఈ ముఠా పాత్ర ఉన్నట్లు తేలింది. నిందితుల నుంచి నిస్సాన్ మాగ్నైట్ కారు, 12 కిలోల వెండి ఆభరణాలు మరియు కిరీటాలు, మెల్టింగ్ మెషిన్, గ్యాస్ పైప్ మెషిన్ 67,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.సమన్వయంతో వ్యవహరించి కేసులను వేగంగా ఛేదించిన 'టైగర్స్ టాస్క్ ఫోర్స్' బృందాన్ని, భైంసా ఎఎస్‌పి సాయి కిరణ్, నిర్మల్ డిఎస్‌పి శ్రీనివాస్, సిఐలు, ఎస్ఐలు ఇతర సిబ్బందిని ఎస్‌పి డా. జి. జానకి షర్మిల ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో దొంగతనాల అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని, ప్రజలు తమ నివాసాలు మరియు ఆలయాల వద్ద భద్రతా చర్యలు పాటిస్తూ అనుమానాస్పద వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కుప్టీ ఘాట్‌లో మృత్యుఘంటికలు

నిత్యం నరకయాతన
అనుభవిస్తున్న ప్రయాణికులు




**ప్రజాపక్షం/నేరడిగొండ:** 44వ జాతీయ రహదారిపై ఉన్న కుప్టీ ఘాట్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారి వాహనదారుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. పాత బ్రిడ్జి మరమ్మత్తుల కారణంగా ఒకే వైపు నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో ఈ మార్గం మృత్యుకూపంగా పరిణమించింది. ఈ బ్లాక్ స్పాట్ పరిధిలో గత కొన్ని రోజులుగా వరుస ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి నిర్మల్ నుంచి ఆదిలాబాద్ పైపు వెళ్తున్న టమాటా లోడు ట్యాంకర్ ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. అధికారులు వెంటనే స్పందించి, మరమ్మతు పనులను వేగవంతం చేసి, ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కొరుతున్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
ఆదివారం
06-09-2026
www.prajapaksham.in

‘ఆ నలుగురు’, ‘మధుమాసం’, ‘అందరి బంధువయా’, ఇదీ సంగతి ‘ఆటగదరా శివా’ తదితర చిత్రాలతో విలక్షణమైన దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారు చంద్ర సిద్ధార్థ్. ఆయన తాజాగా రూపొందించిన చిత్రం ‘ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మొదలగువారు’.

రీల్



## ‘ధర్మన్’ రెండవ షెడ్యూల్ పూర్తి

సూపర్ స్టార్ రజనీకాంత్ ‘ధర్మన్’ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ‘ది డెడ్లీ డాక్టర్’ అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో విడుదలైన ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా మేకర్స్ రెండవ షెడ్యూల్ పూర్తి చేశారు. ఈ సందర్భం గా రిలీజ్ చేసిన వీడియోలో సూపర్ స్టార్ తనదైన చరిస్మా, ప్రజెన్స్‌తో అదరగొట్టారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.కమల్ హాసన్, సూపర్ స్టార్ రజనీకాంత్ మధ్య ఉన్నంత స్నేహబంధం చాలా అరుదు. భారతీయ చలనచిత్ర రంగంలో ఐదు దశాబ్దాలకు పైగా అగ్రస్థానంలో కొనసాగుతున్న ఈ ఇద్దరు దిగ్గజాలు, ‘ధర్మన్’ చిత్రం ద్వారా నిర్మాతనటుడిగా మొదటిసారిగా కలిసి పనిచేస్తున్నారు. రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్ నిర్మిస్తున్న ఈ చిత్రం, ఆర్‌కెఎఫ్‌ఐ నిర్మాణంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించే మొదటి సినిమా కావడం విశేషం. భారతీయ చలనచిత్ర రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, అత్యంత ఆసక్తికరమైన యువ దర్శకులలో ఒకరిగా పేరు తెచ్చుకున్న అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.రజనీకాంత్ సరసన నటి సిమ్రాన్, రాశీ ఖన్నా ఈ చిత్రంలో నటిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలు ‘అన్బరివ్’ ద్వయం యాక్షన్ కొరియోగ్రఫీని నిర్వహిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా నికేత్ బొమ్మిరెడ్డి, కార్తీక్ రాజ్‌కుమార్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రదీప్ ఇ. రాఘవ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తుండగా, అన్నదురై ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. అలాగే డిస్నీ సంస్థ దీనికి సహనిర్మాతగా వ్యవహరిస్తోంది

## 7 నుంచి హైదరాబాద్‌లో ‘కాకా’ కీలక షెడ్యూల్



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ మూవీ ‘కాకా’. వెంకట్ కె నారాయణ కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మెగాస్టార్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సినిమాపై అంచనాలు పెంచిందిప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సెప్టెంబర్ 7 నుంచి హైదరాబాద్‌లో ‘కాకా’ నెక్స్ట్ భారీ షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ లెన్తీ షెడ్యూల్‌లో కీలకమైన సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన వర్కింగ్ స్టిల్‌లో మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి షూటింగ్ లొకేషన్ లో డిస్కస్ చేస్తూ కనిపించారు. 2027 జనవరి 13న సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. చిరంజీవి, అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్నారు.

## టార్టాయిస్‌లో ‘నీ పరిచయం’ పాట ఆవిష్కరణ



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ‘టార్టాయిస్‘. ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ‘టార్టాయిస్‘ సినిమాను ఎస్‌కె గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌విఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. మానస కుమార్, సంతోష్ ఇమ్మడి కో ప్రొడ్యూసర్స్ గా వ్యవహరిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌తో అందరి దృష్టినీ ఆకర్షించిందీ సినిమా. ఈ చిత్రంలోని ‘నీ పరిచయం..’ పాటను రిలీజ్ చేశారు.

# ఆడియన్స్ కామెడీని చూసే విధానం మారింది

- దర్శకత్వం చేయాలనుంది..కానీ ప్రస్తుతం నటన మీదే దృష్టి
- ‘ప్రజాపక్షం’ ఇంటర్వ్యూలో హీరో అల్లరి నరేష్



తెలుగు తెరపై హాస్య చిత్రాలు పండించడంలో జంధ్యాల తరువాత వెంటనే వచ్చే పేరు ఇవివి సత్యనారాయణ. ఇవివి కామెడీ సినిమాలు తియ్యడంలో ఎంత ఘనుడో కామెడీ సినిమాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించడంలో ఇవివి వారసుడు అల్లరి నరేష్ అంతే ఘనుడు. అల్లరి సినిమాతో అనుకోకుండా హీరోగా మారిన నరేష్ అప్పటి నుంచి ఆయన్ని అందరూ అల్లరి నరేష్ గానే పిలుస్తున్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన కుర్ర హీరోల్లో అతి తక్కువ సమయంలో యాభై సినిమాలు పూర్తి చేసిన ఏకైక నటుడు అల్లరి నరేష్. ఇటీవల ‘ప్రజాపక్షం’ కోసం అల్లరి నరేష్ ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అనేక విషయాలు వెల్లడించారు.

**ప్రశ్న : అల్లరి సినిమాతో అల్లరి నరేష్‌గా మారిపోయిన మీరు మొదటి సినిమా అనుభూతి చెప్తారా?**

నరేష్ : నేను ఎలా సినిమా రంగంలోకి వచ్చానో మీ అందరికీ తెలుసు.. ప్రేక్షకులకు కూడా తెలుసు. మా నాన్న గారు ఇవివి సత్యనారాయణ గారు ఎన్నో గొప్ప గొప్ప సినిమాలు చేశారు. చిన్నప్పటి నుంచే నాకు షూటింగ్స్ అలవాటు. రవిబాబు నేను రెగ్యులర్‌గా కలిసేవాళ్ళం. ఒకరోజు అల్లరి సినిమా గురించి చెప్పారు. చేసేద్దాం అన్నారు...చేసిన. సూపర్ హిట్ అయింది. ఇప్పటికే అందరూ అల్లరి నరేష్ అని అంటారు మీకు తెలిసిందే కదా.

**ప్రశ్న : అతి తక్కువ సమయంలో కెరీర్‌లో యాభై సినిమాలు పూర్తి చేశారు ఏమనిపిస్తోంది ?**

నరేష్ : చాలా సంతోషంగా ఉంది. నిజంగా నేను ప్లాన్ చేసి చేసినవేమి కాదు. అలా ఆఫర్స్ వచ్చాయి. మంచి కథలు వచ్చాయి. చేసుకుంటూ వెళ్ళాను. యాభై దాటిపోయాయి.

**ప్రశ్న : నాందితో మీ జానర్ నుంచి బయటికి వచ్చారు ? కారణం ?**

నరేష్ : నాంది స్టోరీ నాకు చాలా బాగా నచ్చింది. విజయ్ కనకమేడల దర్శకుడు చాలా బాగా తీశాడు. మంచి క్రైం కోర్టు డ్రామా ఇది. అందరూ బాగా ఆదరించారు. అప్పటి వరకు కామెడీ సినిమాల్లోనే చూసిన నన్ను ప్రేక్షకులు నాందిలో కొత్త నరేష్‌ను చూశారు. ఆ తరువాత కూడా కొన్ని సీరియస్ క్యారెక్టర్స్ చేశాను. కొన్ని సక్సెస్ అవుతాయి కొన్ని కావు. కానీ నాంది సినిమా ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా.

**ప్రశ్న : మళ్ళీ మీ కామెడీ జానర్‌కు వచ్చినట్టున్నారు ? కామెడీ సినిమాలను ఆదరిస్తారా ?**

నరేష్ : నిజానికి ఆడియన్స్ కామెడీని చూసే విధానం మారింది. నా బడీ లాంగ్వేజ్ సరిపడే కామెడీని డైరెక్టర్ డిజైన్ చేశారు. అలాగే స్వర్గం, నరకం, ఇంద్రలోకం ఇలాంటి కథలు చూసి చాలా కాలం అయింది. ఆడియన్స్, అలాగే చిన్నపిల్లలు చాలా ఎక్సైట్ అవుతారు. చాలా క్లీన్ కామెడీ ఇందులో ఉంటుంది. ఫ్యామిలీ అందరూ కలిసి చూసేలా సినిమా కామెడీ సినిమాలు,. కామెడీ కూడా చాలా ఆర్గానిక్‌గా ఉంటుంది. ఈ మధ్యకాలంలో ఎక్కువ డార్క్ జోన్ సినిమాలు వచ్చాయి. ఇప్పుడు మళ్లీ ప్రేక్షకులు లైట్ హార్టెడ్‌గా ఉండే కామెడీ సినిమాలు, ఎంటర్‌టైనర్స్ కోరుకుంటున్నారు. ఇకపై నేను కూడా రెండు కామెడీ సినిమాలు, ఒక సీరియస్ సినిమా.. ఇలా బ్యాలెన్స్ చేసుకుంటూ సినిమాలు చేయాలని భావిస్తున్నాను.

**ప్రశ్న : దర్శకత్వం చేయాలని ఆలోచన ఉందా?**

నరేష్ : ప్రస్తుతానికి నా దృష్టి మొత్తం నటనపైనే ఉంది. నటుడిగా మంచి విజయవంతమైన చిత్రాలు చేయడం పైన నా దృష్టి ఉంది. కానీ తప్పకుండ డైరెక్షన్ చేస్తా

**ప్రశ్న : ‘సుడిగాడు 2’ సీక్వెల్ ఎప్పుడు?**

నరేష్ : ‘సుడిగాడు 2’ చేయాలని నాకూ ఉంది. కాకపోతే ఒకప్పటి పరిస్థితులకి, ఇప్పుడు పరిస్థితులకి చాలా మార్పులు వచ్చాయి. ‘సుడిగాడు’ సినిమాకి దాదాపు 108 స్పూఫులు చేశాము. అవన్నీ కూడా ఆ డైరెక్టర్లు, నిర్మాతల పర్మిషన్ తీసుకున్నాం. కాకపోతే ఇప్పుడు కాపీరైట్ ఇష్యూ ఎక్కువగా ఉంది. రిలీజ్ సమయంలో ఎవరు ఎలాంటి అబ్జెక్షన్ చెప్తారో, ఎలాంటి కాపీరైట్ ఇష్యూ వస్తుందో అనేది మన చేతిలో ఉండదు. అందుకే చేసేటప్పుడు ఇవన్నీ విషయాలు పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రశ్న : ఇప్పటి యంగ్ డైరెక్టర్స్‌లో ఎవరితో సినిమా చేయాలని ఉంది?**

నరేష్ : నాకు రితేష్ రానా స్టైల్ చాలా నచ్చింది. ‘మత్తు వదలరా’ సినిమా నాకు చాలా ఇష్టం. ఆయన కథల్లో చాలా డీటెయిల్‌గా ఉంటుంది. కాంటెంపరరీగా ఇప్పుడు జరుగుతున్న ఇష్యూస్ అన్నీ కూడా చాలా ఎంటర్‌టైనింగ్‌గా తీసుకొస్తారు. అలాగే తరుణ్ భాస్కర్ లాంటి డైరెక్టర్స్‌తో కూడా పనిచేయాలని ఉంది.

**ప్రశ్న: ‘మహర్షి’ తర్వాత మీ నుంచి ఎక్కువగా మల్టీస్టార్స్ రాలేదనిపిస్తుంది?**

నరేష్ : శంభో శివ శంభో నుంచి మల్టీస్టారర్ కథలలో చేస్తున్నాను. అలాంటి మంచి కథలతో దర్శకులు వచ్చినప్పుడు ఖచ్చితంగా చేస్తాను. ‘మహర్షి’ తర్వాత నా సామి రంగా’లో నాగార్జున గారే నా పేరుని సూచించారు. ఆ సినిమా చేశాను. మంచి కథలు వస్తే మల్టీస్టార్స్ చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

**ప్రశ్న : రాబోయే సినిమాల గురించి చెప్పండి ?**

నరేష్ : ‘ఆల్కహాల్’ రిలీజ్‌కు రెడీగా ఉంది. అలాగే ‘కనకదుర్గ’ షూటింగ్ జరుగుతోంది. ఇంకా కొన్ని కథలు వింటున్నాను.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌పై సర్కార్ ఫోకస్

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్టాత్మక సదస్సు..
- ఏర్పాట్లపై మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నతస్థాయి సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా నిలబెట్టే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ‘తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2026’ ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ప్రతిష్టాత్మక సదస్సు ఏర్పాట్లపై పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అబిడ్స్‌లోని పరిశ్రమల శాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సదస్సు నిర్వహణకు సంబంధించిన కీలక అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల్లో నిర్వహించనున్న రోడ్‌షోలు, పెట్టుబడులకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, ప్రతిపాదిత ఎంవోయూలు తదితర అంశాలపై సమీక్షించారు. సదస్సును అంతర్జాతీయ స్థాయిలో విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. సమావేశంలో టిజిఐఐసి ఎండి శశాంక్, ఇన్వెస్ట్ తెలంగాణ సిఇఒ అజిత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తితో పాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలపై 7న ఉన్నతస్థాయి సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లు, కా ర్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిం ది. ఈ నెల 7న సచివాలయంలో రవాణా, కార్మిక శాఖల ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నా రు. రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో ఆటో కార్మిక సంఘాల జెఎసి ప్రతినిధులతో సోమవారం సాయ ంత్రం 4 గంటలకు సమావేశం జరగనుంది. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, అగ్రిగేటర్ పాలసీ, మీటర్ ఛార్జీల పెంపు, డీజిల్, పెట్రోల్ ఆటోలకు రీట్రోఫిట్‌మెంట్ వంటి అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. రీట్రోఫిట్‌మెంట్‌కు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించే ప్రతిపాదనకు ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో దీనిపైనా చర్చ జరగనుంది. గత నెల 23న ఆటో యూనియన్ల జెఎసి ప్రతినిధులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల సమన్వయంతో సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమావేశంలో సమగ్రంగా చర్చించి ఆటో డ్రైవర్లకు ప్రయోజనం చేకూరేలా నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని మంత్రి ఆదేశించారు. ఆటో యూనియన్ల జెఎసి ప్రతినిధులను కూడా సమావేశానికి ఆహ్వానించాలని రవాణా శాఖ కమిషనర్‌కు సూచించారు.

## జపాన్, జర్మనీలతో భాగస్వామ్యాలు.. తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు



**119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో అత్యుత్తమ శిక్షణ: మంత్రి వివేక్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతను అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జర్మనీలో టామ్‌కామ్ ద్వారా విజయవంతంగా అమలు చేస్తున్న విదేశీ ఉపాధి కార్యక్రమాలను జపాన్‌కు విస్తరిస్తున్నామని తెలిపారు. జపాన్‌లో ఇంజినీర్లు, ఐటిఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు, నర్సులు, డ్రైవర్లకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. జపాన్‌లో పర్యటన సందర్భంగా ప్రభుత్వాలు, యూనివర్సిటీలు, పరిశ్రమలతో చర్చలు జరిపామని, తెలంగాణ యువతకు శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సంస్థాగత భాగస్వామ్యాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

**సిబ్బంది ఉద్యోగ భద్రత, ప్రమోషన్లలో ఎలాంటి మార్పు ఉండదు..**

గతంలో నిర్లక్ష్యానికి గురైన ఐటిఐలను ఆధునిక అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఎటిసి) అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 65 ఎటిసిలు ఉండగా, అదనంగా 54 ఏర్పాటు చేసి మొత్తం 119 ఎటిసిలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. సిఎన్‌సి మెషిన్లు, రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాలతో శిక్షణ ఇస్తామన్నారు. సెమీకండక్టర్లు, రోబోటిక్స్, ఆటోమేషన్, డిఫెన్స్ వంటి భవిష్యత్ రంగాల్లో పెరుగుతున్న అవకాశాలకు అనుగుణంగా కొత్త కరిక్యులమ్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలల భూములను ప్రభుత్వం విక్రయించబోతోందన్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. పాలిటెక్నిక్ భూములు అమ్మే ఆలోచన ప్రభుత్వానికి లేదని, ఇది పూర్తిగా దుష్ప్రచారం అని స్పష్టం చేశారు. కొత్త ఎటిసిల కోసం ప్రభుత్వం స్వయంగా 250 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిందని తెలిపారు. పాలిటెక్నిక్ సిబ్బంది ఉద్యోగ భద్రత, సర్వీస్ కండిషన్స్, ప్రమోషన్లలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో తెలంగాణ యువత మంచి ఉద్యోగాలు సాధించడంతో పాటు అక్కడి సాంకేతికత, పారిశ్రామిక ప్రమాణాలు, పని సంస్కృతిని నేర్చుకుని తిరిగి రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

## భూ దోపిడీకే 22ఎ

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ పట్టాలు, అనుమతులు ఉన్న స్థలాలను కూడా రాత్రికి రాత్రే 22ఎ జాబితాలో చేర్చి, రియల్ ఎస్టేట్ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు 60 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. తెలంగాణను ‘ఆర్‌ఆర్ రియల్ ఎస్టేట్ కంపెనీ’గా మార్చి ఢిల్లీకి కప్పం కడుతున్నారని మండిపడ్డారు. పేదల భూములను 22ఎ నుంచి బేషరతుగా తొలగించకపోతే సడక్ నుంచి సదన్ వరకు పోరాటం ఉధృతం చేస్తామని కిషన్ రెడ్డి హెచ్చరించారు. రామచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా క్షీణించిందని, సొంత భూములపై హక్కులను కాలరాయడం మానవ హక్కుల ఉల్లంఘనేనని అన్నారు. ధరణిలో 15 శాతం ఉన్న కమీషన్లు భూభారతిలో 30 శాతానికి చేరాయని ఆరోపించారు. ఈ 22ఎ అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ అధికారులు ఐఎఎస్, ఐపిఎస్ బాధ్యతలను మరిచి పాలకపక్షం చెప్పినట్లు వింటే భవిష్యత్తులో జైలుపాలు కావాల్సి వస్తుందని హెచ్చరించారు. సభాధ్యక్షత వహించిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కొరవడిందని, ‘రైట్ టు ప్రాపర్టీ’ కాస్తా ‘రేట్ టు ప్రాపర్టీ’గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రజా ఆస్తులను, రైతుల హక్కులను కాపాడే వరకు బిజెపి బాధితుల పక్షాన రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు బీజేపీ రాష్ట్ర పదాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలుడి కిడ్నాప్

(మొదటి పేజీ తరువాయి)

పట్టణకేంద్రంలో ఉన్న మాతా శిశు కేంద్రంలో చాక్లెట్ కొనిస్తానని ఓ మహిళ మూడేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసింది. మహిళ బాలుడిని కిడ్నాప్ చేసిన దృశ్యాలు సిసి ఫుటేజీలో రికార్డు కావటంతో మహిళ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లావ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేసిన ఉన్నతాధికారులు మహిళను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు విడిపోయి గాలిస్తున్నారు. బాల్కొండ మండలంలోని నాగపూర్‌కు చెందిన దంపతులు సంధ్యారాణి–నరేష్ తమ ఇద్దరి పిల్లలతో జిజిహెచ్‌కు అనుబంధంగా ఉన్న మాతా శిశు ఆస్పత్రికి డెలివరీ మూడు రోజుల క్రితం వచ్చారు. సంధ్యారాణి, నరేష్ డాక్టర్లతో మాట్లాడుతుండగా, వారి ఇద్దరు పిల్లలు ఆస్పత్రి ఆవరణలో ఆడుకుంటున్నారు. ఇంతలోనే చిన్నకుమారుడు వేదాన్ష్(3) కనిపించకుండా పోయాడు. డాక్టర్ల దగ్గరనుంచి వచ్చిన తల్లిదండ్రులు బాలుడిని వెతకడం ప్రారంభించారు. అయితే వేదాన్ష్ సమాచారం కోసం పెద్దకుమారుడు నియాన్ష్‌ను అడగగా ఎవరో తమ్ముడికి చాక్లెట్ కొనిస్తానని చెప్పి ఎత్తుకెళ్లినట్లు చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. 112 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు మాతా శిశు కేంద్రానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం బాలుడిని కిడ్నాప్ చేసిన మహిళ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు మహిళకు సంబంధించిన ఫొటోలు పంపించి పోలీసులను అప్రమత్తం చేశారు.

## దిద్దుబాటు

(మొదటి పేజీ తరువాయి)

తొలగిస్తారు. ఆ స్థానంలో ‘‘ఈక్వెల్ ఎర్త్ ప్రొజెక్షన్’’ పేరుతో ఎనిమిదేళ్ళక్రితం రూపొందించిన ప్రపంచ పటం ఆధారంగా ఆఫ్రికాఖండం దాని నిజ పరిమాణంలో దర్శనం ఇస్తుంది.
భూగోళ శాస్త్రవేత్త,ప్రపంచపట నిర్మాత గెరార్డస్ మెర్కేటర్ 1569లో సముద్ర ప్రయాణాలకోసం రూపొందించిన ప్రపంచపటాన్ని ఇతర పటాలతో వర్తింపజేసి చూస్తే భూమధ్య రేఖకు దూరంగా ఉన్న భూభాగాలు పెద్దవిగా కనిపిస్తాయి. దగ్గరగా ఉన్న భూభాగాలు చిన్నవిగా, ధ్రువాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు పెద్దవిగా కనిపిస్తాయి. అందువల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపమైన గ్రీన్‌లాండ్‌తో పాటు అంటార్కిటికా ఖండం కూడా చాలా పెద్దవిగా కనిపిస్తాయి. 20వ శతాబ్దంలో మెర్కేటర్ పటం వినియోగం తగ్గిపోయింది. కానీ 21వ శతాబ్దంలో ఆన్‌లైన్ వ్యవస్థ కారణంగా అందుకు అనుగుణంగా సముద్ర రవాణా రాకపోకలకు మెర్కేటర్ ప్రపంచ పటం వినియోగం పెరిగింది.కానీ సాధారణంగా వాడుకలో ఉన్న ఈ సంప్రదాయబద్ధమైన మెర్కేటర్ ప్రపంచపటం 16వ శతాబ్దంలో వాడుకలోకి వచ్చినప్పటి నుండి విమర్శలకు గురవుతూ వస్తోంది. ఐతే ఆఫ్రికా సైజు విషయంలో అమెరికా కూడా ఇది దురదృష్టకరమైన పొరపాటు అని విచారం వ్యక్తం చేసింది.మెర్కేటర్ ప్రపంచపటంలో తప్పిదం వల్ల భూమధ్యరేఖ దగ్గరగా ఉన్న దేశాల అవసరాలు,వాటికి అభివృద్ధికి తగినట్టుగా ఉండవని,వాటి సామర్థ్యాన్ని ప్రపంచం కూడా తక్కువగా అంచనావేస్తుందని విమర్శలు వెల్లువెత్తాయి. వాస్తవానికి ఈ ప్రపంచ పటంలో మార్పులకు ఐక్యరాజ్యసమితి తీర్మానం అవసరం లేకపోయినప్పటికీ ప్రపంచ వేదిక ద్వారా అధికారిక ఆమోదం లభించింది. యూరప్ దేశాలకు చెందిన సాహస యాత్రికులు సముద్ర ప్రయాణం ద్వారా ప్రపంచాన్ని అన్వేషించడానికి వీలుగా మెర్కేటర్ ఆనాడు ఈ ప్రపంచపటాన్ని రూపొందించారు.భూమికి ఉన్న వంకర టింకరల ఆధారంగా ఈ పటాన్ని గీసినప్పుడల్లా మార్పులూ చేర్పులూ చేయాల్సి వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రపంచ పట నిర్మాణకర్తల బృందం ఒకటి 2018లో ‘‘ఈక్వెల్ ఎర్త్ ప్రొజెక్షన్’’ పేరుతో సమాన వైశాల్యంతో ఒక పటాన్ని రూపొందించింది. ఆఫ్రికా ఖండం 30.40 మిలియన్ చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించి ఉంది. అంటే 700.51 కోట్ల ఎకరాలతో సమానం.

## ప్రభుత్వం బర్తరఫ్

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వలేదన్నారు. జాబ్ నోటిఫికేషన్లు లేవని లూటిఫికేషన్ మాత్రం జోరుగా సాగుతోందన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున అశోక్ నగర్ చౌరస్తాలో నిరుద్యోగులతో మాట్లాడిన రాహుల్ గాంధీ అడ్రస్ లేకుండా పోయిండని, ఆయనకు రాష్ట్రానికి వచ్చేందుకు ముఖం లేదని ఎద్దేవా చేశారు. అడ్డమైన జీవోలు తెచ్చి పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్ ను బలిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను అసెంబ్లీలో పోరాడుతానని హామీ ఇచ్చారు. ఢిల్లీలో పిల్లలు కదం తొక్కితే మోదీ గజగజ వణికిపోయిండని, మోదీనే గడగడలాడించినవాళ్లకు ఈ కేడీ ఒక లెక్కనా అని ధ్వజమెత్తారు. కమీషన్ల మత్తులో కాంగ్రెస్ వాళ్లు ఉంటే... కంపెనీలను బిజెపి వాళ్లు గుజరాత్‌కు ఎత్తుకపోతున్నారని ఆరోపించారు. ఇక్కడున్న కంపెనీలను గుజరాత్ కు తన్నుకొని పోవడం జాతీయవాదం అయితదా అని ప్రశ్నించారు. మన సెమీకండక్టర్ పరిశ్రమలను మెడ మీద కత్తిపెట్టి ఎత్తుకుపోతుంటే ఇక్కడున్న 8 మంది బిజెపి ఎంపీలు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును బీజేపీ ఎంపీ పాకిస్తాన్ ఏర్పాటుతో పోలిస్తే కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు కనీసం ఖండించలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో సబ్బండ వర్గాలను మోసం చేసిందని, అందరికీ గంపగుత్తగా గుండు కొట్టారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, వొడితల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com